www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

ఆదివారం | 1-3-2026 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 354 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి రా.7.09 తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుష్యమి ఉ.8.34 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.8.59-10.32, దుర్ముహూర్తం: సా.4.44-5.31, అమృతఘడియలు: తె. 6.18 మొదలు, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 6.18 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru






47 YEARS OF EXCELLENCE
SRAMAYEVA JAYATHE
NARAYANA
EDUCATIONAL INSTITUTIONS
గత JEE-MAIN ఫలితాలను శాసించి..
2026 ఫలితాల్లో అందరిని అధిగమించి...
తెలుగు రాష్ట్రాలతో పాటు ఆల్ ఇండియా నెం.1 గా నారాయణ.
JEE-MAIN 2026
SESSION-1 లో
తెలుగు రాష్ట్రాల్లోని ఏ ఇతర
విద్యాసంస్థకూ సాధ్యం కాని ఫలితాలు
ఒక్క నారాయణకే సాధ్యం.
100 PERCENTILE SUBJECT WISE
35 STUDENTS
290 MARKS & ABOVE 5 STUDENTS
280 MARKS & ABOVE 14 STUDENTS
250 MARKS & ABOVE 98 STUDENTS
ఆంధ్రప్రదేశ్ స్టేట్ టాపర్
100 Percentile
N. MAHITH
APPL NO: 260310088709
Classroom Student
తెలంగాణ స్టేట్ టాపర్
One & Only 100 Percentile in Telangana
VIVAN SHARAD MAHISWARI
OUR OUTSTANDING PERFORMERS IN ANDHRA PRADESH
100 Percentile N G MAHITH
99.99 Percentile GOVIND PANDEY
99.98 Percentile VELDURTHI HARSHITH
99.98 Percentile SANGA JAGRUTH
99.97 Percentile ALLU ROHITH
99.97 Percentile M V CHARAN REDDY
99.96 Percentile BANKURU PRAVEEN
99.96 Percentile REDDI SAI SAHITHI
99.96 Percentile K BHUVANA KEERTHI
99.96 Percentile LIKKI SAI KUSHWANTH
99.96 Percentile S VENKATA VYSHALI
99.96 Percentile VASANTHU ANVI
99.95 Percentile YALLANKI MAHITHA
99.95 Percentile TANDYALA PAVAN SAI
99.94 Percentile M JAGADEESH
99.94 Percentile BHASWANTH KAVURI
99.94 Percentile BYTARU SAI CHARAN
99.94 Percentile V KHUSHAL REDDY
99.94 Percentile G V VAMSHIDHAR REDDY
99.93 Percentile M JASWANTH NAIDU
99.93 Percentile V REDDYPRASAD REDDY
99.93 Percentile KONDALA KANISHKA
99.92 Percentile BODDI DHEERAJ
99.92 Percentile B C SEKHARA RAO
99.92 Percentile P AKSHAY VASISTA
99.92 Percentile GORLE PRAVEEN
99.92 Percentile ARUMALLA PRAVEEN
99.91 Percentile B POORNACHAND
99.90 Percentile R V N SHANMUKHA
99.90 Percentile TUNGALA YASWITHA
99.90 Percentile PAIDI DINESH
99.90 Percentile M CHAKRA SRIKAR
And Many More...
Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice
తెలుగు రాష్ట్రాల్లో డాక్టర్ ఆశయం ఉన్న ప్రతి విద్యార్థి గమ్యస్థానం నారాయణ.
డాక్టర్ కలలు కనండి, నారాయణతో నిజం చేసుకోండి.
ప్రతిష్టాత్మక AIIMS, JIPMER కాలేజీల్లో సీట్లు సాధించిన తెలుగు రాష్ట్రాల నారాయణ విద్యార్థులు
రెండు తెలుగు రాష్ట్రాల టాపర్
1st RANK
AIR 18
K Jeevan Sai Kumar
App.No: 250410773906
CLASSROOM STUDENT
And Many More...
ADMISSIONS ARE IN PROGRESS
FOR ALL COURSES 2026-27
JEE (MAIN+ADV.) | NEET | FOUNDATION | BOARDS
Scan QR For Admission
Toll Free: 1800 102 3344 | www.narayanagroup.com
#YourDreamsAreOurDreams



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 1-3-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ


మంటల్లో టపాసుల తయారీ కేంద్రం


21 మంది బుగ్గి
10 మందికి గాయాలు

పేలిన ప్రాణాలు

'గోదావరి జిల్లా'లో మరో బాణసంచా విషాదం

- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో భారీ విస్ఫోటం
- శివారు పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్
- సింగారమ్మ జాతర కోసం భారీగా ఆర్డర్
- చిచ్చుబుడ్లలో మందు కూరుతుండగా నిప్పు
- నారబాంబులకు అంటుకొని వరుస పేలుళ్లు
- అర కిలోమీటరు ఎగిరి పడిన మృతదేహాలు
- మృతులకు రూ.20 లక్షల పరిహారం

పచ్చని పొలాల మధ్య విస్ఫోటాల చిచ్చు రేగింది. వేడుకల్లో వెలుగులు పంచే బాణసంచా... మరోసారి ప్రాణాలను పేల్చేసింది. గత దీపావళి ముందు జరిగిన ఘోరం మరువక ముందే... 'గోదావరి జిల్లా'లో మరో పెను విషాదం చోటు చేసుకుంది. నిర్లక్ష్యపు నిప్పు రాజుకుంది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం లోని బాణసంచా తయారీ కేంద్రంలో మరణ మృదంగం మోగింది. ఏకంగా 21 నిండు ప్రాణాలను బలి తీసుకుంది. మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో తయారీ కేంద్రం యజమాని కూడా ఉన్నారు. తయారీ కేంద్రం కుప్పకూలి... చుట్టుపక్కల ప్రాంతాలన్నీ పొగ చూరి... వాహనాలు ఛిద్రమై... మృతదేహాలు చెల్లా చెదురై... ఆ ప్రాంతం యుద్ధ భూమిని తలపించింది.


బాధితులకు సీఎం పరామర్శ

13, 14




ఇరాన్‌పై భీకర దాడి

200 జెట్లతో క్షిపణుల వర్షం | 201 మంది మృతి

విరుచుకుపడ్డ అమెరికా, ఇజ్రాయెల్

- టెహ్రాన్, ఇతర కీలక ప్రాంతాలపైకి భారీగా క్షిపణులు
- 500 లక్ష్యాలపై ఏకకాలంలో దాడి 11
- స్కూలుపై క్షిపణి.. 85 మంది పిల్లల మృతి 12
- ఖమేనీ నివాసంపైనా దాడులు.. జాడ తెలియని నేత
- ఆయన అల్లుడు, కోడలు మృతి చెందినట్టు వార్తలు
- ఇరాన్ రక్షణ మంత్రి, సైన్యాధిపతి మృతి: ఇజ్రాయెల్
- ఇరాన్ ప్రతిదాడులు.. ఇజ్రాయెల్‌పైకి భారీగా క్షిపణులు
- యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ దేశాల్లోని అమెరికా స్థావరాలపైనా క్షిపణులు, డ్రోన్లతో దాడులు




తిరుపతిలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్

నేడు అమరావతికి సీజేఐ

- పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న జస్టిస్ సూర్యకాంత్ 14
- జ్యుడీషియల్ అకాడమీ, అతిథి గృహానికి శంకుస్థాపన


విద్యార్థినికి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అందిస్తున్న సీఎం


ప్రతి ఒక్కరికీ 2.5 లక్షల ఆరోగ్య బీమా

- తుది దశలో కసరత్తు.. త్వరలో ప్రకటిస్తాం 2
- గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉచిత వ్యాక్సిన్
- పోలవరం నీళ్లు వంశధారకు తీసుకొస్తా
- జగన్ హయాంలో టీటీడీ పవిత్రతకు దెబ్బ
- నాటికి, నేటికి 'లడ్డూ'లో తేడా భక్తులే చెబుతున్నారు
- విజయనగరం జిల్లా పర్యటనలో చంద్రబాబు

చేతల్లో మా అభివృద్ధి: లోకేశ్

బ్లూ జెట్ హెల్త్‌కేర్ ఫార్మా కంపెనీకి భూమి పూజ





స్త్రీ శక్తి బస్సుల్లో దివ్యాంగులకు ఉచితం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. 40 శాతం, అంతకన్నా ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని స్పష్టం చేశారు. స్త్రీశక్తి పథకం వర్తించని బస్సుల్లో ఇప్పటికే అమలులో ఉన్న 50శాతం చార్జీ రాయితీ కొనసాగుతుంది. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

FORM IV
(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER ANDHRA JYOTHI

1. Place of Publication	:	Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupathi, Karimnagar, Ananthapur, Tadepalligudem, Warangal, Guntur, Kurnool, Nellore, Srikakulam, Rajamahendravaram, Khammam, Kadapa, Ongole, Nalgonda, Nizamabad, Mahaboobnagar.
2. Periodicity of its Publication	:	DAILY
3. Printer's name	:	KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of india	:	YES
(b) If a foreigner, The country of origin:		-
Address	:	Door No.: 8-2-293/82/J/68-B, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
4. Publisher's Name	:	KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of India	:	YES
(b) If a foreigner, The country of origin	:	-
Address	:	Door No.: 8-2-293/82/J/68-B,, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
5. Editor's Name	:	N.RAHUL KUMAR
Nationality	:	INDIAN
1 (a) Whether a citizen of India	:	YES
(b) If a foreigner, the country of origin:		-
Address	:	Plot.no.540, 2-105/111/540, Third Phase, Journalists Colony, AVN School, Gopanpally, Gachibowli, K.V.Rangareddy, Hyderabad - 500032, Telangana.
6. Name's and Addresses of individuals Who own the Newspaper and partners of Shareholding more than one percent of the total capital	:	
(a) Aamoda Publications Pvt. Ltd		Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(b) V.Radhakrishna		8-3-293/82/J III/211-1, Road No 76, Phase-III, Jubilee Hills Hyderabad - 500 033
(c) M.Prabhakara Rao		H.No. 8-2-293/82/A, Plot No.543, Road No.26, Jubilee Hills, Hyderabad - 500 033.
(d) D.Jai Ramesh		Plot No.173, Road No.13, Jubilee Hills, Hyderabad - 500 033.
(e) V.Aditya		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(f) Ch.Shruthi Keerthi		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(g) M/s Active Power Corporation Pvt Ltd		Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(h) Vemuri Anusha		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.

I, KOGANTI VENKATA SESHAGIRI RAO, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
KOGANTI VENKATA SESHAGIRI RAO
Publisher

Date: 28.02.2026

ప్రతి ఒక్కరికీ 2.5 లక్షల ఆరోగ్య బీమా

- తుది దశలో కసరత్తు.. త్వరలో ప్రకటిస్తాం
- పేదలు ఎక్కడ ఉంటే అక్కడ నేనుంటా: సీఎం
- విజయనగరం జిల్లా రావివలసలో సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన బాబు



రావివలసలో సభకు హాజరైన ప్రజలు, కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయనగరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల ఆరోగ్య బీమా అందించనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో శనివారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. బీమా పథకానికి సంబంధించి విధివిధానాలు తయారుచేశామని, తుది కసరత్తు జరుగుతోందని, త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. పేదవారు ఎక్కడుంటే తాను అక్కడుంటానని, పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సంస్కరణలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పేదరికం నిర్మూలనకే సూపర్ సిక్స్ పథకాలు అని తెలిపారు. 1న సెలవు దినం వస్తే ముందురోజే పింఛన్లు అందించి, చిత్తశుద్ధి నిలుపుకొంటున్నట్టు చెప్పారు. "గర్భాశయ క్యాన్సర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏపీలో 3,40,154 మందికి ఈ రకమైన రుగ్మతలు ఉన్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్రం 14, 15 ఏళ్ల బాలికలకు రూ.4,400 విలువచేసే వ్యాక్సిన్‌ను రూ.400కే అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తోంది. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. త్వరలో వాట్సాప్ ద్వారా ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో ఎవరికి వారుగా తమ ఆరోగ్య పరిస్థితిని, వివరాలను తెలుసుకోవచ్చు. ఏపీని గంజాయి లేని రాష్ట్రంగా మార్చుతాం. గంజాయి మాఫియాను ఉక్కుపాదంతో అణచివేస్తాం. ఫ్యాక్షనిజాన్ని అణిచివేశాం." అని సీఎం తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

నదుల అనుసంధానం..

"నదుల అనుసంధానానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పోలవరం నీటిని వంశధారకు తీసుకురావాలన్నదే మా లక్ష్యం. ఇప్పటికే పోలవరం నీరు అనకాపల్లి వరకూ వచ్చింది. దాన్ని శ్రీకాకుళం వరకూ తీసుకెళతాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు అందించాలన్నదే లక్ష్యం. రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి పెద్దపీట వేశాం. తిరుమల ప్రతిష్ఠను, పవిత్రతను గత వైసీపీ ప్రభుత్వం మంటగలిపింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. నాణ్యత లేని నెయ్యితో లడ్డూ తయారుచేసి పాపాన్ని మూటగట్టుకున్నారు. వారిని దేవదేవుడు అస్సలు క్షమించడు. వైసీపీ హయాంలో టీటీడీ లడ్డూకు.. ఇప్పుడు తయారవుతున్న లడ్డూకు చాలా వ్యత్యాసం ఉందని భక్తులే చెబుతున్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేను 2047 విజన్‌తో పనిచేస్తున్నా. గతంలో ఐటీ అభివృద్ధి చేశా. ఇప్పుడు ఏఐకి ప్రాధాన్యం ఇస్తున్నా. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలి" అని చంద్రబాబు కోరారు. మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కళా వెంకటరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబానికి అండగా...

- తల్లిదండ్రులులేని అక్కాచెల్లెళ్లకు సీఎం చంద్రబాబు అండ



చీపురుపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఇద్దరు అక్కాచెల్లెళ్లకు సీఎం చంద్రబాబు అండగా నిలిచి పెద్ద మనసు చాటుకున్నారు. చీపురుపల్లి మండలం రేగిడిపేటకు చెందిన రేగిడి హారిక, అఖిల పేరున చెరో 3లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్టు ప్రకటించారు. పీ4లో భాగంగా గరివిడి మండలం కొండదాడి గ్రామానికి చెందిన మార్గదర్శి పి.సాయి గోపాలవర్మ... వారిని దత్తత తీసుకుని చదివిస్తున్నారు. ఆయన్ను సీఎం అభినందించారు. అంతకు ముందు పైలపేటలో రొంగలి ఎల్లయ్య నివాసానికి వెళ్లి పింఛను అందజేశారు.

చేతల్లో అభివృద్ధి

- ప్రభుత్వ తీరుతోనే పరిశ్రమలు వస్తున్నాయి
- అనకాపల్లి జిల్లాలో మంత్రి లోకేశ్
- బ్లూ జెట్ హెల్త్‌కేర్ ఫార్మా కంపెనీకి భూమి పూజ



బ్లూ జెట్ హెల్త్‌కేర్ ఫార్మా సంస్థకు శనివారం శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేశ్, సంస్థ చైర్మన్ అక్షయ్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, మంత్రి కొల్లు, స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్

అనకాపల్లి/రాంబిల్లి/అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం కాకుండా అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తోందని మంత్రి లోకేశ్ అన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ పరిధిలో గల సీతపాలెం ఇండస్ట్రియల్ పార్కులో బ్లూజెట్ హెల్త్‌కేర్ (బీజేహెచ్ఎల్) ఫార్మా సంస్థ ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ యూనిట్‌కు శనివారం ఆయన భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమ ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఓ మైలురాయిగా నిలుస్తుందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్, విశ్వసనీయత, పరిశ్రమల గ్రౌండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రను ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. బ్లూజెట్ కంపెనీ రూ. 2,300 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుచేసి, 1,750 మందికి ఉద్యోగాలను కల్పించనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని లోకేశ్ వెల్లడించారు. క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఐటీ, డిజిటల్ సర్వీసెస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక శక్తి, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ వంటి 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. దేశంలో ప్రముఖ ఔషధ తయారీ రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలనేది లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కొత్త ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉండటంతో రాష్ట్రాభివృద్ధికి కసితో పనిచేస్తున్నారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, బ్లూజెట్ హెల్త్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, బ్లూజెట్ హెల్త్‌కేర్ ఫార్మా కంపెనీ చైర్మన్ అక్షయ్ అరోరా పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్స్‌తో లోకేశ్ భేటీ

అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లతో మంత్రి లోకేశ్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో సోషల్‌మీడియా ప్రతినిధులు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై ఫోకస్ పెట్టాలని మంత్రి సూచించినట్టు తెలిసింది.



సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కుటుంబ సభ్యులతో సాయి ప్రసాద్

సీఎస్‌గా సాయిప్రసాద్

- విజయానంద్ నుంచి బాధ్యతల స్వీకరణ
- సీఎం ఎక్స్‌అఫీషియో స్పెషల్ సీఎస్‌గా విజయానంద్
- రీ-ఎంప్లాయిమెంట్ కింద సర్వీస్ ఏడాది పొడిగింపు
- టీటీడీ రెగ్యులర్ ఈవోగా ముద్దాడ.. సీఎంవో నుంచి బదిలీ



సీఎస్ సాయి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం సీఎస్‌గా పదవీ విరమణ చేసిన కె.విజయానంద్ సమక్షంలో ఆయన బాధ్యతలు తీసుకుని ఫైలు పై సంతకం చేశారు. ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.33 గంటల కు సీఎస్ సీటుపై ఆసీనులైన జి.సాయిప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు వేద ఆశీర్వచనా లు అందించారు. నూతన సీఎస్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్.రావత్, ఎం.టి.కృష్ణబాబు, ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్‌తో పాటు ముఖ్య కార్యదర్శులు శ్యామలరావు, ముఖేశ్ కుమార్ మీనా, కాంతిలాల్ దండే ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ నూతన సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందించి, అసోసియేషన్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌కు చేరుకున్న జి.సాయిప్రసాద్‌కు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కుటుంబ సభ్యులు, సీఎస్ కార్యాలయ సిబ్బందితో పాటు ఇతర అధికారులతో ఫొటోలు దిగారు. మే 30వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. సీఎస్ పదవితో పాటు రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా, జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

సీఎం స్పెషల్ సీఎస్‌గా విజయానంద్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ పొందిన కె.విజయానంద్‌కు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. రీ-ఎంప్లాయిమెంట్ కింద ఆయన సర్వీస్‌ను మరో ఏడాది పొడిగించింది. ఆదివారం (మార్చి 1వ తేదీ) నుంచి ఆయన రీ-ఎంప్లాయిమెంట్ కింద ప్రభుత్వ సర్వీస్‌లో కొనసాగుతారు. సీఎం ఎక్స్‌అఫీషియో స్పెషల్ సీఎస్‌గా ఆయన్ను ప్రభుత్వం నియమించింది. దీంతో పాటు ఇంధన శాఖ స్పెషల్ సీఎస్‌గా, ఏపీ ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. శనివారం సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి కె. శ్యామలరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం స్పెషల్ సీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దాడ రవిచంద్రను ప్రభుత్వం టీటీడీ రెగ్యులర్ ఈవోగా నియమించింది. ప్రస్తుతం ఆయన సీఎం స్పెషల్ సీఎస్ బాధ్యతలతో పాటు టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టీటీడీకి రెగ్యులర్ ఈవో లేకపోవడంతో అడ్మినిస్ట్రేషన్ సమస్యలు రావడంతో ప్రభుత్వం ఆయనను సీఎంవో నుంచి బదిలీ చేసి టీటీడీ ఈవోగా పూర్తి బాధ్యత లు అప్పగించింది. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి కె.శ్యామలరావు ఈ మేరకు మరో జీవో జారీ చేశారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు నేర పరిధిలోకి

- వాక్ స్వాతంత్ర్యానికి మనస్సాక్షి తోడవ్వాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి



అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యా న్ని వినియోగించుకొనే క్రమంలో ఇతరుల హక్కులు, గౌరవానికి భంగం కలిగించకుం డా పౌరులు బాధ్యతతో మెలగాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి సూచించారు. సోషల్ మీడియా యుగంలో వాక్ స్వాతంత్ర్యానికి మనఃసాక్షి తోడవ్వాలన్నారు. చర్చ, విమర్శ హక్కులేనని, అయితే హింసను ప్రేరేపించే, విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చట్టపరంగా నేర పరిధిలోకి వస్తాయని తెలిపారు. 'సోషల్ మీడియా దుర్వినియోగం- భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, నియంత్రణ మధ్య సమతుల్యతను పాటించాల్సిన ఆవశ్యకత'పై సీఆర్ మీడియా అకాడమీ, స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా విజయవాడలో శనివారం నిర్వహించిన సెమినార్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ మహేశ్వరి మాట్లాడుతూ, సోషల్ మీడియా వినియోగం పెరిగిన తరువాత వాక్ స్వాతంత్ర్యం, నియంత్రణ మధ్య సమతుల్యతను కాపాడటం పెద్ద సవాలుగా మారిందన్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తి ఒక ప్రచురణకర్తగా, ప్రసారకర్తగా, గ్లోబల్ వ్యాఖ్యాతగా మారారని పేర్కొన్నారు. ఒక చిన్న పోస్టు నిమిషాల్లో ప్రపంచాన్ని చుట్టేస్తోందని... అపోహ, అసత్యం, ద్వేషం క్షణాల్లో వ్యాపిస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణ 19(1) ప్రతి పౌరుడికీ వాక్ స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణ హక్కును ప్రసాదించిందని, అయితే అధికరణ 19(2) ప్రకారం దేశ సార్వభౌమాధికారం, శాంతిభద్రతలు, నైతికతను దృష్టిలో పెట్టుకొని పరిమితులు కూడా ఉన్నాయని వివరించారు. స్వేచ్ఛ ముసుగులో చేసే నేరపూరిత వ్యాఖ్యలు, చట్టవిరుద్ధమైన ఉపన్యాసాలను ప్రత్యేకంగా చూడాలని, ఇలాంటివారిని రక్షించేందుకు చట్టాలు రూపొందించలేదని తెలిపారు. "వార్తా పత్రికలు, టీవీల్లో ప్రచురించే, ప్రసారం చేసే కథనాలను నియంత్రించేందుకు ఎడిటర్లు ఉన్నారు. కానీ సామాజిక మాధ్యమాల్లో సమాచారాన్ని ఎక్కువమందికి చేరవేసే అల్గారిథమ్ ఆగ్రహం, భయం, పక్షపాతం వంటి భావోద్వేగాలను ప్రోత్సహిస్తుంది. వాస్తవాలను గుర్తించేందుకు ప్రయత్నించదు. హానికరమైన పోస్టు వైరల్ అయినప్పుడు దాన్ని పోస్టు చేసిన వ్యక్తితోపాటు ఎక్కువమందికి చేరవేసిన మాధ్యమాలను కూడా జవాబుదారులను చేయాల్సిన అవసరం ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నాపై కూడా అనుచిత పోస్టులు పెట్టారు. వాటిని తొలగించేందుకు రిజిస్ట్రార్ జనరల్‌తో పాటు టెలికమ్యూనికేషన్స్ శాఖ కృషి చేయాల్సి వచ్చింది" అని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత స్థాయిలో ట్రోలింగ్, మహిళలపై వేధింపులు మరింత ఎక్కువ అవుతున్నాయన్నారు. ఏఐ రాకతో ఈ జాఢ్యం మరింత పెరిగిందని, రాజకీయ పార్టీలు సైతం విద్వేష ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈగల్, సైబర్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ప్రజల భావ వ్యక్తీకరణకు విస్తృత వేదికగా మారిన సోషల్ మీడియా దుర్వినియోగం అవుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ... మహిళల రక్షణ కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన 'సైబర్ మిత్ర' శక్తిమంతమైన కవచంలా పని చేస్తోందని, గతేడాది తీసుకున్న కఠిన చర్యల వల్ల సోషల్ మీడియా వేధింపులు 17 శాతం తగ్గినట్లు శైలజ వెల్లడించారు.

సునీల్ అరెస్టు తథ్యం

- అధికార మదంతోనే వ్యాఖ్యలు.. న్యాయవ్యవస్థను అవమానించడమే
- కులం ముసుగులో తప్పించుకోలేరు: రఘురామ

భీమవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్.. చట్టం తనకు వర్తించదన్న భ్రమలో ఉన్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. "జగన్ హయాంలో అప్పటి నర్సాపురం ఎంపీగా ఉన్న నాపై కస్టోడియల్ టార్చర్‌కు పాల్పడ్డ కేసులో నిందితునిగా ఉన్న సునీల్‌కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు చట్టం తనకు వర్తించదన్న భ్రమలో ఉన్నారనడానికి నిదర్శనం. ఒక నిందితుడు మీడియా ముందుకు వచ్చి 'నిజంగా కొట్టి ఉంటే ఎన్ని ఎముకలు విరిగేవి' అని మాట్లాడడం ధైర్యం కాదు. దురహంకారం. అధికార మదం ఇంకా సునీల్‌కుమార్ తలకెక్కే ఉంది. ఇది కేవలం వ్యంగ్యం కాదు. న్యాయవ్యవస్థను సూటిగా అవమానించడమే. కస్టోడియల్ హింసను సమర్థించే వికృత మనస్తత్వానికి బహిరంగ ప్రదర్శన. ఈ దారుణంపై కేసు నమోదైంది. ప్రభుత్వం నిందితుడిని సస్పెండ్ చేసింది. శాసనసభ్యుల క్రీడా కార్యక్రమంలో క్రికెట్ ఆడుతూ నాకు జరిగిన మణికట్టు ఫ్రాక్చర్‌ను ఆయుధంగా మార్చుకుని, కస్టోడియల్ టార్చర్ ఆరోపణలను తేలిక పరచాలని ప్రయత్నించడం అంటే బాధితుడిని మళ్లీ మళ్లీ బహిరంగంగా హింసించడమే. సునీల్‌నాయక్, సునీల్‌కుమార్‌పై కేసులు రాజకీయ ప్రతీకారం కాదు. నాటి జగన్ ప్రభుత్వ అధికార దుర్వినియోగంపై న్యాయపోరాటం. సునీల్ కుమార్‌కు స్పష్టంగా చేపుతున్నా. వ్యంగ్య వ్యాఖ్యలతో ఏ నిజాన్నీ మార్చలేరు. అహంకారంతో న్యాయాన్ని ఓడించలేరు. కులం ముసుగులో చట్టం నుంచి తప్పించుకోలేరు. న్యాయవ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. నిజం గెలుస్తుంది. కస్టోడియల్ హింసకు పాల్పడిన సునీల్ అరెస్టు తథ్యం.' అని రఘురామ పేర్కొన్నారు.

సునీల్ నాయక్ వారెంట్ పిటిషన్‌పై
తీర్పు 3కి వాయిదా

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును పోలీస్ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఏ-7 నిందితుడుగా ఉన్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ పిటిషన్ కేసులో వాదనలు పూర్తయ్యాయి. శనివారం గుంటూరులోని మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో సునీల్ నాయక్ తరపు న్యాయవాదుల వాదనలను మేజిస్ట్రేట్ విన్నారు. ఇరువైపులా వాదనలు పూర్తి కావడంతో మార్చి 3వ తేదీన తీర్పు ఇవ్వనున్నట్లు మేజిస్ట్రేట్ స్రవంతి ప్రకటించారు. కాగా బిహార్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారులను అరెస్టు చేయాల్సి వస్తే తప్పనిసరిగా తమ అనుమతి తీసుకోవాలంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది సోమవారం హైకోర్టు ధర్మాసనం ఎదుటకు రానుంది. సునీల్ నాయక్‌ను మార్చి 2వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దంటూ పట్నా సెషన్స్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. వీటన్నింటి నేపథ్యంలో రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన కేసులో సునీల్ నాయక్ అరెస్టు రోజురోజుకు జఠిలంగా మారుతోంది. ఈ కేసు దర్యాప్తు ముందుకు సాగాలంటే సునీల్ నాయక్‌ను కస్టడీకి తీసుకొని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సునీల్ నాయక్‌ను అరెస్టు చేయడానికి.. బిహార్ ప్రభుత్వ ఉత్తర్వులపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టును ఆశ్రయించాలని పోలీసులు యోచిస్తున్నారు.

తిన్న టిఫిన్‌కు డబ్బులడిగాడని..
హోటల్ యజమాని దారుణ హత్య

- కత్తితో విచక్షణా రహితంగా వ్యక్తి దాడి

తడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో టిఫిన్ తిన్నారు.. బిల్లు కట్టమంటే ఎదురుతిరిగారు.. అనంతరం మమ్మల్నే డబ్బులు అడుగుతావా అంటూ కత్తితో విచక్షణారహితంగా నరికేశాడు. తిరుపతి జిల్లా తడ మండలం పెరియవట్టు గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. పెరియవట్టు గ్రామానికి చెందిన ప్రభాకర్ అలియాస్ ప్రభు(40) ఓ దాబా హోటల్‌ను నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన దినేష్, విఘ్నేష్ ప్రభు శనివారం దాబా హోటల్ వద్దకు వచ్చి టిఫిన్ తిన్నారు. బిల్లు కట్టమని ప్రభు అడగడంతో గొడవ జరిగింది. శనివారం మధ్యాహ్నం ప్రభు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దినేష్, విఘ్నేష్ కోసం గ్రామానికి వెళ్లారు. వారు లేకపోవడంతో పోలీసుస్టేషన్‌కు రమ్మని చెప్పాల్సిందిగా కుటుంబసభ్యులకు తెలిపారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పూటుగా మద్యం తాగిన దినేష్ పదునైన కత్తి తీసుకొని దాబా హోటల్ వద్దకెళ్లి ప్రభుతో మరోసారి గొడవకు దిగాడు. నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ చేతిలో ఉన్న కత్తితో విచక్షణారహితంగా నరకడంతో ప్రభు అక్కడికక్కడే మృతి చెందాడు. దినేష్ పరారు కాగా, పోలీసులు గాలిస్తున్నారు.


పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

తిరుమల పవిత్రత, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే
కఠిన చర్యలు

రూ.5,456.26 కోట్ల అంచనాలతో టీటీడీ బడ్జెట్

- త్వరలో 'శ్రీవారి ముడుపు పత్రం పథకం'
- మొత్తం 85 అంశాలపై తీర్మానాలు: ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంతో భక్తితో తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసినా, తిరుమల పవిత్రతను అప్రతిష్టపాల్జేసినా కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి టీటీడీ వార్షిక బడ్జెట్ రూ.5,456.26 కోట్ల అంచనాలతో ఆమోదించినట్టు ఆయన వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం శనివారం జరిగింది. అనంతరం ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కొంతమంది సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ధర్మకర్తల మండలి సమావేశంలో మొత్తం 85 అంశాలపై చర్చించి తీర్మానాలు చేశామని తెలిపారు. సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ బోర్డు సబ్ కమిటీ సిఫారసుల మేరకు టీటీడీ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు రూ.118.89 కోట్లు కేటాయించామన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, అదనపు హాస్టల్ బ్లాకులు, కిచెన్ల ఆధునీకరణ, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆమోదం తెలిపామన్నారు. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం 'శ్రీవారి ముడుపు పత్రం పథకం' ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇక, తిరుమలలోని మ్యూజియం పనులు చివరిదశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కాగా.. బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి రాజీనామాను ధర్మకర్తల మండలి తిరస్కరించింది..

'పరాభవ' పంచాంగం ఆవిష్కరణ

ఈ సమావేశంలోనే శ్రీపరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. రూ.75 విలువైన ఈ పంచాంగం తిరుపతిలో, తిరుమలలో ఆదివారం నుంచి భక్తులకు అందుబాటులో ఉండనుంది. మిగతా టీటీడీ సమాచార కేంద్రాల్లో వచ్చే వారం అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

సమావేశంలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు..

- రిలయన్స్ సంస్థ సహకారంతో దాదాపు రూ.120 కోట్లతో నూతన టెక్నాలజీతో ఆధునిక వంటశాల పనుల ప్రారంభానికి ఆమోదం
- ఆలయాలు, ప్రాకారాలు, రాజగోపురాల నిర్మాణాల ఖర్చు దృష్ట్యా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాల్లో మార్పులు
- సీఎం ఆదేశాల మేరకు ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహ నిర్మాణం కోసం డ్రై ఐల్యాండ్ నిర్మాణానికి రూ.20.17 కోట్లు కేటాయింపు
- ఏప్రిల్ 1న ఒంటిమిట్టలో జరగనున్న సీతారాముల కల్యాణానికి వచ్చే దాదాపు 70 వేల మంది భక్తులకు రూ.50 విలువైన తిరుమల శ్రీవారి లడ్డూ ఉచితంగా అందించాలని నిర్ణయం
- కోయంబత్తూరు, గువహటి, బెలగావి, పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం ఆయా రాష్ట్రాలు కేటాయించిన భూమిని తీసుకునేందుకు ఆమోదం
- తిరుపతిలోని వకుళమాత ఆలయంలో 'అక్షర గోవిందం' పేరుతో అక్షరాభ్యాసం ప్రారంభించాలని నిర్ణయం
- ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్‌మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356, తిరుమలలో 371 మంది భద్రతా సిబ్బంది నియామకానికి ఆమోదం
- అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో లేటెస్ట్ ఎక్స్‌రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ల ఏర్పాటుకు నిర్ణయం
- టీటీడీ ఆలయాల్లో 51మంది పరిచారకులకు అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం
- పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీవేంకటేశ్వర దివ్యక్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయింపు

తిరుమలలో గీతూ రాయల్ రీల్స్

- సోషల్‌మీడియాలో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు
- గీతూ బృందంపై చర్యలకు సిద్ధమైన టీటీడీ


శ్రీవారి ఆలయం సమీపంలో, ఘాట్ రోడ్లలో రీల్స్ చేస్తున్న గీతూ రాయల్ బృందం

తిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా బిగ్‌బాస్ ఫేం గీతూ రాయల్ స్నేహితులతో కలిసి సినిమా పాటకు రీల్స్ చేయడం విమర్శలకు దారితీసింది. సాధారణంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని తిరుమలలో రీల్స్, షార్ట్స్ వంటివి చేయడంపై నిషేధం ఉంది. గతంలోనే ఇలా నిబంధనలను అతిక్రమించి వీడియోలు తీసిన వారిపై కేసులు కూడా నమోదయ్యాయి. తిరుమలలో రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదని టీటీడీ పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు మాత్రం ఫాలోవర్లు, లైకుల కోసం ఇష్టానుసారం రీల్స్ చేస్తూనే ఉన్నారు. తాజాగా, గీతూ రాయల్ మరో నలుగురు యువకులతో కలిసి శ్రీవారి ఆలయం, లడ్డూ కౌంటర్‌కు వెళ్లే మార్గంతో పాటు ఘాట్‌రోడ్లలోనూ సినిమా పాటకు వీడియోలు చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో భక్తుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. ఈ అంశంపై టీటీడీ కూడా సీరియస్ అయింది.నిబంధనలను అతిక్రమించిన గీతూ రాయల్ బృందంపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. కాగా.. ఈ వ్యవహారంపై గీతూ రాయల్ ఓ వీడియో ద్వారా స్పందిస్తూ 'అందరికీ గుడ్ న్యూస్. నాపై చర్యలు తీసుకుంటారట. అందరు హ్యాపీగా ఉండండి. ఇంత విషయాన్ని ఇంత పెద్దగా చేసి వీడియోలు చేసినందుకు థ్యాంక్యూ సో మచ్. అల్‌రెడీ సగం జీవితం పోయింది. ఇంక పోవడానికి కూడా ఏం లేదు. మిగిలున్నదాన్ని కూడా మీరు పొగొట్టండి. ప్రశాంతంగా ఉండండి' అని పేర్కొన్నారు.

'తెట్టు' సమీపంలో రామాయపట్నం కార్గో రైల్ టెర్మినల్

- 153.77 ఎకరాలు కేటాయింపు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మల్టీ మోడల్ కార్గో రైల్ టెర్మినల్‌ను నిర్మిస్తామంటూ రామాయపట్నం కార్గో రైల్ టెర్మినల్(ఆర్‌సీఆర్‌టీ) సంస్థ ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనను రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్‌ఐపీసీ), రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్‌ఐపీబీ), రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించాయి. దీంతో నెల్లూరు జిల్లా తెట్టు రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్‌సీఆర్‌టీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దీనికి అవసరమైన 153.77 ఎకరాల భూమిని ఇచ్చేందుకు రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ఆమోదం తెలిపింది.

అనంతపురంలో 37.3 డిగ్రీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో శనివారం ఎండ తీవ్రత కొనసాగింది. ప్రధానంగా రాయలసీమలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవయ్యాయి. దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 37.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కడపలో 36.8, కర్నూలులో 36.5, నంద్యాలలో 36 డిగ్రీలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమ, కోస్తాల్లో ఎక్కువచోట్ల ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

తెలుగు వైభవాన్ని విస్తరింపజేయాలి

నేటితరం పిల్లలకు తెలుగు అలవాటు చేయాలి.. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపు

- ఇంటర్ వరకూ తెలుగు తప్పనిసరి: స్పీకర్ అయ్యన్న
- తెలుగుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి: తనికెళ్ల భరణి
- అమలాపురంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం


3వ ప్రపంచ తెలుగు మహాసభలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చిత్రంలో గరికపాటి నరసింహారావు, చాగంటి కోటేశ్వరరావు తదితరులు

అమలాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరాన, పచ్చని పొలాలతో, సంప్రదాయ సౌందర్యంతో వెలిగే కోనసీమ తెలుగు భాషా సంస్కృతికి నిలయంగా నిలిచిందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కిమ్స్ అధినేత కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కంభంపాటి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హరిబాబు మాట్లాడుతూ తెలుగు ఒక భాష మాత్రమే కాదని, అది మన జీవం, శ్వాస, గుర్తింపని అభివర్ణించారు. తెలుగు వైభవాన్ని విస్తరింపజేయాలని అన్నారు. విద్య, ఉద్యోగం, సాంకేతిక రంగాల్లో ఇతర భాషల అవసరం ఉన్నా మాతృభాషను పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. ఏపీలో పుట్టిన ప్రతిఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. నేటితరం పిల్లలకు తెలుగులో మాట్లడటం, చదవడం తప్పనిసరిగా అలవాటు చేయాలని హరిబాబు కోరారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, మాతృభాష పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ తెలుగు పాఠ్యాంశం తప్పనిసరిగా ఉండాలని, ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువారు ఉన్నారని, వారంతా తెలుగులోనే మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్నవారు మాత్రం మాతృభాషలో మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ నేత రామ్ మాధవ్ మాట్లాడుతూ తెలుగు భాష జీవించాలంటే చదివే వారితో పాటు రాసేవారు కూడా అవసరమేనని తెలిపారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగు మహాసభలు యువతకు ఒక ప్రత్యేక సందేశాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు.

తెలుగు మాధ్యమంలో చదివించాలి: గరికపాటి

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రసంగిస్తూ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ తెలుగు మాధ్యమాన్ని కొనసాగించినప్పుడే భాషకు గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని తెలుగు మాధ్యమంలో చదివించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మరో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి అందచందాలతో అలరాలే కోనసీమకు కేంద్ర బిందువైన అమలాపురం ప్రపంచ తెలుగు మహాసభలకు వేదిక కావడం పూర్వజన్మ సుకృతమేనని అన్నారు. సినీనటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ మన పిల్లలకు తెలుగు నేర్పించాల్సిన బాధ్యత మనపైనే ఉందని తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ వెయ్యేళ్ల నాటి తెలుగు భాష చస్తే జాతి చస్తుందన్న పెద్దల మాటలను గుర్తుంచుకోవాలని అన్నారు. పిల్లలకు అమ్మ భాషలోని తియ్యదనాన్ని రుచి చూపించడమే మన బాధ్యతని చెప్పారు. సీపీఐ జాతీయ నేత కె.నారాయణ మాట్లాడుతూ తమిళనాడులో తెలుగు భాషపై పరిశోధన చేస్తున్నారని తెలిపారు. తొలిరోజు సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పూల త్రివిక్రమ్, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా పలువురు కవులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బు జమలో చరిత్ర సృష్టించాం

- 24 గంటల్లోనే రైతుల ఖాతాలో వేశాం
- ఈ సీజన్‌లో 42 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం
- రైతులకు 10,850 కోట్లు చెల్లించాం
- మంత్రి నాదెండ్ల మనోహర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

తిరుపతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు పండించిన ధాన్యానికి న్యాయమైన ధర ఇస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలుపై తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల అధికారులతో శనివారం ప్రాంతీయస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సీజన్‌లో 7.52 లక్షల మంది రైతుల నుంచి 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.10,850 కోట్లు చెల్లించామని చెప్పారు. రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే డబ్బు జమ చేసి చరిత్ర సృష్టించామన్నారు. 51 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకుని 47 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతుల నుంచి ప్రతి గింజ, ప్రతి బస్తా కొనుగోలు చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 1.46 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు.

కారును అడ్డగించి.. రూ.3.70 కోట్లు కొట్టేశారు!

- బాధితుడు గుజరాతీ పండ్ల వ్యాపారి
- ఆలస్యంగా వెలుగులోకి!

కనగానపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద దారి దోపిడీ జరిగింది. విశ్వసనీయ సమాచా రం మేరకు 44వ నంబరు జాతీయ రహదారిపై వారం రోజుల కిందట రూ.3.70 కోట్ల నగదును దొంగలు దోచుకున్నారు. గుజరాత్‌కు చెందిన ఓ పండ్ల వ్యాపారి కారులో డ్రైవర్‌తో కలసి వారాణసి నుంచి బెంగళూరు వైపు వెళుతుండగా ఈ దోపిడీ జరిగింది. దొంగలు మూడు వాహనాల్లో వ్యాపారి కారును వెంబడించారు. మామిళ్లపల్లి వద్ద కారును అడ్డగించి, వ్యాపారిని, డ్రైవర్‌ను బెదిరించి, కారులో ఉన్న నగదు దోచుకున్నారు. వ్యాపారిని, డ్రైవర్‌ను అదే కారులో తీసుకువెళ్లి.. వేర్వేరు ప్రాంతాల్లో దిం చేశారు. ఆ తర్వాత కారును మరోచోట వదిలేసి పారిపోయారు. అదే రోజు సాయంత్రం బాధితుడు కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొం గల కోసం పోలీసు అధికారులు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. హైవేపై భారీ గా నగదు దోపిడీ జరగడంతో ఈ కేసును పోలీసు లు సవాలుగా తీసుకున్నారు. టోల్‌ప్లాజా, జంక్షన్ల వద్ద సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దొంగలు తమిళనాడుకు చెందినవారిగా అనుమానిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ ఆర్కే RK


జయహో జితేంద్ర!

లిక్కర్ కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత ప్రభృతులు అప్పట్లో అరెస్టయి సుదీర్ఘంగా జైల్లో ఉండటం సంచలనం సృష్టించగా, ఇప్పుడా కేసులో కనీస ప్రాథమిక సాక్ష్యాధారాలు కూడా లేవని, ఊహాజనిత కథలతో కేసు కట్టారని నిందితులు అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పు అంతకంటే సంచలనం కలిగిస్తోంది. రాజకీయ ప్రత్యర్థులను సీబీఐ–ఈడీ కేసులతో వేధిస్తున్నారంటూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో వెలువడిన ఈ తీర్పు అనేక మౌలిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. చేయని నేరానికి తనను ఆరు నెలల పాటు జైల్లో నిర్బంధించి అవినీతిపరుడిగా ముద్ర వేశారని తీర్పు అనంతరం కేజ్రీవాల్ విలపించగా, ప్రాథమిక సాక్ష్యాలు కూడా లేకుండా కేసు కట్టిన సీబీఐకి చెందిన దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన విచారణ జరపాలని న్యాయాధికారి తన తీర్పులో పేర్కొనడం విశేషం. ఈ తీర్పుపై ఢిల్లీ హైకోర్టులో సీబీఐ అప్పీలు దాఖలు చేసింది.

> దర్యాప్తు సంస్థలకు, ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంస్థకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టారు. మేం మీపై అభియోగాలు మోపుతాం, నిర్దోషులమని నిరూపించుకోవాల్సిన బాధ్యత మీదే అన్నట్టుగా ఈడీ వ్యవహరిస్తోంది. ఈ అభియోగాలలో పస ఉందో లేదో తేలేవరకు నిందితులు జైల్లోనే ఉండాల్సి వస్తోంది. ఇది సహజ న్యాయ సూత్రానికి, ప్రాథమిక హక్కులకు విరుద్ధం కాదా? కేసు నమోదు చేసిన వారికి దాన్ని రుజువు చేయాల్సిన బాధ్యత లేకపోవడం ఏమిటి? అభియోగం ఎదుర్కొంటున్న వారే నిర్దోషులమని రుజువు చేసుకోవాల్సి రావడం ఏమిటి? ఈడీకి ఈ ప్రత్యేకమైన మినహాయింపు ఎందుకిచ్చారో తెలియదు.

హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో వేచి చూడాలి. అయితే ఇలాంటి సంచలనతీర్పులు అప్పుడప్పుడూ రావడం మన దేశంలో న్యాయ వ్యవస్థ ఇంకా పటిష్ఠంగానే ఉందన్న అభిప్రాయం కలిగిస్తూ ఉంటుంది. తీర్పులో భాగంగా న్యాయాధికారి జితేంద్రసింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రతిపక్షాలు గత కొంత కాలంగా చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పును బట్టి దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక దర్యాప్తు సంస్థ సీబీఐ విశ్వసనీయత మసకబారుతోంది. రాజకీయ ప్రత్యర్థులను లొంగదీసుకోవడానికి లేదా అణచివేయడానికి సీబీఐ లేదా ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను పాలకులు దుర్వినియోగం చేస్తున్నారన్న అభిప్రాయం దేశ ప్రజల్లో కొంత కాలంగా ఉంది. ఈ తీర్పుతో సదరు అభిప్రాయానికి బలం చేకూరుతోంది. లిక్కర్ కేసు కారణంగా ఢిల్లీలో తాము అధికారం కోల్పోయామని, దమ్ముంటే మళ్లీ ఎన్నికలు జరపాలని తీర్పు అనంతరం కేజ్రీవాల్ సవాలు చేశారు. అటువంటి సవాలు చేసే హక్కు ఆయనకు ఉంది. ఎందుకంటే ఆమ్ ఆద్మీ పార్టీ అధినేతగా ఆయన ఈ కేసు కారణంగా ఎన్నో కోల్పోయారు. ఆకాశం కూలినా సరే న్యాయం జరగాలి అని న్యాయాధికారి జితేంద్రసింగ్ తన తీర్పులో భాగంగా వ్యాఖ్యానించారు. ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు. న్యాయ వ్యవస్థకు కూడా అవినీతి చెద పట్టిందన్న అభిప్రాయం బలపడుతున్న వేళ ఇటువంటి తీర్పులు దేశ ప్రజల్లో నైరాశ్యాన్ని తొలగిస్తాయి. న్యాయ వ్యవస్థలో అవినీతి గురించి కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఈఆర్‌టీ సంస్థ ఎనిమిదవ తరగతి సిలబస్‌లో ఏకంగా ఒక పాఠ్యాంశాన్ని చేర్చడం, దానిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడం, దరిమిలా సదరు పాఠ్యాంశాన్ని తొలగించడం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది. ఏ ఉద్దేశంతో అటువంటి పాఠ్యాంశాన్ని రూపొందించారో తెలియదు. ఈ దేశంలో న్యాయ వ్యవస్థ మాత్రమే అవినీతిమయం అవుతున్నదా? మిగతా వ్యవస్థలు పవిత్రంగా ఉన్నాయా? రాజకీయ వ్యవస్థ మాటేమిటి? దర్యాప్తు సంస్థల్లో పనిచేస్తున్న అధికారుల అవినీతి కొత్త పుంతలు తొక్కుతోందని వార్తలు వస్తున్నాయి కదా? ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు నమోదు చేస్తున్న కేసులు, వాటిపై వెలువడుతున్న తీర్పుల విశ్వసనీయతపై నీలి మేఘాలు కమ్ముకుంటున్నాయి. మొత్తంగా చూస్తే అవినీతి మన ప్రజా జీవితంలో భాగంగా మారిపోయింది. ప్రజలు కూడా అవినీతిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. దీంతో నిజంగా అవినీతికి పాల్పడినవారు కూడా ఎదురుదాడికి దిగుతున్నారు. ఈ పరిస్థితులలో శుక్రవారం నాడు ఢిల్లీ లిక్కర్ కేసులో న్యాయాధికారి జితేంద్రసింగ్ వెలువరించిన తీర్పు కొత్త ఆశలు చిగురించేలా చేస్తోంది. అయితే రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న కేజ్రీవాల్‌ను తాడూ బొంగరం లేని కేసులో అరెస్టు చేసి దాదాపు ఆరు నెలల పాటు జైల్లో ఎలా ఉంచగలిగారు? ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అంతకాలం జైల్లో నిర్బంధించడం ఏమిటి? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. దర్యాప్తు సంస్థలు ఎవరిపైన అయినా కేసులు కట్టగానే న్యాయస్థానాలు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడం పరిపాటే. తొలుత పద్నాలుగు రోజుల పాటు రిమాండ్ విధిస్తారు. ఆ తర్వాత దాన్ని పొడిగిస్తుంటారు. ఈ కారణంగా నేరం చేయకపోయినా సిసోడియా దాదాపు ఏడాదిన్నర పాటు, కేజ్రీవాల్ 156 రోజుల పాటు, కవిత 165 రోజులు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు సమయంలో కేసులో ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించాల్సిన బాధ్యత న్యాయాధికారులు, న్యాయమూర్తులపై ఉండదా? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. దర్యాప్తు సంస్థలు చార్జిషీటు రూపొందించి దానిపై ట్రయల్ జరిగి తీర్పు వచ్చే వరకు నిందితుల పరిస్థితి ఏమిటి? నేరం జరగలేదని తీర్పు వచ్చే పక్షంలో నిందితులు కోల్పోయేదానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ముఖ్యమంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు ప్రజాప్రతినిధులు ఎవరైనా నెల రోజులు దాటి జైలులో ఉంటే వారు తమ పదవులు కోల్పోయే విధంగా కొత్త చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తలపోస్తోంది. ఢిల్లీ లిక్కర్ కేసు నేపథ్యంలో ఈ ప్రతిపాదిత చట్టం సమర్థనీయమా? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టి నెల రోజులకు మించి వారిని జైలుకే పరిమితం చేయడం ఈ రోజుల్లో పెద్ద విషయం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ కేసులో యాభై రోజులకు పైగా జైల్లో ఉండాల్సి రాగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో రెండు నెలలకు పైగా జైల్లో ఉండి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవినీతి కేసులలో పదహారు నెలల పాటు జైలు జీవితం గడిపారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి సోరెన్ కూడా జైలుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో గిట్టని వారిని పదవి నుంచి తొలగించడానికి వారికి ఎంతటి ప్రజాదరణ ఉన్నప్పటికీ ప్రతిపాదిత చట్టం మార్గం సుగమం చేయదా? లిక్కర్ కేసులో నిర్దోషిగా కోర్టు ప్రకటించిన కేజ్రీవాల్ సంధించిన ప్రశ్నలు ఉండనే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో ఎవరినైనా నెల రోజుల పాటు జైల్లో పెట్టడం పెద్ద కష్టం కాదు అని న్యాయవాద వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. లిక్కర్ కేసు కారణంగా అరవింద్ కేజ్రీవాల్, సిసోడియా వంటి వారు విలువైన రాజకీయ జీవితాన్ని కోల్పోయారు. అవినీతిపరులుగా వారిపై ముద్ర పడింది. అందుకే నిబ్బరంగా కనిపించే కేజ్రీవాల్ శుక్రవారం నాడు విలేకరుల సమావేశంలో విలపించారు. అంటే ఆయన అనుభవించిన మానసిక క్షోభ ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. మీడియా కూడా గతంలో లాగా లేదు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి ఒకప్పుడు పెద్దపీట వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మీడియా సంస్థల నిర్వహణ అత్యంత వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాల వల్ల నిర్వహణ వ్యయం నానాటికీ పెరిగిపోతున్నది. ఫలితంగా అధికార వ్యవస్థలను ఎదిరించి నిలబడలేని స్థితికి మీడియా సంస్థలు చేరుకున్నాయి. జాతీయ మీడియా మొత్తం పాలకులకు దాసోహం అయిపోయిందని రాహుల్‌గాంధీ వంటివారు ఆరోపించడాన్ని అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం ద్వారా మీడియా పాఠకుల, వీక్షకుల ఆదరణ కోసం పాటుపడేది. అప్పట్లో ప్రభుత్వాలు స్పందించి దిద్దుబాటు చర్యలు తీసుకొనేవి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పాలకులు తమ తప్పిదాలను కప్పిపుచ్చడానికి ఎదురుదాడిని ఎంచుకుంటున్నారు. ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలను బయటపెడితే సదరు మీడియా సంస్థకు దురుద్దేశాలు అంటగడుతున్నారు. ఆయా మీడియా సంస్థల యజమానులకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. తెలుగునాట ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పరిస్థితులు వికృతంగా మారడంతో అనేక మీడియా సంస్థలు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి స్వస్తి చెప్పాయి. జర్నలిస్టులు కూడా ఆ దిశగా చొరవ తీసుకోవడం లేదు. ఢిల్లీ లిక్కర్ కేసును కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. కేజ్రీవాల్ తదితరులను అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు జాతీయ మీడియా కేసు మెరిట్స్‌పై పరిశీలన చేయలేదు. కేవలం సంఘటనలను మాత్రమే రిపోర్ట్ చేసింది. అదే సమయంలో దర్యాప్తు సంస్థల నివేదికలను ఆసరా చేసుకొని కేజ్రీవాల్ ప్రభృతులను అవినీతిపరులుగా భావించి ఎలక్ట్రానిక్ మీడియా చర్చలు నిర్వహించింది. శుక్రవారంనాడు కేజ్రీవాల్ విలపించడానికి ఇదే కారణమైంది. టీవీ చర్చలలో తనను అవినీతిపరుడుగా చిత్రీకరించడాన్ని తట్టుకోలేకపోయానని ఆయన అన్నారు. ఈ లిక్కర్ కేసు కోర్టు విచారణలో నిలవదని పలువురు ఇదివరకే అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రేరేపితమైన ఇలాంటి కేసులు వీగిపోతాయని న్యాయ నిపుణులు అప్పుడే చెప్పారు. అయితే జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయింది. కానీ, ఇక్కడ మనం గమనించాల్సిన అంశం ఒకటుంది. ఈ లిక్కర్ కేసులో న్యాయస్థానం తీర్పు త్వరగానే వచ్చింది. జగన్మోహన్ రెడ్డి వంటి వారిపై నమోదైన అవినీతి కేసులలో పుష్కర కాలం గడచినా విచారణ కూడా ప్రారంభం కావడం లేదు. కనీసం లిక్కర్ కేసులోనైనా తీర్పు వచ్చింది. కేజ్రీవాల్ ప్రభృతులు నిర్దోషులని స్పష్టమైంది. జగన్‌రెడ్డి వంటి వాళ్లు దోషా? నిర్దోషా? అన్నది ఎప్పటికి తేలుతుందో చెప్పలేని పరిస్థితి.

> దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం వల్లనే దోషులు బుకాయిస్తున్నారు. ప్రశ్నిస్తున్న వారిపై ఎదురుదాడి చేస్తున్నారు. ఈ పరిస్థితి తొలగిపోవాలంటే న్యాయ వ్యవస్థలో అడుగుకో జితేంద్రసింగ్ ఉండాలి. ఉంటారని ఆశిద్దాం!



అడ్డగోలుతనానికి చెక్ పెట్టాలి!

తెలంగాణలో పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన కేసులో మూడు వారాల్లోగా విచారణ పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని శాసనసభ స్పీకర్‌కు సుప్రీంకోర్టు గడువు విధించింది. మంచిదే.. ఇలాంటి గడువు ఉండాల్సిందే! అయితే న్యాయ వ్యవస్థలకు కూడా ఇలాంటి గడువు ఉండాలి కదా? గడువు లేకుండా కేసుల విచారణను సాగదీసుకుంటూ పోవడం వల్ల దోషులు నిర్దోషులుగా, నిర్దోషులు దోషులుగా చలామణి కారా? న్యాయ వ్యవస్థ ఈ దిశగా ఆలోచించాలని కోరుకోవడం కోర్టు ధిక్కరణ కాదు కదా? రిమాండ్‌లను నిరవధికంగా పొడిగించడం ద్వారా కేజ్రీవాల్, సిసోడియా వంటి నిర్దోషులను నెలల తరబడి జైల్లో నిర్బంధించే పరిస్థితి ఉంటున్నందున ఈ పరిస్థితిని అధిగమించడం కోసం మార్గదర్శకాలను రూపొందించే బాధ్యతను సర్వోన్నత న్యాయస్థానం తీసుకోవాల్సిన అవసరం ఇప్పుడు కనిపిస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయాల నేపథ్యంలో అధికారంలో ఉన్నవారు రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. ఆయా కేసుల్లో బలం ఉన్నా లేకపోయినా నిందితులు జైలు జీవితం గడపాల్సి వస్తోంది. నిందితులకు కొంత కాలానికి బెయిల్ రావొచ్చు గానీ ఆ తర్వాత సదరు కేసులకు అతీగతీ ఉండదు. సంచలనం సృష్టించిన కేసులు కూడా ప్రభుత్వాలు మారగానే అటకెక్కుతాయి. చంద్రబాబుపై గత ప్రభుత్వం పెట్టిన స్కిల్ కేసును ఇప్పుడు మూసివేశారు. ఆ కేసును ఉపసంహరించుకోవడానికి న్యాయస్థానం కూడా ఆమోదించింది. అంటే సదరు కేసులో బలం లేదని న్యాయ వ్యవస్థ కూడా నమ్మినట్టే కదా! అంటే ప్రాథమిక సాక్ష్యాధారాలు కూడా లేని కేసులో చంద్రబాబును యాభై రోజులకుపైగా జైల్లో పెట్టినట్టే కదా! కేజ్రీవాల్ ఏకంగా ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఆరు నెలలు జైల్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు ఆయన నిర్దోషి అని తేలిపోయింది. వంద మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు గానీ ఒక్క నిర్దోషి కూడా శిక్ష అనుభవించకూడదు అన్నది న్యాయ వ్యవస్థలోని ప్రాథమిక సూత్రం. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. దర్యాప్తు సంస్థలకు, ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంస్థకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టారు. మేం మీపై అభియోగాలు మోపుతాం, నిర్దోషులమని నిరూపించుకోవాల్సిన బాధ్యత మీదే అన్నట్టుగా ఈడీ వ్యవహరిస్తోంది. ఈ అభియోగాలలో పస ఉందో లేదో తేలేవరకు నిందితులు జైల్లోనే ఉండాల్సి వస్తోంది. ఇది సహజ న్యాయ సూత్రానికి, ప్రాథమిక హక్కులకు విరుద్ధం కాదా? కేసు నమోదు చేసిన వారికి దాన్ని రుజువు చేయాల్సిన బాధ్యత లేకపోవడం ఏమిటి? అభియోగం ఎదుర్కొంటున్న వారే నిర్దోషులమని రుజువు చేసుకోవాల్సి రావడం ఏమిటి? ఈడీకి ఈ ప్రత్యేకమైన మినహాయింపు ఎందుకిచ్చారో తెలియదు. నేరాభియోగాన్ని రుజువు చేయాల్సిన బాధ్యత సీబీఐ వంటి సంస్థపై ఉంటుంది. కేజ్రీవాల్ ప్రభృతులపై దాఖలైన కేసును సీబీఐ రుజువు చేయలేకపోవడం వల్లనే నిందితులందరూ నిర్దోషులుగా బయటపడ్డారు. ఈ కేసు నమోదు నుంచి తీర్పు వరకూ అన్నీ సంచలనాలే! కేంద్ర

> ఈ లిక్కర్ కేసులో ఏ స్థాయిలో కూడా ప్రాథమిక సాక్ష్యాధారాలను సీబీఐ చూపించలేకపోయిందని, కట్టుకథలతో చార్జిషీట్‌ను రూపొందించిందని న్యాయస్థానం వ్యాఖ్యానించడాన్ని మించిన అవమానం సీబీఐకి ఇంకేం ఉంటుంది?

హోం శాఖకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ రాసిన లేఖ ఆధారంగా సీబీఐ రంగంలోకి దిగింది. ఆ లేఖ ఆధారంగా సీబీఐ కేసు కట్టి కేజ్రీవాల్ ప్రభృతులను అరెస్టు చేసింది. సదరు దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన విచారణ జరపాలని సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తన తీర్పులో ఆదేశించింది. దీన్నిబట్టి దర్యాప్తు సంస్థకు చెందిన అధికారులు పైవారిని సంతృప్తిపరచడం కోసం నిర్దోషులపై కూడా చర్యలు తీసుకుంటున్నారని స్పష్టమవుతోంది. తీర్పులో భాగంగా న్యాయాధికారి పలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల ప్రభావం సీబీఐపై కచ్చితంగా ఉంటుంది. ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన సీబీఐ వంటి సంస్థల విశ్వసనీయత ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఢిల్లీ లిక్కర్ కేసులో సీబీఐ అడ్డగోలుగా వ్యవహరించిందని మరోమారు స్పష్టమైంది. ఈ నేపథ్యంలో న్యాయాధికారులు రిమాండ్లను పొడిగించే ముందు కేసులో ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయా? లేవా? అన్నది పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేయడం లేదా? ఏది ఏమైనా న్యాయాధికారి జితేంద్రసింగ్ ఇచ్చిన తీర్పు న్యాయ వ్యవస్థ గౌరవాన్ని ఇనుమడింపజేస్తోంది. న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానాలలో ఉన్నవారు కూడా ప్రలోభాలకు లొంగిపోతున్నారన్న అభిప్రాయం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి తీర్పులు సామాన్య ప్రజల్లో న్యాయ వ్యవస్థపై ఆశలను చిగురింపజేస్తాయి. దర్యాప్తు సంస్థలకు కూడా ఇలాంటి తీర్పులు చెంపపెట్టులా ఉంటాయి. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా తన తీర్పు ద్వారా న్యాయ వ్యవస్థ గౌరవాన్ని ఇనుమడింపజేసిన న్యాయాధికారి జితేంద్రసింగ్‌ను అభినందించాల్సిందే. వ్యవస్థలలో ఇటువంటి వారు ఇంకా మిగిలి ఉన్నందునే ఈ దేశంలో ధర్మం, న్యాయం ఇంకా మిగిలి ఉన్నాయి. న్యాయాధికారి లేదా న్యాయమూర్తి నిబద్ధతతో నిక్కచ్చిగా వ్యవహరించని పక్షంలో దర్యాప్తు సంస్థలు ఎన్ని దురాగతాలకైనా పాల్పడవచ్చునని ఢిల్లీ లిక్కర్ కేసులో రుజువైంది. విచారణ అధికారిపై శాఖాపరమైన విచారణ జరపాలని న్యాయస్థానం ఆదేశించడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. పంజరంలో చిలకలా మారిన సీబీఐ వంటి సంస్థలకు ఇంతకంటే అవమానం ఏముంటుంది? అధికారంలో ఉన్న వారి సేవలో తరించడానికి కాదు వ్యవస్థలు ఉన్నది. ఒకవేళ ఎవరైనా తరించాలనుకున్నా తమను కట్టడి చేయడానికి మరో వ్యవస్థ ఉంటుందని హెచ్చరించడానికి ఈ తీర్పు దోహదపడుతుంది. అవినీతి అక్రమాలను నిరోధించడానికి ఏర్పాటైన సంస్థలు నిర్దోషులను దోషులుగా, దోషులను నిర్దోషులుగా చిత్రీకరించడానికి ప్రయత్నించడం క్షమించరాని నేరమే కాదు.. మహా పాపం కూడా. కేజ్రీవాల్ ప్రభృతులు అనుభవించిన మానసిక క్షోభకు సీబీఐ డైరెక్టర్ బాధ్యత తీసుకుంటారా? అధికారానికే కాదు.. అంతరాత్మకూ జవాబుదారీగా ఉండాలని అధికారులు గుర్తించాలి. అధికార దుర్వినియోగానికి పాల్పడే పాలకులకు కూడా ఈ తీర్పు ఒక హెచ్చరిక. ఈ కేసులో ఏ స్థాయిలో కూడా ప్రాథమిక సాక్ష్యాధారాలను సీబీఐ చూపించలేకపోయిందని, కట్టుకథలతో చార్జిషీట్‌ను రూపొందించిందని న్యాయస్థానం వ్యాఖ్యానించడాన్ని మించిన అవమానం సీబీఐకి ఇంకేం ఉంటుంది? ఇలాంటి తీర్పుల వల్ల ఇతర వ్యవస్థల్లో కొరవడిన జవాబుదారీతనం మళ్లీ వస్తుందని ఆశిద్దాం.

> ఆకాశం కూలినా సరే న్యాయం జరగాలి అని న్యాయాధికారి జితేంద్ర సింగ్ తన తీర్పులో భాగంగా వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థకు కూడా అవినీతి చెద పట్టిందన్న అభిప్రాయం బలపడుతున్న వేళ ఇటువంటి తీర్పులు దేశ ప్రజల్లో నైరాశ్యాన్ని తొలగిస్తాయి. న్యాయ వ్యవస్థలో అవినీతి గురించి కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఈఆర్‌టీ సంస్థ ఎనిమిదవ తరగతి సిలబస్‌లో ఏకంగా ఒక పాఠ్యాంశాన్ని చేర్చడం, దానిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడం, దరిమిలా సదరు పాఠ్యాంశాన్ని తొలగించడం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ దేశంలో న్యాయ వ్యవస్థ మాత్రమే అవినీతిమయం అవుతున్నదా? మిగతా వ్యవస్థలు పవిత్రంగా ఉన్నాయా?

అడుగుకో జితేంద్ర కావాలి!

తాజా తీర్పు దేశ రాజకీయాలలో మార్పునకు దారితీసే అవకాశమూ ఉంది. ప్రతిపక్ష శిబిరం బలహీనపడుతున్న తరుణంలో ఈ తీర్పు వెలువడటం ప్రతిపక్షాలకు నైతిక బలం చేకూర్చినట్టు అవుతుంది. రాజకీయ ప్రత్యర్థులను కేసులతో వేధిస్తున్నారని తాము ఇంతకాలంగా చేస్తున్న ఆరోపణలు నిజమని ఈ తీర్పుతో రుజువైందని కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టవచ్చు. ప్రతిపక్షాల మధ్య ఐక్యతను పెంపొందించడానికి ఈ తీర్పు దోహదపడుతుందో లేదో ఇప్పుడే చెప్పలేం గానీ కేంద్ర ప్రభుత్వం పెద్దలు మాత్రం ఈ తీర్పుతో ఎంతో కొంత ఆత్మరక్షణలో పడతారని చెప్పవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్ అని అంటారు. అధర్మం పెచ్చరిల్లినప్పుడు నేనున్నాను అని దేవుడు కల్పించుకుంటాడు అని మనం నమ్ముతాం. 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అన్నట్టుగా అన్యాయం హద్దులు దాటినప్పుడు న్యాయం చేయడానికి ఎవరో ఒకరు పుట్టుకొస్తారు. సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి జితేంద్రసింగ్ రూపంలో కేజ్రీవాల్ ప్రభృతులకు జరిగిన అన్యాయం సరిదిద్దినట్లయింది. యావత్ న్యాయ వ్యవస్థ ఇంతే నిక్కచ్చిగా వ్యవహరిస్తే అధికార దుర్వినియోగానికి ఎవరు మాత్రం సాహసిస్తారు? కాలాన్ని వెనక్కు జరిపి కేజ్రీవాల్ ప్రభృతులు కోల్పోయిన దాన్ని ఎవరూ తిరిగి ఇవ్వలేరు గానీ ఈ తీర్పుతో ఆయన కడిగిన ముత్యంలా బయటకు వచ్చారు. ఢిల్లీలో కేజ్రీవాల్ పార్టీ అధికారం కోల్పోవడానికి ఈ లిక్కర్ కేసు ప్రధాన కారణం అన్న అభిప్రాయం ఉన్నందున తెలంగాణలో తాము అధికారం కోల్పోవడానికి కూడా కవితపై పెట్టిన ఈ కేసే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ఆయన సోదరి కవిత మాత్రం ఈ అభిప్రాయంతో విభేదించారు. కేసీఆర్, కేటీఆర్‌ల అహంకారం వల్లనే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని ఆమె ప్రతిస్పందించారు. ఆ ఇంటి పంచాయితీ ప్రస్తుతం అప్రస్తుతం. ఇకనైనా కేంద్ర దర్యాప్తు సంస్థలు మరింత బాధ్యతగా వ్యవహరిస్తాయని, వ్యవహరించాలనీ కోరుకుందాం. రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలు ఏ దశలో కూడా వారికి ఉపయోగపడకూడదని ఆశించడంలో తప్పు లేదు కదా? దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం వల్లనే దోషులు బుకాయిస్తున్నారు. ప్రశ్నిస్తున్న వారిపై ఎదురుదాడి చేస్తున్నారు. ఈ పరిస్థితి తొలగిపోవాలంటే న్యాయ వ్యవస్థలో అడుగుకో జితేంద్రసింగ్ ఉండాలి. ఉంటారని ఆశిద్దాం!

> దర్యాప్తు సంస్థలు ఎవరిపైన అయినా కేసులు కట్టగానే న్యాయస్థానాలు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడం పరిపాటే. తొలుత పద్నాలుగు రోజుల పాటు రిమాండ్ విధిస్తారు. ఆ తర్వాత దాన్ని పొడిగిస్తుంటారు. ఈ కారణంగా నేరం చేయకపోయినా సిసోడియా దాదాపు ఏడాదిన్నర పాటు, కేజ్రీవాల్ 156 రోజుల పాటు, కవిత 165 రోజులు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు సమయంలో కేసులో ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించాల్సిన బాధ్యత న్యాయాధికారులు, న్యాయమూర్తులపై ఉండదా? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ముఖ్యమంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు ప్రజాప్రతినిధులు ఎవరైనా నెల రోజులు దాటి జైలులో ఉంటే వారు తమ పదవులు కోల్పోయే విధంగా కొత్త చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తలపోస్తోంది. ఢిల్లీ లిక్కర్ కేసు నేపథ్యంలో ఈ ప్రతిపాదిత చట్టం సమర్థనీయమా? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

హక్కులకు బాధ్యతలు ప్రత్యామ్నాయం కాదు!

'బాధ్యతలు నెరవేరిస్తేనే హక్కులు దక్కుతాయి' అనే శీర్షికతో ఫిబ్రవరి 24న ప్రచురితమైన వ్యాసం పౌరుల నైతిక ప్రవర్తనను ఉద్బోధించే క్రమంలో, ప్రజాస్వామ్యంలోని ప్రాథమిక సూత్రాలను విస్మరించింది. ఈ వ్యాసం పాలకుల బాధ్యతను ప్రజలపైకి నెట్టే ప్రయత్నానికి మేధో ముసుగు అందిస్తోంది.

వ్యాసకర్త 'బాధ్యతలు నెరవేరిస్తేనే హక్కులు దక్కుతాయి' అంటున్నారు. అంటే, హక్కులను షరతులతో ముడిపెట్టడమే (Conditionality of Rights) కదా. ఇది రాజ్యాంగ తత్వానికి విరుద్ధంగా కనిపించే సరళీకరణ. రాజ్యాంగం ప్రకారం పౌరుడే కేంద్ర బిందువు. ప్రభుత్వం అనేది ప్రజల సార్వభౌమత్వం నుంచి పుట్టిన ఒక సాధనం మాత్రమే. ప్రజలు వారి హక్కులను కాపాడుకోవడానికి, సామాజిక పురోగతి కోసం తమ అధికారాన్ని రాజ్యానికి 'ట్రస్టీ'గా అప్పగిస్తారు. కాబట్టి, ప్రభుత్వాల విధి హక్కులను ప్రసాదించడం కాదు, ఉన్న హక్కులను రక్షించడం.

రాజ్యం తన విధులను కేవలం రాజ్యాంగ పరిధిలోనే నిర్వర్తించాలి. అభివృద్ధి పేరుతోనో, మరే ఇతర కారణంతోనో పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధం. విభిన్న వర్గాల ప్రయోజనాలను సమతూకం చేస్తూ, రాజ్యాంగ ఆశయాలను నెరవేర్చడమే నిజమైన ప్రజాస్వామ్య పాలన. భారత రాజ్యాంగం ప్రకారం, ప్రాథమిక హక్కులు (Fundamental Rights) పౌరుడికి సహజసిద్ధంగా లభిస్తాయి. అవి ఏదైనా 'పని' చేసినందుకు ఇచ్చే బహుమతులు కావు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఒక పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించలేదనే నెపంతో, అతని వాక్ స్వాతంత్ర్యాన్ని లేదా జీవించే హక్కును ప్రభుత్వం దూరం చేయకూడదు. హక్కులను బాధ్యతలతో ముడిపెట్టడం అంటే పౌరుడిని ప్రభుత్వం ముందు మోకరిల్లేలా చేయడం వంటిదే.

వ్యవస్థాగత వైఫల్యాలను వ్యక్తిగతీకరించేలా (Individualizing Systemic Failures) వ్యాసకర్త పలు అంశాలు ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణ, అవినీతిని అంతం చేయడం, ప్రజా ఆస్తుల రక్షణ వంటి అంశాలను పూర్తిగా పౌరుల బాధ్యతగా ఆయన చిత్రించారు. అలాగే, 'చెట్లు నాటడం, వన్య ప్రాణులను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం... వంటి చర్యలు తీసుకోవడం మన బాధ్యత' అన్నారు. ఉదాహరణకు, అమెరికాలో పర్యావరణ ఉద్యమాలు బలపడుతున్న 1960 దశకంలో అక్కడి కార్పొరేట్ శక్తులు ఎంచుకున్న 'పక్కదోవ పట్టించే ఎత్తుగడ' ఇదే. 'అమెరికాను అందంగా ఉంచుదాం' అంటూ కోకాకోలా వంటి కంపెనీల ప్రకటనల్లో 'ప్రజలే కాలుష్యాన్ని మొదలుపెడతారు, కాబట్టి ప్రజలే దాన్ని ఆపగలరు' అని ఊదరగొట్టారు. అలాంటి పలు ప్రకటనలను పరిశీలించిన ప్రొ. ఫినిస్ డనవే వాటిని విశ్లేషిస్తూ 'సీయింగ్ గ్రీన్' (Seeing Green) అనే పుస్తకం రాశారు. ఆ పుస్తకంలో, ఇదొక ప్రచార మాయాజాలమనీ, ఉత్పత్తిదారుడి బాధ్యతలను వినియోగదారుడిపైకి నెట్టి, తాము సురక్షితంగా తెరవెనుక ఉండిపోయే ప్రయత్నమనీ డనవే రాశారు. అదే కోవలో ఈ వ్యాసకర్త కూడా ప్రభుత్వ బాధ్యతను ప్రజల బాధ్యతగా చిత్రించే ప్రయత్నం చేశారు. సమస్య యొక్క నిర్మాణాత్మక మూలాలను ప్రస్తావించకుండా, నైతిక బాధ్యతను వ్యక్తిగత స్థాయికి కుదించే ఫ్రేమింగ్ ఆ వ్యాసంలో కనిపిస్తోంది. అంటే, భారీ పరిశ్రమల వల్ల కలిగే కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైన ప్రభుత్వం– ప్రజలకు 'ప్లాస్టిక్ వాడొద్దు' అని చెప్పడం ద్వారా తన వైఫల్యాన్ని ప్రజలపైకి నెట్టేస్తోంది (Deflection). అవినీతి అనేది వ్యవస్థలో ఉన్న లోపం, దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత పాలకులదే కానీ, కేవలం ప్రజల నీతిపై ఆధారపడి వ్యవస్థ మారదు.

> 'బాధ్యతలు నెరవేరిస్తేనే హక్కులు దక్కుతాయి' అనే వ్యాసం పౌరుడిని ఒక 'విధేయుడైన సేవకుడి'గా చూడాలని కోరుకుంటోందే తప్ప, ప్రశ్నించే 'హక్కులు గల పౌరుడి'గా కాదు. బాధ్యతలు ముఖ్యం, కాదనలేం. కానీ అవి హక్కులకు ప్రత్యామ్నాయం కాకూడదు. 'హక్కులు లేని బాధ్యతలు బానిసత్వం.. బాధ్యత లేని హక్కులు అరాచకం'. కానీ ఇక్కడ వ్యాసం కేవలం మొదటిదానికే ప్రాధాన్యమిచ్చి, రెండో వైపు ఉన్న ప్రభుత్వ బాధ్యతను కప్పిపుచ్చింది.



వ్యాసమంతా పౌరులు ఏం చేయాలి అనే దానిపైనే దృష్టి సారించింది. కానీ, పాలకులు లేదా ప్రభుత్వం ఏం చేయాలి అనే అంశాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ప్రజల బాధ్యత మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువగా పాలకుల జవాబుదారీతనం (Accountability). ప్రజలు పన్నులు కడుతున్నప్పుడు, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను గుర్తుచేయకుండా, కేవలం ప్రజలకే పాఠాలు చెప్పడం ఏకపక్షంగా ఉంది.

అధికార పక్షానికి అనుకూలమైన వాదనలు ఈ వ్యాసంలో ఉన్నాయి. 'రాజకీయ అస్థిరత, విలువల క్షీణత' వంటి కారణాల వల్ల 1976లో (ఎమర్జెన్సీ సమయంలో) ప్రాథమిక బాధ్యతలను రాజ్యాంగంలో చేర్చారని వ్యాసంలో ఉంది. ఆ సమయంలో పౌరుల గొంతు నొక్కడానికి, ప్రభుత్వానికి ఎదురు తిరగకుండా చేయడానికి ఈ 'బాధ్యతల' ముసుగును ఉపయోగించారు. వ్యాసం ఆ చారిత్రక కోణాన్ని విస్మరించి, దాన్ని ఒక గొప్ప సంస్కరణలా చిత్రీకరించింది. ఈ వ్యాసం పౌరుడిని ఒక 'విధేయుడైన సేవకుడి'గా చూడాలని కోరుకుంటోందే తప్ప, ప్రశ్నించే 'హక్కులు గల పౌరుడి'గా కాదు. బాధ్యతలు ముఖ్యం, కాదనలేం. కానీ అవి హక్కులకు ప్రత్యామ్నాయం కాకూడదు. 'హక్కులు లేని బాధ్యతలు బానిసత్వం.. బాధ్యత లేని హక్కులు అరాచకం' అంటారు. కానీ ఇక్కడ వ్యాసం కేవలం మొదటిదానికే ప్రాధాన్యమిచ్చి, రెండోవైపు ఉన్న ప్రభుత్వ బాధ్యతను కప్పిపుచ్చింది.

▪ బాబూరావు కలపాల

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 1 మార్చి 2026





• న్యాయమూర్తుల గెస్ట్ హౌస్, క్లబ్‌కు శంకుస్థాపన చేయనున్న ప్రదేశం

జ్యుడీషియల్ అకాడమీకి.. నేడు శంకుస్థాపన

అమరావతి పిచ్చుకలపాలెంలో ఏర్పాట్లు పూర్తి

- రూ.165 కోట్లతో 2.48 లక్షల అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం
- నేలపాడులో జడ్జీల బంగ్లాలు, అతిథి గృహాలు ప్రారంభోత్సవం
- హాజరు కానున్న సీజేఐ సూర్యకాంత్, ముఖ్యమంత్రి చంద్రబాబు

తుళ్లూరు, గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని జ్యూడీషియల్ అకాడమీ రాష్ట్ర విభజనానంతరం తెలంగాణకు వెళ్లిపోగా విభజిత ఏపీకి జ్యూడీషియల్ అకాడమి లేకుండా పోయింది. ఈ క్రమంలో మంగళగిరికి సమీపంలోని కాజాలో అద్దె భవనంలో అకాడమీని ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం రాజధాని



జడ్జి బంగ్లాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

అమరావతిలో అకాడమికి ప్రత్యేకంగా భూమిని కేటాయించింది. అయితే అమరావతి అభివృద్ధితో పాటు అకాడమీ పనులను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం తిరిగి ఏర్పడటంతో అమరావతి పనులు పూర్తి స్థాయిలో జరుగుతుండటంతో ఏపీ జ్యూడీషియల్ అకాడమీకి శాశ్వత భవన సముదాయాన్ని నిర్మించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. రాజధాని పరిధిలోని పిచ్చుకలపాలెంలో 4.83 ఎకరాల విస్తీర్ణంలో అకాడమీ నిర్మాణానికి ప్రభు త్వం రూ.165 కోట్లకు పరి పాలన అనుమతులను మంజూరు చేసింది. హై కోర్టు భవనం సమీపంలోనే ఏపీ జ్యూడీషియల్ అకాడమీ ఏర్పాటు కానున్నది. ఆదివారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్‌ఠాకూర్‌ల సమక్షంలో జ్యుడిషి యల్ అకాడమీ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనున్నది. దీంతో పాటు నేలపాడులో హైకోర్టు అతిథి గృహాలు జడ్జీల బంగ్లాల ప్రారంభోత్సవం జరగనున్నది. కాగా ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను శనివారం ఏడీసీఎల్ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి పరిశీలించారు. ప్రముఖుల పర్యటనకు రాజధాని రహదార్లకు ముస్తాబు చేస్తున్నారు. సీఎండీ, ఇంజనీరింగ్ అధికారులు ఆయా పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి, ఉద్యాన విభాగం అధికారులు ధర్మజ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆధునికంగా.. ఆహ్లాదకరంగా..

అమరావతిలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను ప్రతిబింబించేలా సమగ్ర ప్రణాళికతో అకాడమీని నిర్మించేందుకు ఏపీసీఆర్‌డీఏ సిద్ధమైంది. అకడమిక్ బ్లాక్ బేస్‌తో (మిగతా 8వ పేజీలో)

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సాయంత్రం 6.19 (ఆదివారం)
సహరి : ఉదయం 5.08 (సోమవారం)

బిల్డింగ్ లేఅవుట్

అకాడమిక్ బ్లాక్‌లో 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, 120 సీట్లతో సెమినార్ హాల్, 70 సీట్లతో తరగతి గదులు, 70 సీట్లతో మూట్ కోర్ట్ హాల్(కోర్టు హాల్ తరహాలో ఉంటుంది), 50 సీట్లతో కంప్యూటర్ ల్యాబ్, 60 సీట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్, 48 సీట్లతో గ్రంథాలయం, రీడింగ్ రూమ్ అకాడమీలో నిర్మించనున్నారు. న్యాయమూర్తుల కోసం విశాలమైన లాంజ్, డైరెక్టర్ కార్యాల యం, పరిపాలన కార్యాలయాలు, చర్చలకు వీలుపడేలా ఛాంబర్స్, బోధనా సిబ్బందికి ప్రత్యేక గదులు నిర్మిస్తారు. హెల్త్ యూనిట్, శిశువులకు క్రెచ్(సంరక్షణ) సదుపాయం, భవనాలలో సులభ సంచారానికి వీలుగా 3 మీటర్ల పొడవైన కారిడార్లు, సెంట్రలైజడ్ లిఫ్ట్ లాబీలను ఏర్పాటు చేయనున్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కృషి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- నంబూరులో ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ

8

పవన్ ఇంటి భద్రతను టెస్ట్ చేసేందుకే దాడి..

- పోలీసు విచారణలో ఆగంతకుడి సమాధానం?
- మానసిక స్థితి సరిగా లేదని ప్రాథమిక నిర్ధారణ

8

అబుదాబీలో చిక్కుకున్న గుంటూరు వాసులు

ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం ఎఫెక్ట్

6

విద్యుత్ డివిజన్ల పునర్విభజన

- గుంటూరు టౌన్ డివిజన్‌గా రూపాంతరం
- అమరావతి టౌన్ క్యాపిటల్‌గా పేరు మార్పు
- సీఆర్‌డీఏలోనే చిలకలూరిపేట డివిజన్

8

గుంటూరు మీదగా మరో రైలు

- రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా రాకపోకలు
- పలు పుణ్యక్షేత్రాలకు నేరుగా కనెక్టివిటీ

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా మరో రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని రైల్వే బోర్డు మంజూరు చేసింది. ఇటీవలే చర్లపల్లి - తిరు వనంతపురం నార్త్ అమృత్ భారత్ రైలుని మంజూరు చేసిన రైల్వేబోర్డు తాజాగా హైదరాబాద్‌లో బయలుదేరే మరో రైలు ఉమ్మడి గుంటూరు జిల్లా మీదగా తిరు పతితో పాటు తమిళనాడులోని పుణ్యక్షేత్రాలను కలుపుతూ కన్యాకుమారి వరకు ప్రయాణిస్తుంది. ఎంతో కాలంగా ప్రయాణికుల నుంచి ఉన్న డిమాండ్‌ని రైల్వే బోర్డు నెరవేర్చింది. ఈ రెగ్యులర్ వీక్లీ సర్వీసుకు ప్రయాణికుల ఆదరణని బట్టి భవిష్యత్‌లో బై, ట్రై వీక్లీ, డైలీ సర్వీసుగా పెంచే అవకాశం ఉంది. దేశంలో కన్యాకుమారి ప్రసిద్ధ పుణ్య క్షేత్రం, పర్యాటక ప్రదేశంగా విరాజిల్లుతోంది. సెలవుదినాల్లో ఆ ప్రాంతానికి వెళ్లడానికి చాలా మంది ఆసక్తి చూపుతుంటారు. గతంలో టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్) సర్వీసుని రైల్వే శాఖ నడిపి ఆ తర్వాత నిలి పేసింది. ఇప్పుడు దానిని రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా పట్టాలెక్కిస్తున్నది. నాలుగు జనరల్, ఆరు ఏసీ త్రీటైర్, 2 ఏసీ టూటైర్, ఒక ఫస్టు ఏసీ, 9 స్లీపర్ క్లాస్ బోగీలుంటాయి. కాగా త్వరితగతిన ఈ రైలును పట్టాలెక్కించాలని రైల్వేబోర్డు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ అధికారులను ఆదేశించింది.



రాకపోకలు ఇలా..

- 17069 హైదరాబాద్ - కన్యాకుమారి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం సాయంత్రం 5.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.10కి కాట్పాడి, గురువారం అర్ధరాత్రి దాటాక 2.30(శుక్రవారం వేకువజాము) కన్యాకుమారి చేరుకుంటుంది.
- 17070 కన్యా కుమారి - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారం వేకువజామున 5.15కి బయలుదేరి రాత్రి 10.10కి కాట్పాడి, శనివారం మధ్యాహ్నం 2.30కి హైదరాబాద్ చేరుకుంటుంది.

ఆగే స్టేషన్లు

సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, తిరువణ్ణామలై (అరుణాచలం), విల్లుపురం, తిరుపాద్రిపుల్యూరు, చిదంబరం, మయిలదుతురై, కుంభకోణం, తంజావూరు, తిరుచ్చిరాపల్లి, దిండిగుల్, కొడైకెనాల్ రోడ్డు, మధురై, విరుదునగర్, సాతూరు, కోవిలపట్టి, తిరునెల్‌వేలి, వాల్లియూర్, నాగర్‌కోయిల్.

విభిన్న ప్రతిభావంతులకు తొలి ప్రాధాన్యం

దివ్యాంగుల గ్రీవెన్స్ డేలో కలెక్టర్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి తక్ష ణమే పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదే శించా రు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో విభి న్న ప్రతిభావంతుల స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. అర్జీలు అందించ డానికి వచ్చిన విభి న్న ప్రతిభవం తుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. సదరం సర్టిఫికెట్స్, పింఛన్లు, బ్యాటరీ వాహనాలు, నివాసాలు, ఇతర సమస్యలపై అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో మొత్తం 46 అర్జీలు అందాయి. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలితో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గుంటూరు రూరల్ పరిధిలో అంకిరెడ్డిపాలేనికి చెందిన నాగమల్లి రాజు హియరింగ్ ఎయిడ్ కిట్ కోసం అర్జీ అందించగా, విభిన్న ప్రతిభావంతులు కార్యాలయం నుంచి తీసుకువచ్చి వెంటనే అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో నివాసాలలో ఖాళీగా ఉన్న ఫ్లాట్లకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు అందించేలా కార్యాచరణ రూపొందించాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఏడీ వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో ఖాజావలి

ఎన్టీఆర్ స్టేడియం.. పాలకవర్గ ఎన్నిక నేడే

- 2160 మంది ఓటర్లు.. పోలింగ్.. కౌంటింగ్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలక వర్గానికి ఆదివారం ఎన్నిక జరగను న్నది. మొత్తం 2,160 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది, అభ్యర్థులకు ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో స్టేడియం ఎక్స్‌అఫిషియో వైస్ ప్రెసిడెంట్, జీఎంసీ ఏసీ చల్లా ఓబులేసు, డీసీ, జాయింట్ సెక్రటరి, ఎన్నికల అధికారి సిహెచ్.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయన్నారు. అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లు తప్పనిసరిగా స్టేడియం సభ్యత్వ కార్డు లేక ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. లేకపోతే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించేదిలేదన్నారు. ఇప్పటికే వైస్ ప్రెసిడెంట్ (దామా మహేశ్వరరావు), జాయింట్ సెక్రటరి (పాకనాటి ఉమామహేశ్వరరావు), ట్రెజరర్ (కండె కాంతారావు) పదవులకు ఒక్కొక్క నామినేషన్లు రాగా ఆ పదవులు ఏకగ్రీవమయ్యాయి. సెక్రటరి పోస్టుకి ఇద్దరు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పదవికి 11 మంది (పురుషులు), ముగ్గురు (మహిళలు) మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో ఆయా పదవులకు ఎన్నిక అనివార్యమైంది.



ఇళ్ల వద్ద రేషన్ ఎందుకు ఇవ్వరు

రేషన్ డీలర్లపై జేసీ శ్రీవాస్తవ ఆగ్రహం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఎందుకు పంపిణీ చేయడం లేదని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ రేషన్ డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జేసీ శనివారం రేషన్ డీలర్లు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్తవ

రేషన్ డీలర్ల వ్యవహారశైలి ఏమాత్రం బాగాలేదన్నారు. సమయపాలన ఏమాత్రం పాటించడం లేదన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో రేషన్ డీలర్లపై నెగెటివ్ ఫీడ్‌బ్యాక్‌లు వచ్చాయన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రతీ నెలా 26 నుంచి 31వ తేదీ మధ్య సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్డుదారులకు సరుకులు ఇవ్వాలని, నగదు ఇస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. వంట గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల పైనా ఐవీఆర్ సర్వేలో నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చిందన్నారు. సిలిండర్‌కు అదనంగా నగదు వసూలు చేస్తున్న డెలివరీ బాయ్స్‌ను కట్టడి చేయాలని డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కోమలి పద్మ పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా ఘంటసాల శ్రీనివాసరావు

- జిల్లా నూతన జేఏసీ ఎన్నిక ఏకగ్రీవం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా ఏపీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఎన్నికయాయ్యరు. శనివారం నగరంలోని సంఘ కార్యాలయంలో జేఏసీ భాగస్వామ్య సంఘాలన్నీ గుంటూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. సంఘ ఐక్యత, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఘంటసాల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేఏసీ సెక్రటరీ జనరల్‌గా మహమ్మద్ ఖలీద్ ఎంపికయ్యారు. కో చైర్మన్లుగా ఎం.శ్రీనివాసరెడి, షేక్ బాజీ, ఎస్వీ రమణారావు, వైస్ చైర్మన్లుగా ఎం.కళాధర్, కే.నరసింహారావు, యశోదర దేవి, కె.పిచ్చయ్య, జె.పూర్ణచంద్రారెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా టీ.మహేష్, ఎం.వెంకయ్య పి .సుజాత, కె.రాంబాబు, సీహెచ్ కల్యాణ్ కుమార్, వై.పద్మజ, జి.సుకుమార్, కె. సాంబ శివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శ్యాం సుందర్ శ్రీనివాస్, ట్రెజరర్ గా ఎల్.శ్రీధర్ రెడ్డి, ఈసీ మెంబర్లుగా జి వేళాంగిణి రాజు, డి.శ్రీనివాసరెడ్డి, టీవీ మోహన్ రాజు, సీహెచ్.అంజనీ దేవి, వైసీహెచ్ కోటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, జె.వెంకటేశ్వరరావు, ఎం. కోటయ్య, ఎం .శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు ఎన్నికయ్యా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ 257 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవలింగారావు విచ్చేసి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



సంఘీభావం ప్రకటిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కమనీయం శ్రీవారి దర్శనం

హంస, గజ వాహనాలపై గ్రామోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా



స్వామివారు శనివారం రెండు వాహనాలపై భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం హంస వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పాలను, నీటిని వేరు చేసే స్వచ్ఛమైన పాలను గ్రోలు హంస వలె భక్తుల పాపాలను వేరు చేసి పుణ్యా త్ములుగా చేసేందుకు శ్రీవారు హంస వాహనంపై దర్శనమిస్తారని అర్చకస్వాములు వివరించారు. ఈ ఉత్సవానికి వేదాంత వెంకట రమణాచార్యులు జ్ఞాపకార్థం భార్య గోపాల సత్యవతి, కుమారుడు వేణుగోపాల వాసుదేవభట్టర్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. సాయంకాలం స్వామివారు గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. గజ వాహన ఉత్సవాన్ని దర్శించిన ఎడల మొసలి బారి నుంచి తన భక్తుడైన గజేంద్రుని రక్షించిన విధంగా సంసారమనే మొసలి బారి నుంచి భక్తులను శ్రీవారు రక్షించి ముక్తిని ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవానికి పాతమంగళగిరి పద్మశాలీయ సంఘం వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రేపటి నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం

● అధ్యాపకులు రిపోర్ట్ చేయాలని ఆర్ఐఓ ఆదేశాలు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం (వ్యాల్యుయేషన్) మార్చి 2నుంచి ప్రారంభం కానుంది. తొలుత సంస్కృత పేపర్ వాల్యుయేషన్ నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ జి.సునీత వెల్లడించారు. గుంటూరు నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో జరిగే మూల్యాంకనానికి నిర్దేశించిన సంస్కృత భాష అధ్యాపకులు ఉదయం 12.30 గంటలకు రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఇక శనివారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 3,856 విద్యార్థులకు 3759 మంది హాజరయ్యారు.

మెడికల్ కళాశాలకు భాష్యం విద్యాసంస్థల విరాళం


చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న హరిబాబు, భాష్యం జనని

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాల అభివృద్ధికి భాష్యం విద్యాసంస్థలు తమవంతు వితరణ ప్రకటించాయి. చైర్మన్ భాష్యం రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని, భాష్యం పేరమ్మ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.4,50,000 విరాళంగా అందజేశారు. నగదు చెక్కును భాష్యం రామకృష్ణ కుమార్తె జనని, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ బి.హరిబాబు గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారికి శనివారం అందజేశారు.

అబుదాబీలో చిక్కుకున్న గుంటూరు వాసులు

● ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం ఎఫెక్ట్

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అమెరికా నుంచి బయలుదేరిన ఓ కుటుంబం అబుదాబీలో చిక్కుకుపోయింది. యూఎస్ఏ నుంచి శుక్రవారం రాత్రి 2 గంటలకు (భారత కాలమాన ప్రకారం) బయలుదేరి శనివారం మధ్యాహ్నం అబుదాబీలో విమానం మారేందుకు వారు దిగారు. అప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైంది. విమానాలన్నీ రద్దయ్యాయనే సమాచారంతో దిక్కుతోచని స్థితిలో అక్కడే ఉండిపోయారు. సెల్‌ఫోన్లు కూడా పని చేయకపోవడంతో గుంటూరులోని కుటుంబ సభ్యులు కలవరపడుతున్నారు. అబుదాబీలో దిగిన వారిలో వందమంది వరకు తెలుగువారు ఉన్నట్లు సమాచారం. వారిలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన సంగా లక్ష్మి, కోడలు నాగశ్రీ శశి, ఏడాది కూడా నిండని పసికందు ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయారు. ఈ విషయం తెలియని నాగశ్రీశశి తండ్రి కోటేశ్వరరావు తొలిసారి అమెరికా నుంచి వస్తున్న తన మనవడిని రిసీవ్ చేసుకునేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడ ఈ సమాచారం తెలియడంతో విషాదవదనంతో గుంటూరుకు వెనుతిరిగారు. తాజా సమాచారం ప్రకారం ప్రయాణికులను సమీపంలోని హోటల్‌కి తరలించి పరిస్థితి సద్దుమణిగాక స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు అక్కడి అధికారులు చేస్తున్నట్లు తెలిసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	167, 176, 187
చికెన్ విత్ స్కిన్(కిలో)	324.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	334.00

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
● శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు అండగా నిలవడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందంజలో ఉంటారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పాత మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జీడీసీఎంఎస్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, బిజినెస్ మేనేజర్ దగ్గుమల్లి హరగోపాలం, యార్డు చైర్మన్ షేక్ కరీముల్లాలతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. రైతులు తెచ్చిన శనగల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో శనగ రైతులకు ఆశించిన ధర లభించడం లేదని, క్వింటాల్‌కు కేవలం రూ.5,100 మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ఈ కష్టకాలంలో శనగ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి, సొసైటీల ద్వారా రూ. 5,875 మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2014-19 మధ్య కాలంలోనూ మద్దతు ధర లేని సమయంలో పొగాకుకు క్వింటాల్‌కు రూ. 2 వేలు, మిర్చికి రూ. 1,500 అదనంగా బోనస్ ఇచ్చి ఆదుకున్న చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానిదని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా మిర్చి, పొగాకు, మామిడి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మార్క్ ఫెడ్ అధికారులు కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, తేమ శాతం నెపంతో రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధర అందేలా చూడాలని ఆదేశించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడించి, సాగు ఖర్చులు తగ్గించి రైతును రాజును చేయాలన్నది చంద్రబాబు ఆలోచన అని ఆయన వివరించారు. ఇందుకోసం ఇటీవల రాష్ట్రానికి విచ్చేసిన మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో కూడా ముఖ్యమంత్రి కీలక చర్చలు జరిపారని గుర్తుచేశారు. మార్క్ ఫెడ్ డీఎం నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, జీడీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు

పోలవరం, పట్టిసీమను సందర్శించిన విజ్ఞాన్ విద్యార్థులు


పోలవరం మోడల్ హౌస్ వద్ద విద్యార్థులు

పోలవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకాలను గుంటూరు వడ్లమూడి విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ సివిల్ ఇంజనీరింగు విద్యార్థులు శనివారం సందర్శించారు. వారికి ప్రాజెక్టు అధికారులు సంబంధిత వివరాలను తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో మోడల్ హౌస్, హిల్‌వ్యూ, స్పిల్‌వే, ఎగువ దిగువ కాఫర్ డ్యాంలు, ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం, పవర్ హౌస్ ప్రాంతాలను వివరించారు. అనంతరం పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకాన్ని, మోడల్ హౌస్ సందర్శించారు. వారికి ఎత్తిపోతల పథకం మేనేజర్ రాజు, జలవనరులశాఖ అధికారుల సంబంధిత వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ కొమ్మినేని బాల గోపికృష్ణ, డాక్టర్ జె. గోపాలరావు, 52 మంది సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో జింబాబ్వే, సిరియా విద్యార్థులు ఉన్నారు.

ఓఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రైవేటు ధర చెల్లించాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రైవేటు ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి .కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం పాతగుంటూరు సీఐటీ యూ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.శివ శంకర్ అధ్యక్షతన అవుటర్ రింగ్ రోడ్డు ప్రభావిత రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో ఐదు జిల్లాల్లో 121 గ్రామాలకు చెందిన రైతుల భూములను ప్రభుత్వం సేకరిస్తున్నట్లు తెలిపారు. స్పష్టమైన విధి, విధానాలు తెలియకపోవడంతో రైతులు భయ భ్రాంతులకు గురవుతున్నరని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో 70 మీటర్లు తీసుకోవాల్సి ఉన్నప్పటికి 250 మీటర్ల పైనే నేషనల్ హైవే అథారిటీ కొలతలతో మార్కింగ్ చేయడం జరిగిందన్నారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా ఎల్పీ నంబర్లు పేరుతో గ్రామ సచివాలయాల్లో నోటీసులు అతికించడం అన్యాయ మన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ గ్రామసభలు పెట్టి, వాస్తవ పరిహారం ఇవ్వాలని, లేని పక్షంలో 9న పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణమూర్తి, పాశం రామారావు, బొట్ల రామకృష్ణ, ఈమని అప్పారావు, రైతులు కోయ కోటేశ్వరరావు, కిలారి పద్మావతి, సాంబశివరావు, జి.సాంబశివరావు, పిచ్చిరెడ్డి, వెంకటేశ్వరరావు, టి.రామారావు, లలిత పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, నాగార్జునసాగర్ లోని డిగ్రీ కాలేజీలో 2025-26 ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ సలీమ్ బాష శనివారం తెలిపారు. ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ఎం.రజిని మాట్లాడుతూ..దరఖాస్తుదారులు మార్చి 31 సాయంత్రం ఐదు గంటలలోగా జ్టిఇట//ౖఇటట్ఇఛిజటఃజీ వెబ్‌సైట్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు పి. సాంబశివరావు, ఎ. బాలశ్రీ, డి. మధుసూదనరావు పాల్గొన్నారు.

ఒడిశా కూలీలకు విముక్తి

● స్వస్థలాలకు తరలించిన కార్మికశాఖ అధికారులు

కొల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి కూలీలను తీసుకొచ్చి.. ఇటుక బట్టీల్లో వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. కూలీలను వారి అభ్యర్థన మేరకు స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేశారు. అధికారుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లాలోని కొల్లూరు మండలం తురకపాలెం గ్రామంలోని ఓ ఇటుకల వ్యాపారి ఒడిశాలోని కీనాపాలీ నుంచి ఇటుక బట్టీలో పని చేసేందుకు 20 మందిని తీసుకొచ్చి.. వెట్టి చాకిరీ చేయిస్తూ, కూలి డబ్బులు కూడా ఇవ్వడం లేదని.. కూలీల బంధువులు ఒడిశా కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి అధికారులు రాష్ట్ర అధికారులకు ఆ ఫిర్యాదును బదిలీ చేశారు. దీంతో ఇటుక బట్టీల్లో విచారణ చేయగా.. ఓ ఇటుక బట్టీలో బాధిత కూలీలు పనిచేస్తున్నట్లు తెలిసింది. ఒడిశా కూలీలను విచారించగా.. కూలి డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో యజమాని జమ చేశారని వారు చెప్పారు. అయితే ఇక్కడ పనులు చేయడం తమకు ఇష్టం లేదని, తమ రాష్ట్రానికి పంపించాలని అభ్యర్థించినా యజమాని ససేమిరా అనడంతో ఈ విషయాన్ని తమ బంధువులకు చెప్పామని వెల్లడించారు. తమను స్వస్థలాలకు పంపాలని కోరడంతో.. వారి అభ్యర్థన మేరకు 20 మంది కూలీలను ఒడిశాకు పంపుతున్నట్లు ఏసీ శివప్రసాద్ తెలిపారు. తెనాలి రైల్వే స్టేషన్‌లో తమ శాఖ అధికారులు మహేష్, సాయిజ్యోతి, వీఆర్వో వెంకటరత్నం, పోలీసు సిబ్బందిని వెంట పంపించి సురక్షితంగా కూలీలను రైలు ఎక్కించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి.. పనులు చేయించేందుకు కార్మిక శాఖ అనుమతులు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సదరు బట్టీ యజమాని వద్ద ఎలాంటి అనుమతులు లేవన్నారు. దీంతో యజమానిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.


ఒడిశా కూలీలను తెనాలి రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చిన కార్మిక శాఖ అధికారులు

ముగిసిన మహిళా ఖో-ఖో పోటీలు

● విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల
● రన్నర్ విక్టరీ డిగ్రీ కళాశాల జట్టు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల వేదికగా జరుగుతున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా ఖో-ఖో పోటీలు శనివారం ముగిశాయి. టోర్నమెంట్ విజేతగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు, రన్నర్‌గా విక్టరీ కళాశాల జట్టు నిలిచింది. తృతీయ స్థానంలో బాపట్ల ఉమెన్ డిగ్రీ కాలేజీ, నాలుగవ స్థానంలో గుంటూరు ఉమెన్ డిగ్రీ కళాశాల జట్లు నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విచ్చేసి క్రీడాకారులను అభినందించారు. ఇలాంటి టోర్నమెంట్ల వల్ల విద్యార్థుల మధ్య సామరస్యం, స్నేహ సంబంధాలు బలపడ తాయని అభిప్రాయపడ్డారు. క్రీడాకారులకు పోటీ పరీక్షల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఖో-ఖో అసోసియేషన్ సలహాదారుడు డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని సదుపాయాలు ఘనంగా ఏర్పాటు చేసిన వాగ్దేవి డిగ్రీ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ జిల్లా కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాదు, ఏపీఐఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ప్రశాంతి, ప్రిన్సిపాల్ కె.రాజేంద్రప్రసాద్, చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్ ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, డాక్టర్ పి.రాజా మెర్సిన్‌బాబు, పీడీ ఎన్ కృష్ణంరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతగా జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

అమరావతితోపాటే నాలుగు గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) రెండవ దఫా భూ సమీకరణ జరుగుతున్న 4 గ్రామాల్లో రైతులు త్వరితగతిన భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తే రాజధాని అమరావతితో పాటు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం నరుకుళ్లపాడు గ్రామంలో భూసమీకరణ జరుగుతున్న నాలుగు గ్రామాల నాయకులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పూలింగ్ పక్రియ అనుకున్న విధంగా ముందుకు సాగడం లేదన్నారు. రైతులకు న్యాయం చేసే విషయంలో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు తమ అపోహలను పక్కన పెట్టి పూలింగ్‌కు సహకరిస్తే ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసి అభివృద్ధి కార్యక్రమాలకు, ప్లాట్‌ల కేటాయింపునకు సంసిద్ధమవుతుందన్నారు. నాయకులు కూడా గ్రామాల్లో రైతులతో మాట్లాడి వారి అనుమానాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులకు పరిహారం ఇచ్చే దానిలో రాజధానిలో మాదిరిగానే చేయడం జరుగుతుందని, కౌలు పెంపు విషయంలో తన వంతు కృషి చేస్తానన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

డ్రైయిన్లలో వ్యర్థాలు పడకుండా పనులు చేపట్టాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లమీద, డ్రెయిన్లలో వ్యర్థాలు పడకుండా సమగ్ర పారిశుధ్య పనులు చేపట్టాలని, అలా వేసేవారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ కె.మయూర్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శనివారం ప్రజారోగ్య విభాగ సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ మైక్రో ప్యాకెట్స్ వారీగా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, తడిపొడిగా ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. సమావేశంలో సిఎంఒహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఈఈ విష్ణు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కే మయూర్ అశోక్

ఔషధ నియంత్రణ శాఖలో అవినీతిని అరికట్టాలి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ శాఖలో పెరుగుతున్న అవినీతిని అరికట్టాలని సీపీఐ జిల్లా జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఫార్మా, మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ట్రేడ్ సంఘాలు, ఫార్మా, మెడికల్ దోపిడితో దేశ ప్రజారోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో కూడా మందుల నాణ్యత తనిఖీలు సక్రమంగా జరగకపోవడం బాధాకరమన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో, డ్రగ్స్ కంట్రోలర్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసనల్లో కోట మాల్యాద్రి, అరుణ్‌కుమార్, మేడా హనుమంతురావు, పుప్పాల సత్యనారాయణ, రావుల అంజిబాబు, ముప్పాళ్ల శంకరరావు, ఈశ్వరరావు, రెంటాల కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని విజయవంతం చేయాలి : బోనబోయిన



కార్యకర్తకు జనసేన సభ్యత్వాన్ని అందజేస్తున్న బోనబోయిన శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ అన్నారు. స్థానిక 20వ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు కొలసాని బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోనబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమ ఆత్మతో ముందుకు సాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే నెల 10వ తేదీ వరకు కొనసాగనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇదే ఉత్సాహంతో అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం పలువురికి సభ్యత్వ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ ఉపాధ్యక్షుడు కోటంశెట్టి బాలు, జనసేన పార్టీ మీడియా కోఆర్డినేటర్ ఉదయ్ కుమార్, ఉదయ్ చంద్ర, రాయలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలకు మోక్షం ఎప్పుడు?

● ఏపీజీఈఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంపై ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో శనివారం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన చర్యలు కనిపించడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయలేదని, మధ్యంతర ఉపశమనం (ఐఆర్) ప్రకటించలేదని, తదితర డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రైతుల పరిస్థితులు అధ్యయనం చేసి శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గా ప్రసాద్ అన్నారు. శనివారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ ఆఖరి సంవత్సరం విద్యార్థినులకు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంపై ఓరియంటేషన్ నిర్వహించారు. రబీ 2025–26కి గాను బాపట్ల, సి.ఎస్ పురం, మర్కాపురం కళాశాలల నుంచి 53 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరు గుంటూరు జిల్లాలోని 9 మండలాల్లో 100 రోజులు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ జాతీయ సభలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 3, 4 తేదీలలో జరిగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జాతీయ ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జాతీయ నాయకుడు యూ గనిరాజు పిలుపునిచ్చారు. స్థానిక అరండల్‌పేట, మాదాల నారాయణ స్వామి భవన్లో శనివారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యా వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేఖ విధానాలపై ఈ మహాసభలలో చర్చించి, భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాల, కే.ఆనంద్, త్రినాధ్, గంగారావు, జ్ఞాన ప్రదీప్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు స్ఫూర్తిదాయకం

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్‌లో సుదీర్ఘ కాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన సుబ్బారావు సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రశంగించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అధ్యక్షత వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఎటువంటి విమర్శలు లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని అన్నారు. జడ్పీ కార్యాలయంలో సుబ్బారావుకు ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శాలువాతో సన్మానించి స్మృతి చిహ్నం అందజేశారు. డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ పి. శామ్యూల్ పాల్, నిర్మల భారతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్తు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, చౌత్ర కూడలిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు పాఠశాలలో జరుగుతున్న ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు ఉర్దూ మీడియంవిద్యార్థులు ప్రథమ భాష, ద్వితీయ భాష విషయంలో పరీక్షలు వ్రాసే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఉర్దూ భాషకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఉర్దూ విద్యార్థులు కూడా 10వ తరగతిలో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు



సీఎం చంద్రబాబు గురించి చెబుతున్న వృద్ధురాలి మాటలను వీడియో తీస్తున్న ఎమ్మెల్యే నసీర్



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

పెద్ద కొడుకులా ఆదుకుంటున్న సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్యే నసీర్‌తో సంతోషం వ్యక్తం చేసిన పింఛనుదారులు

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'ప్రతి నెలా కుటుంబ అవసరాలకుగానీ, నిత్యం మందులకుగానీ ఎలాంటి ఢోకా లేదు. మా పెద్దకొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటి వద్దకే పంపుతున్నారయ్యా' అని పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. పాత గుంటూరులోని రెడ్ల బజారులో పింఛన్ లబ్ధిదారులకు కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి శనివారం ఎమ్మెల్యే నసీర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షం కూడా లేని వైసీపీ ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీలో కనీసం సమస్యల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు.

అర్హులందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తాం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గం 18వ డివిజన్ అడపా బజార్‌లో శనివారం ఆమె లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పింఛనును రూ. 4వేలకు పెంచడమేకాకుండా ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 21 వేల మంది పింఛనుదారులకు పింఛను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, ఉల్లి గోపాల్, కొల్లి అనిల్, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లను పంపిణీ చేసిన కలెక్టర్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంకమ్మనగర్‌లో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, మున్సిపల్, డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పెన్షన్‌లను పంపిణీ చేస్తున్న దాసరి రాజా మాస్టారు

● స్థానిక నెహ్రూనగర్‌లో రాష్ట్ర గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు, 162 సచివాలయ అడ్మిన్ నాగూర్‌తో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ చేశారు. దాసరి రాజా మాస్టారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికపరిస్థితి ఇబ్బంది కరంగా ఉన్నప్పటికి కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్ 6 హామీలను నెరవేరుస్తున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

శాస్త్రీయ విజ్ఞానంతోనే వికసిత్ భారత్ సాధ్యం

● డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్ బాషా



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో షేక్ సలీమ్ బాషా

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే వైజ్ఞానిక, శాస్త్రీయ దృక్పథం పెరిగినప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్‌లోని పరీక్షా భవన్‌లో ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు హవీలా, రిసోర్స్ పర్సన్‌లు అప్పారావు, శివ శంకరరావు, వెంకటేశ్వరరావు, బాస్కరరావు, శాంతి ప్రియ, వసుంధర, జాకిర్ హుస్సేన్ మరియు గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విజ్ఞాన శాస్త్రానిదే కీలక భూమిక

● ఇస్రో శాస్త్రవేత్త కేఎంవీ ప్రసాద్



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న కెఎంవీ ప్రసాద్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధికి విజ్ఞానం ప్రధాన ఆధారమని, విద్యార్థులు సాంకేతికతను సృజనాత్మకంగా వినియోగిస్తూ పరిశోధనలపై దృష్టి సారించాలని ఇస్రో శాస్త్రవేత్త కేఎంవీ ప్రసాద్ సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు శాస్త్రరంగంలో ముందంజలో నిలవాలని పిలుపునిచ్చారు. 'ఉమెన్ ఇన్ సైన్స్ కాటలైజింగ్ వికసిత్ భారత్' అనే ఇతివృత్తానికి అనుగుణంగా యువతులు పరిశోధన, ఆవిష్కరణల వైపు మరింతగా ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక సంస్థలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలు సందర్శించారు.

శాస్త్రవేత్తల కృషితోనే సమాజంలో మెరుగైన జీవనం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల కృషి ఫలితంగా మానవ జీవితం ఎంతో సుఖవంతమైందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైస్కూల్ విద్యార్థులకు సైన్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.జాన్‌బాబు, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య పాఠశాల, స్తంభాలగరువు, రామిశెట్టి రామారావు పాఠశాల, గుజ్జనగుళ్ళ, జలగం రామారావు పాఠశాల, కొత్తపేట ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం సెంట్రల్ పబ్లిక్ స్కూల్, మల్లారెడ్డి నగర్, సెయింట్ లారెల్స్ స్కూల్, ఆర్టీసీ కాలనీ , ఎంవీఎస్ కోటేశ్వరరావు స్కూల్ మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి.

శ్రీ చైతన్యలో సైన్స్ ఎగ్జిబిషన్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవ భారత్ శ్రీ చైతన్య వైట్ హౌస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం జరిగింది. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.నర్మద మాట్లాడుతూ బాల, బాలికల్లోని మేధోశక్తిని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ముఖ్యంగా 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులు తయారు చేసిన డ్రోన్లు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టులు, మానవ దేహం పని చేసే విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రాజెక్టులు ఈ ఏడాది సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయని అన్నారు.

శాస్త్రవేత్తలను అందించిన బాలనంద కేంద్రం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బాలానంద కేంద్రం ద్వారా వేలాది మంది బాలబాలికలు విద్యాభ్యాసం చేయటమే కాకుండా కొద్దిమంది శాస్త్రవేత్తలుగా ఎదిగి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేశారని బాలానంద కేంద్రం, ఆద్య పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ నడింపల్లి వెంకట గురుదత్ అన్నారు. బ్రాడీపేట బాలానంద కేంద్రం ఆద్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కేతరాజు సుభాష్, బి శ్రీనివాస్, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, ప్రిన్సిపాల్ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ వాహనంపై శ్రీవారి నగరోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మూడోరోజు శనివారం స్వామిని ఉదయం హనుమత్ వాహనంపై, సాయంత్రం గరుడ వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. ఆధ్యాత్మిక సభా కార్యక్రమాలలో మధుర వాక్ శిఖామణి ధనకుదరం సీతా రామానుజాచార్య స్వామి, ప్రణవాశ్రమం కాకినాడ సుమిత్రానంద సరస్వతీ మాతాజీ పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య తొలిపలుకులతో ఈదర రత్నారావు రచించిన పంచ భూతాత్మక శైవ క్షేత్రాలు పుస్తకం బొల్లేపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో అతిథులు ఆవిష్కరించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాదల రత్నగిరిబాబు, కొత్త సుబ్రహ్మణ్యం, సభాధ్యక్షులు నోరి నారాయణ మూర్తి, బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు

పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరు, శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజుల పాటు జరిగే ఉచిత పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గాయకులు డాక్టర్ ఫణికుమార్ బృందం తమ గాత్రధారణలో అలనాటి మేటి చిత్రాలలోనే మధుర గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం శ్రీ గణపతి మహాత్యం నాటకం ప్రదర్శించారు. కార్యక్రమాల్ని సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

స్థానిక మారుతి నగర్, శ్రీ మారుతీ దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. శనివారం శ్రీ సిద్ధి, బుద్ధి సమేత శ్రీ గణపతి స్వామి వారి కల్యాణ మహోత్స వం కనులపండుగా నిర్వహించారు. సాయంత్రం, వెల్లటూరు వారిచే చిన్నారుల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్ని ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

50 లక్షల ఖరీదైన 247 సెల్‌ఫోన్‌ల రికవరీ

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలు, సందర్భాల్లో బాధితులు పోగొట్టుకున్న 247 సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేశారు. ఐటీ కోర్ విభాగం పోలీసులు రికవరీ చేసిన ఆయా సెల్‌ఫోన్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. ఇప్పటి వరకు సుమారు 8 కోట్ల 14 లక్షల విలువైన 4,074 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్ లేదా జాతీయ సైబర్ క్రైం సహాయ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

పదవీ విరమణ చేసిన పోలీసులకు సత్కారం

పదవీ విరమణ చేసిన ఆర్ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, ఏఎస్ఐ షేక్ మొహమ్మద్ సలాహుద్దీన్‌లను పోలీసు అదనపు సూపరింటెండెంట్ ఆర్మ్‌డ్ హనుమంతు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఏఆర్ సంకురయ్య, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఆర్ఎస్ఐ కేవీ శివరామకృష్ణ, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఏ.సాంబశివరావు, ప్రధానకార్యదర్శి ఎం.లక్ష్మయ్య ఈసీ మెంబర్ కరిముల్లా, ఎస్పీ పీఆర్‌వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతిని బెదిరిస్తున్న మాజీ ప్రియుడిపై కేసు

యువతిని బెదిరిస్తున్న మాజీ ప్రియుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో కొరిటెపాడుకు చెందిన ఒక యువతికి కళాశాలలో చదువుకునే సమయంలో ప్రకాశం జిల్లాకు చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ సన్నిహి తంగా ఉన్న సమయంలో యువకుడు వీడియోలు తీసుకున్నాడు. అప్పట్లో వారి మధ్య గొడవలు జరిగి విడిపోయి యువతి వేరే వ్యక్తిని పెళ్లి చేసు కుంది. మాజీ ప్రియుడు ఇప్పుడు ఆ వీడియోలు యువతి భర్త, తండ్రికి పంపి బెదిరిస్తున్నాడు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో వైజ్ఞానిక జిజ్ఞాస పెంపొందించాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా రాణించేలా ప్రోత్సహించాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. స్థానిక పాత గుంటూరు కన్నా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ, సంస్కృతిని తెలియజేసే మూడు వందలకు పైగా ఎగ్జిబిట్స్ విద్యార్థుల ప్రతిభను చాటేలా ఉన్నాయని తెలిపారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కన్నా మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసేందుకు రెండున్నర దశాబ్దాలుగా ఓవరాల్ టాలెంట్ ఎగ్జిబిషన్లో విద్యార్థుల చేత రూపొందించి ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తనుజ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నామని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.5.50 కోట్లతో స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. శ్రీనగర్‌లో రూ.10.4లక్షలతో మంచినీటి పైపు లైను, రూ.24లక్షలతో సీసీ రోడ్డు, వాసవి నగర్ లో రూ.1.99 కోట్లతో సీసీ డ్రెయిన్, బాలాజీ నగర్ లో రూ.1.90 కోట్లతో సీసీ డ్రెయిన్, అయ్యప్పనగర్ 1వ లైనులో రూ.39 లక్షలతో సీసీ డ్రెయిన్, రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో తూర్పు నియోజకవర్గాన్ని వైసీపీ నాయకులు పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా ధ్వంసం చేశారన్నారు.

బంగారు కుటుంబాలను ఆదుకోవడమే ధ్యేయం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడి



ప్రసంగిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనుక బడిన బంగారు కుటుంబాలను ఆర్థిక, వైద్య, విద్యా పరంగా ముందుకు తేవాలనే సీఎం చంద్రబాబు అద్భుత ఆలోచనకు ప్రతిరూపమే పీ4 పథకమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్ ఆర్ అగ్రహారంలోని బాలాజీ హాస్పిటల్‌లో పీ4 కార్యక్రమంలో భాగంగా మానవతా స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఇప్పటి వరకు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 19 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, ఇందులో 11 వేల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మార్గదర్శకుల ద్వారా దత్తత తీసుకొని సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పన, మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కులు కాదు, ఆత్మ విశ్వాసం ముఖ్యం

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఎస్.కే.బి.యం స్కూల్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు శనివారం ప్రత్యేక మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే మార్చి 16న ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గళ్ళా రామచంద్రరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా, డిప్యూటీ డీఈఓ యేసు రత్నం, మండల విద్యాశాఖ అధికారులు ఖుద్దుస్, నాగేంద్రం, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.

సహకార ఉద్యోగుల సమస్యలపై స్పందన అభినందనీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్, సహకార శాఖ ఉన్నతాధికారులకు ఉద్యోగుల తరపున ఏపీ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో వ్యవసాయ మంత్రిని శనివారం ఆయన కలసి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులకు 20శాతం మధ్యంతర భృతి మంజూరు, గ్రాట్యూటీ పరిమితిని రూ.4లక్షలకు పెంచటం, ఉద్యోగుల బీమాను రూ.5 లక్షలు కల్పించటం హర్షణీయమన్నారు.

3, 4 తేదీల్లో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో మహాధర్నాలు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-2 డిపో గ్యారేజ్ పరిరక్షణ లో భాగంగా జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 3,4 వ తేదీల్లో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని డిపో గ్యారేజ్ ఎదుట మహాధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్, కన్వీనర్‌లు పి అమర్‌నాథ్, ఎస్‌టీ దత్తు తెలిపారు. గుంటూరు-2 డిపో గ్యారేజ్ పరిరక్షణ కోసం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో జరుగుతోన్న రిలే నిరాహార దీక్షల్లో వారు మాట్లాడారు. పరిరక్షణలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పేరుతో కోట్లాది రూపాయల విలువైన ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు యాజమాన్యాలకు దారాదత్తం చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎమ్ఎస్ రెడ్డి, విజయ్‌కుమార్, రవిశంకర్ తదితరులున్నారు.

అక్రమ మద్యం కేసులపై సుప్రీం క్లీన్‌చిట్ హర్షణీయం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) ఢిల్లీ మద్యం కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ క్రేజీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా, ఎమ్మెల్సీ కవితలపై పెట్టిన కేసులు చెల్లవంటూ సుప్రీమ్ కోర్టు వారికి క్లీన్‌చిట్ ఇవ్వడం హర్షణీయమని రాష్ట్ర జనతాదల్ ప్రధాన కార్యదర్శి నల్లపనేని సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవింద్ క్రేజీవాల్ అభ్యుదయవాది అని, పేదల సంక్షేమం కోసం పాటుపడ్డారని ఇటువంటి నాయకుడిపై బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం శోచనీయమన్నారు. రాష్ట్ర ఎన్నికలు నిర్వహించి బీజేపీ తన నిర్ధోషిత్వాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్య ప్రతి చిన్నారికి రాజ్యాంగ బద్ధ హక్కు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్య అనేది ప్రతి చిన్నారికి రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, విద్యాహక్కు చట్టం -2009ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పవనిజం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొణిదెల మోహన్ గోపికృష్ణ ఆధ్వర్యంలో విద్యా హక్కు చట్టం -2009 సెక్షన్ 12(1) (ఇ)పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం–2009 లోని సెక్షన్ 12(1)(ఇ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాల్సి ఉంటుందన్నారు. కొణిదె మోహన్ గోపికృష్ణ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టంపై అందరికి అవగాహన కల్పించేందుకు మరింత విస్తృత ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్లు సత్యం సింగ్, దాసరి జాన్‌బాబు, నాయకులు అత్తోట జోసఫ్, మండ వాసు తదితరులున్నారు.



మన ఆరోగ్యం బాధ్యత

- ● వినూత్నంగా స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని పథకం
- ● సరికొత్త ఆలోచనతో కలెక్టర్ కృతికా శుక్లా రూపకల్పన
- ● ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా జిల్లాలో ప్రతి నెలా అమలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మన ఆరోగ్యం.. మన బాధ్యత.. అంటూ ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా వినూత్న పథకానికి కలెక్టర్ కృతికా శుక్లా రూపకల్పన చేశారు. సరికొత్తగా ఆలోచన చేసిన కలెక్టర్ ఈ పథకాన్ని గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారు. గత నెలలో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ నెల మొదటి గురువారం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. ఫిబ్రవరిలో కార్యక్రమాన్ని ప్రారంభించగా మార్చి నెలకు సంబంధించి రెండో విడతగా 5న ఆరోగ్యదర్శిని నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలిస్తున్నారు. ఏదో ఒక చోట కలెక్టర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్), పోషణ్ అభి యాన్, రక్తహీనత ముక్త్ భారత్, గ్రామ ఆరోగ్యం, పారిశుధ్యం.. పోషకాహార దినోత్సవాలు, పాఠ శాల ఆరోగ్యం, క్యాన్సర్, డయా బెటిస్, కార్డియోవాస్కులర్ వ్యా ధులు, స్ట్రోక్ నివారణ.. నియం త్రణ తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే గ్రామస్థాయిలో తగినంత అనుసరణ లేకపోవడం వల్ల ఆయా కార్యక్రమాల ఫలితాలు అసమానంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని పథకానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. గ్రామస్థాయిలో క్రమబద్ధమైన.. నిర్మాణాత్మకమైన భాగస్వామ్య వేదికను సంస్థాగతీ కరించడం ద్వారా ఈ అం తరాలను పరిష్కరించడానికి గ్రామ ఆరోగ్య దర్శని దోహదపడేలా రూపకల్పన చేశారు. కమ్యూనిటీ సభ్యులు, ఫ్రంట్‌లైన్ కార్మికులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామదర్శిని కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. గ్రామీణుల ఆరోగ్యం, పోషకాహార సవాళ్లను, దుర్బల గృహాలను గుర్తించి సమష్టిగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటారు,

లక్ష్యాలు..

- ◆ పోషకాహారం, తల్లి-శిశువు ఆరోగ్యం
- ◆ పిల్లలు, కౌమారదశ, మహిళల్లో ఎదుగుదల లోపం, బరువు తగ్గడం, తక్కువ బరువు, రక్తహీనత స్థాయిలను తగ్గించడం.
- ◆ ఇంటికి రేషన్ తీసుకెళ్లడం.
- ◆ అంగన్వాడీల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడం.
- ◆ బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణను నిరోధించడం.
- ◆ సురక్షితమైన మాతృత్వ పద్ధతులను ప్రోత్సహించడం. జీవనశైలి, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ.
- ◆ మధుమేహం, రక్తపోటు, ఊబకాయం కోసం కమ్యూనిటీ ఆధారిత స్క్రీనింగ్.
- ◆ అధిక ప్రమాదం ఉన్న వ్యక్తులను గుర్తించడం, రిఫెరల్, చికిత్స.
- ◆ సమతుల్య ఆహారం, శారీరక శ్రమ, యోగ, ఒత్తిడి, పొగాకు, మద్యంపై అవగాహన.
- ◆ డెంగ్యూ, మలేరియా, విరేచనాలు, వైరల్ జ్వరాలు వంటి కాలానుగుణ అంటువ్యాధుల నివారణ.
- ◆ వ్యాధుల వ్యాప్తి సమయంలో సమాజ సంసిద్ధత, ప్రతిస్పందనను మెరుగుపరచడం.
- ◆ కిచెన్ గార్డెన్స్, మిల్లెట్ వినియోగాలపై ప్రోత్సాహం.
- ◆ ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల పోషకాహారం, ఆరోగ్య సమస్యలను గుర్తించడం.

స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కమిటీ

ప్రతి గ్రామ పంచాయతీకి స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఒక తీర్మానాన్ని ఆమోదిస్తుంది. కమిటీ కన్వీనర్లుగా పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సంక్షేమ, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, సభ్యులుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు.

స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని లోగో

అందరూ భాగస్వామ్యం కావాలి

ప్రతీ నెల మొదటి గురువారం ప్రతీ గ్రామంలో నిర్వహించే స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శని కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి. ప్రజలు ఆరోగ్య సమస్యలను తెలియజేయాలి. డాక్టర్, సిబ్బంది చెప్పే సలహాలను పాటించాలి. ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలి. ఆర్యోగంతోనే అభివృద్ధి సాధించవచ్చు. పుట్టిన ప్రతి బిడ్డను అంగన్‌వాడీల్లో నమోదు చే యాలి. గ్రామీణులు 104 వాహనాల వద్ద పరీక్షలు చేయించుకుని ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కలిగి ఉండాలి. ఈ కార్యక్రమాన్ని పల్లెవాసులు సద్వినియోగం చేసుకోవాలి.

-కృతికా శుక్లా, కలెక్టర్



ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న బాలికలు

స్ఫూర్తి నింపిన మెడ్‌ఫ్యూజన్

● విజయవంతంగా ముగిసిన మెడ్‌ఫెస్ట్ ● ప్రదర్శన తిలకించిన 85 వేల మంది సందర్శకులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో నిర్వహి స్తున్న మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్‌ఫ్యూజన్ 2026 శనివారంతో ముగిసింది. మూడు దశాబ్దాల త ర్వాత జీఎంసీలో ఏర్పాటు చేసిన ఈ వైద్య విజ్ఞాన ప్రదర్శనకు విద్యార్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఫిబ్రవరి నాలుగో తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనం తరం ఐదో తేదీ నుంచి సందర్శకులను అనుమతించారు. 24 రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనకు జిల్లాతో పాటు విజయవాడ తదితర నగరాల నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 85,669 మంది సందర్శకులు మెడ్‌ఫ్యూజన్‌ను తిలకించి నట్లు జీఎంసీ అధికార వర్గాలు వెల్లడించాయి. 32 వైద్య విభాగాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సాధారణ ఆరోగ్య సంరక్షణతో పాటు పలు రకాల వ్యాధులు, వాటి లక్షణాలు, చికిత్సలు, నివారణ వంటి అంశాలను స్టాల్స్‌లో పొందుపర్చారు. వైద్య విద్యార్థులు ఆ యా విశేషాలను సందర్శకులకు చక్కగా వివరిం చారు. కొన్ని పాఠశాలల నుంచి ఒకటో తరగతి చదివే చిన్నారులు కూడా ఈ ఎగ్జిబిషన్ తిలకిం చడం విశేషం. ఆసియా ఖండంలోనే అతి పెద్దదై న 3,850 స్పెసిమన్లతో ఉన్న పెథాలజీ మ్యూ జియం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైద్య రంగం పట్ల ఆసక్తి కలిగించి, భవిష్యత్తులో విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించేలా స్ఫూర్తి కలిగించేందుకు ఏర్పాటు చేసిన ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఉద్దేశం నెరవేరినట్లే కనిపిస్తోంది. ఈ వైద్య విజ్ఞాన ప్రదర్శన తమకు ఎంతగానో నచ్చిందని పలువురు బాల, బాలికలు తెలిపారు. ప్రదర్శన విజయవంతంగా ముగియడంతో శనివారం సాయంత్రం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందచారారీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఇతర ప్రొఫెసర్లు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.

● శాశ్వత ప్రదర్శనకు యోచన

మెడికల్ ఎగ్జిబిషన్ నిర్వహణకు కాలేజీ డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి రూ.1.15 కోట్లు వెచ్చించారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసేందుకు పలు పరికరాలు, ఇతర ప్రదర్శన వస్తువులను కొను గోలు చేశారు. ఆయా వస్తువులు, పరికరాలను ఆయా వైద్య విభాగాలకు అప్పగించాలా, లేక కాలేజీలో చేరే మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం శాశ్వత ప్రాతిపదికన కాలేజీ ఆవరణలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలా అని జీఎంసీ వర్గాలు యోచిస్తున్నాయి. ఎగ్జిబిషన్ సందర్శనకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్న 62,642 మంది నుంచి రూ.66,88,500 నిధులు సమకూరాయి. నగరానికి చెందిన జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి రూ.2 లక్షలు, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ నుంచి రూ.2.50 లక్షలు, భాష్యం విద్యాసంస్థల నుంచి రూ.2.50 లక్షలు, కరణం రాజా రూ.1 లక్ష, నేషనల్ సైంటిఫిక్ ప్రొడక్ట్స్ సంస్థ రూ.2 లక్షలు, కిమ్స్ శిఖర హాస్పిటల్స్, గుం టూరు రూ.90 వేలు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వై.లక్ష్మణ స్వామి రూ. 50 వేలు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చింతా రామకృష్ణ రూ.50 వేలు విరాళం అందజేశారు. మరికొందరు వైద్యులు కూడా వ్య క్తిగతంగా విరాళాలు అందజేశారు. ఎగ్జిబిషన్‌లో ప్రైవేటు స్టాల్స్ ద్వారా మరో రూ.6 లక్షలు వసూ లయ్యాయి. ఇప్పటి వరకు ఎగ్జిబిషన్ ద్వారా మెడికల్ కాలేజీకి రూ.85 లక్షల నిధులు అం దాయి. మరికొన్ని సంస్థలు కూడా ఈ మెడికల్ ఎగ్జిబిషన్ నిర్వహణకు విరాళం అందిస్తామని గతంలో హామీ ఇచ్చాయి. ఆ నిధులు కూడా త్వరలో అందుతాయని జీఎంసీ వర్గాలు ఆశిస్తున్నాయి.



ప్రదర్శనను తిలకిస్తున్న బాలికలు

మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కృషి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ● నంబూరులో ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ

పెదకాకాని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మా సంలో ముస్లిం సోదరులకు ఉపయోగపడేలా ఒక మంచి కమ్యూనిటీ హాల్ నిర్మించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాన న్నారు. సీఎం చంద్ర బాబు నాయుడి పిలుపుతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు ముందు కొచ్చిన దాతలు రాఘవేంద్ర ప్రసాద్, కల్యాణి ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. దీంతో పాటు మరో 9 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ. 4 కోట్ల విరాళాన్ని అందించిన రాఘవేంద్ర ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే 8 భవనాలకు శంకు స్థాపనలు జరిగి, పనులు సగానికి పైగా పూర్తయ్యాయని, తాడికొండ నియోజకవర్గంలోని రావెల, పెదపరిమి గ్రామాల్లో నిర్మాణం తలపెట్టిన 2 కమ్యూనిటీ హాళ్లను సోమవారం ప్రారంభించ బోతున్నామని తెలిపారు. అదే విధంగా నంబూరు గ్రామంలో టీడీపీ హయాం లోని రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు.



ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

● ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి

కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన అనంతరం ముస్లింల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయబాబు, పెదకాకాని మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, గుంటూరు చానెల్ డీసీ చైర్మన్ దుద్దుకూరి భూషి బాబు, ఎంపీపీ దొడ్డక శిరీషా, హై లెవల్ కెనాల్ డీసీ చైర్మన్ జొన్నల మురళీకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాకిరెడ్డి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

● కమీషన్, ఎగుమతి వ్యాపారులతో యార్డు చైర్మన్ అప్పారావు



మిర్చియార్డులో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్థులతో సమావేశమైన చైర్మన్ కుర్రా అప్పారావు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి వస్తున్న మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు కమీషన్, ఎగుమతి వ్యాపారులను కోరారు. శనివారం ఆయన మిర్చియార్డులోని తన కార్యాలయంలో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ, మిర్చి సీజన్ ప్రారంభమైనందున రైతులు తీసుకొచ్చే మిరపకాయల టిక్కీలను ఏ రోజుకారోజు అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. రైతు అభీష్టం మేరకే బిడ్డింగ్ వేయాలని ఆదేశించారు. ఉదయం ఒక రేటు, బిడ్డింగ్ సమయంలో మరో రేటు వేయొద్దన్నారు. అలానే మిర్చియార్డులో అవినీతికి ఆస్కారం లేకుండా వ్యాపారస్థులు సహకరించాలన్నారు. రైతులకు మేలు చేసేందుకు వ్యాపారస్థులకు ఏమేమి సదుపాయాలు కావాలో చెబితే వాటన్నింటిని ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ల నాయకులు తోట రామకృష్ణ, వెలగపూడి సాంబశివరావు, కొత్తూరి సుధాకర్, నరేంద్ర, కర్లపూడి వెంకటేశ్వరరావు, జుగిరాజ్ భండారి పాల్గొన్నారు.

జ్యూడీషియల్ అకాడమీకి.. నేడు శంకుస్థాపన

(5వ పేజీ తరువాయి)

పాటు జీ+3 తరహాలో భవనాలు నిర్మించనుండగా, హాస్టల్ బ్లాక్ జీ+8 తరహాలో నిర్మితమౌతుంది. ఇండోర్ స్పోర్ట్స్, అతిథుల సౌకర్యార్థం నిర్మించే బ్లాక్ జీ+3 తరహాలో రూపుదిద్దుకుంటుంది. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల బిల్ట్ అప్ ఏరియాలో, బేస్‌తో కలుపుకుంటే మొత్తం బిల్ట్ అప్ ఏరియా 2.48 లక్షల చదరపు అడుగులుగా ఉంది. అకాడమీలో ఒకేసారి 120 మంది ట్రైనీ న్యాయమూర్తులకు శిక్షణ ఇవ్వగల సామర్థ్యంతో పాటు 60 మంది ఫ్యాకల్టీ, ఇతర సిబ్బందికి వసతులు కల్పించేలా రూపొందించారు. ప్రాంగణంలో 31 శాతం భూమి భవనాల కోసం వినియోగించనుండగా, 69 శాతం విస్తీర్ణం పచ్చదనానికి కేటాయించబడింది.

ఇండోర్ స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ బ్లాక్

ఇండోర్ స్పోర్ట్స్, రిక్రియేషన్ బ్లాక్‌లో 108 సీట్ల డైనింగ్ హాల్, 10 సీట్ల వీవీఐపీ డైనింగ్ హాల్, పూర్తి సదుపాయాలతో కూడిన కిచెన్, స్క్వాష్ కోర్ట్, జిమ్, ధ్యానం, యోగా కోసం ప్రత్యేక హాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్ట్, మల్టీపర్పస్ హాల్ నిర్మిస్తారు. స్విమ్మింగ్ పూల్, ల్యాన్ డెక్, డ్రైవర్‌లకు డార్మిటరీ, సిబ్బందికి వసతి గృహాలు నిర్మించేలా డిజైన్ చేశారు.

బంగ్లాల పరిశీలన..

రాజధానిలో హైకోర్టు జడ్జి బంగ్లాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఏపీ జ్యూడీషియల్ అకాడమీ గవర్నర్ల బోర్డు సభ్యులు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరినాథ్‌శర్మ, రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్బీజీ పార్థసారథి, రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) శ్రీనివాసశర్మ, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి [illegible], రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఏడీసీఎల్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

పవన్ ఇంటి భద్రతను టెస్ట్ చేసేందుకే దాడి..

● పోలీసు విచారణలో ఆగంతకుడి సమాధానం? ● పేస్‌బుక్ నిండా ఉప ముఖ్యమంత్రి పోస్టులు

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటి పక్కనే ఉన్న జనసేన కార్యాలయం పార్కింగ్ వద్ద దాడి చేసిన అగంత కుడు మానసిక రోగిగా పోలీసులు గుర్తిం చారు. శుక్రవారం రాత్రి మంగళగిరిలోని డిప్యూటీ సీఎం కార్యాలయంపై ఆగంతుకుడు దాడికి యత్నించి రెండు కార్ల అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. డిప్యూటీ సీఎం ఇంటి పక్కనే ఉన్న వాహనాలపై దాడి.. భద్రతా వైఫల్యంగా విమర్శలొచ్చాయి. అగంతకుడిని నిలువరించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది..అతనిని చూసి పరుగెత్తినట్లు ఉన్నతాధి కారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సీఎం సెక్యూరిటీ విభాగం అధికారి బి.పెంటారావుతో పాటు మరో నలుగురు కానిస్టేబుళ్లను వెనక్కి పంపారు. ఈ మొత్తం ఘటనపై పోలీసు అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ దాడికి పాల్పడిన ఆగంతకుడు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని కవిటి మండలం గొర్లపాడు పంచాయతీలోని కాజూరు గ్రామానికి చెందిన ఎన్.నీలాద్రిగా గుర్తించారు. ఇతనికి భార్యపిల్లలు ఉన్నారు. నీలాద్రి ల్యాప్‌టాప్, కంప్యూటర్లు రిపేర్ చేస్తుంటాడు. గతంలో కుటుంబంతో చెన్నైలో ఉన్నాడు. కొంతకాలంగా ఆయన మానసిక స్థితి సరిగా లేకపోవడంతో భార్యపిల్లలు పుట్టింటికి వెళ్లారు. ప్రస్తుతం నీలాద్రి ఒక్కడే చెన్నైలో ఉంటు న్నాడు. అప్పుడప్పుడూ విజయ వాడ వచ్చి వెళు తుంటాడు. రెండు రోజుల క్రితం విజయవాడ వచ్చిన నీలాద్రి అక్కడే లాడ్జిలో ఓ గది అద్దెకు తీసుకొని.. ఆటోలో జనసేన కార్యాలయం వద్దకు చేరుకున్నాడు. కార్యాలయం వద్ద పార్క్ చేసిన రెండు కార్ల అద్దాలను ధ్వంసం చేశాడు. అక్కడ విధుల్లో ఉన్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ప్రతిఘ టించి పట్టుకున్నాడు. అనంతరం మంగళగిరి టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడి జరుగుతున్న సమయంలో పక్కనే ఉన్న ఇంటిలో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలను ఆయన సీసీటీవీ ఫుటేజీలో క్షుణ్ణంగా పరిశీలించారు. దాడి జరుగుతున్న సమయంలో ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ విభాగం సిబ్బంది వ్యవహరించిన తీరు... ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ చొరవను పవన్ కల్యాణ్ పరిశీలించారు. కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా అభినందించి, ఆయనకు నగదు రివార్డు అందించారు.

అన్ని కోణాల్లో విచారణ

నిందితుడు నీలాద్రి దాడి వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తులో నీలాద్రికి మానసిక స్థితి లేదని గుర్తించారు. మూడేళ్లుగా అతని ఫేస్ బుక్ ఖాతాలో పవన్ కల్యాణ్‌కు సంబం ధించిన ఫొటోలు, వీడియోలు పోస్టు చేసి ఉన్నాయి. అతను పవన్ అభిమానిగా పోలీ సులు భావిస్తున్నారు. అతను ఒక్కో సారి ఒక్కో విధంగా ప్రవర్తిస్తున్నాడని, లాకప్ లోనూ తనలో తాను మాట్లాడుకుంటున్నాడని పోలీసులు అంటున్నారు. టేబుల్ పై డస్ట్ ఉంటే వెంటనే వెళ్లి శుభ్రం చేయడం.. ఉద యాన్నే లేచి శివుని మాదిరిగా పూజ చేయడం ఇలా ఒక్కోరకంగా వ్యవహరిస్తున్నాడని అంటున్నారు. ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందని ప్రశ్నిస్తే పవన్ కల్యాణ్‌కు భద్రత ఏ స్థాయిలో ఉందో పరిశీలించడానికి అలా చేయాల్సి వచ్చిందని చెప్పినట్లు తెలిసింది. దీంతో నిందితుడిని మరింత పూర్తిగా విచారించిన అనంతరం కోర్టులో హాజరు పరి చి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో ఆయనను మానసిక వైద్యశాలకు తరలించాలని పోలీసులు భావిస్తున్నారు.

విద్యుత్ డివిజన్ల పునర్విభజన

● గుంటూరు టౌన్ డివిజన్‌గా రూపాంతరం ● అమరావతి టౌన్ క్యాపిటల్‌గా పేరు మార్పు ● సీఆర్‌డీఏలోనే చిలకలూరిపేట డివిజన్

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొ రేషన్ సంస్థలో పునర్విభజన చేస్తూ ఆ సంస్థ సీఎండీ పి.పుల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పునర్విభజనలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు కీలక మార్పులు చేశారు. గతంలో గుంటూరు టౌన్-1 ఆపరేషన్ డివిజన్‌గా ఉండగా ఒకటిని తొలగిస్తూ గుంటూరు టౌన్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఇక సబ్ ఈఆర్‌వో టౌన్ 3 కార్యాలయాన్ని టౌన్-1 ఈఆర్‌వో కార్యాల యంలోకి విలీనం చేశారు. అలానే సబ్ ఈఆర్‌వో టౌన్-4 కార్యాలయాన్ని ఈఆర్‌వో టౌన్-2 కార్యాలయంలో విలీనం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తెనాలి రూరల్ సబ్ ఈఆర్‌వో కార్యాల యాన్ని తెనాలి ఈఆర్‌వో కార్యాలయంలోకి విలీనం చేశారు. అలానే పొన్నూరు సబ్ ఈఆర్‌వో కార్యాలయం గతంలో బాపట్ల సర్కిల్‌లో ఉండగా తాజాగా దాన్ని తెనాలి డివిజన్ ఈఆర్‌వో కార్యాలయ పరిధిలోకి తీసుకొచ్చారు.



నల్లచెరువులోని గుంటూరు టౌన్ డివిజన్ కార్యాలయం

● అమరావతి క్యాపిటల్ డివిజన్‌గా పేరు మార్పు

సీఆర్‌డీఏలో అమరావతి టౌన్ డివిజన్‌గా గతంలో ఏర్పాటు చేయగా తాజాగా అమరావతి క్యాపిటల్ డివిజన్‌గా పేరు మార్చారు. ఇక పల్నాడు జిల్లాలో ఉన్న చిలకలూరిపేట డివిజన్‌ను పల్నాడు సర్కిల్ పరిధిలోకి తీసుకొస్తారని అందరూ భావించినప్పటికీ దాన్ని సీఆర్‌డీ ఏ పరిధిలోనే కొనసాగించారు.

● 19 సెక్షన్‌లతో నరసరావుపేట డివిజన్ టాప్

ఇదిలా ఉంటే సీఆర్‌డీఏతో పాటు పలు డివిజన్‌లలో ఐదు నుంచి ఆరు సెక్షన్‌లతోనే డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయగా పల్నాడు సర్కిల్ నరసరావుపేట డివిజన్‌లో మాత్రం 19 సెక్షన్‌లు చేర్చటం విమర్శలకు తావిస్తోంది. పల్నాడు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని నరసరా వుపేట డివిజన్ మొత్తం 19 సెక్షన్ కార్యాలయాలతో సంస్థలోనే అత్యధిక సెక్షన్‌లున్న డివిజన్‌గా టాప్‌లో నిలిచింది. గతంలో 17 సెక్షన్ కార్యాలయాలతో టాప్‌లో ఉండగా అదనంగా మాచర్ల డి విజన్ నుంచి మరో రెండు సెక్షన్‌లను నరసరావుపేటలో చేర్చటం చర్చనీయాంశంగా మారింది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
హెలో బచ్చో	హిందీ సిరీస్	మార్చి 06
వార్ మెషీన్	హాలీవుడ్ మూవీ	మార్చి 06
బాయ్‌ఫ్రెండ్ ఆన్ డిమాండ్	కొరియన్ సిరీస్	మార్చి 06
అమెజాన్ ప్రైమ్		
సైరెన్స్ కిస్	ఒరిజినల్ సిరీస్	మార్చి 02
యంగ్ షెర్లాక్	వెబ్‌సిరీస్	మార్చి 04
సుబేదార్	హిందీ చిత్రం	మార్చి 05
జీ 5		
జబ్ ఖులీ కితాబ్	హిందీ చిత్రం	మార్చి 06
ఆహా		
ఓం శాంతి శాంతిః	తెలుగు చిత్రం	మార్చి 04





వీటిని తింటూ బరువు తగ్గొచ్చు

బరువు తగ్గాలంటే తీసుకునే ఆహారంపై నియంత్రణ తప్పని సరి. కానీ కొన్ని రకాల పదార్థాలను తింటూ కూడా స్లిమ్‌గా మారవచ్చంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- రాత్రంతా నానబెట్టి కొద్దిపాటి నూనెలో షాలోఫ్రై చేసిన శనగలు తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. వీటిలో ఉండే పీచులు, ప్రొటీన్లు ఆకలిని తగ్గిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా కాపాడతాయి. రోజూ సాయంత్రం పూట వీటిని తినడం వల్ల వేగంగా బరువు తగ్గవచ్చు.



- బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచులు అధికంగా ఉంటాయి. రోజూ మితంగా వీటిని తినడం వల్ల జీవక్రియల వేగం పెరుగుతుంది. ఆకలిగా ఉందనే భావన రాదు. దీంతో శరీర బరువు క్రమంగా నియంత్రణలోకి వస్తుంది.
- చిలగడ దుంపలను ఉడికించి కొద్దిగా నేతిలో వేయించి తింటే చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. వీటిలో అధికంగా పిండిపదార్థాలు, పీచులు, ఇతర పోషకాలు ఉంటాయి. ఇవన్నీ కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. స్నాక్స్ ఇతరత్రా ఆహారం తీసుకోవాలనే కోరికను తగ్గిస్తాయి. దీంతో త్వరగా బరువు తగ్గే వీలు ఏర్పడుతుంది.

దక్షిణాది వెండితెరపై రెండు దశాబ్దాలుగా వెలుగుతున్న త్రిష.. ఇప్పుడు తన సినిమాల కంటే వ్యక్తిగత వివాదాలతోనే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా మారారు. ముఖ్యంగా తమిళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న నటుడు, 'తమిళగ వెట్రి కళగం' అధినేత విజయ్‌తో ఆమెకు ఉన్న సాన్నిహిత్యంపై సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఈ క్రమంలో విజయ్ భార్య సంగీత విడాకుల కోసం కోర్టుకెక్కారన్న వార్త ఈ రూమర్లకు మరింత బలాన్ని ఇచ్చింది. ఈ పరిణామాల మధ్య తన కెరీర్, వ్యక్తిగత జీవితంపై త్రిష పలు విషయాలను పంచుకున్నారు.

స్టార్ స్టోరీ

మూడు తరాలు ఒకటే పేరు!



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్ అంటే ఐదారేళ్లు అని లెక్కలేసే రోజులు ఎప్పుడో పోయాయి. దానికి సజీవ సాక్ష్యం త్రిష కృష్ణన్. 2002లో ఒక చిన్న పాత్రతో మొదలై నేడు టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ అనే తేడా లేకుండా సౌత్ ఇండియా మొత్తాన్ని తనవైపు తిప్పుకుంది. అప్పట్లో ఆమె చేసిన 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా'లో అమాయకపు 'సిరి' పాత్ర అయినా, 'అతడు'లో చురుకైన 'పూరి' అయినా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి. "నేనెప్పుడూ నంబర్ వన్ స్థానం కోసం పాకులాడలేదు. నాకు నచ్చిన కథలు చేశాను. నన్ను నమ్మిన దర్శకులకు న్యాయం చేశాను. బహుశా ఆ నిజాయితీనే నన్ను ఇన్నేళ్లు మీ ముందు నిలబెట్టింది" అని చాలా వినమ్రంగా చెప్పింది.

మరణాన్ని త్రుటిలో తప్పించుకుని

సాధారణంగా హీరోయిన్లు రిస్కీ స్టంట్స్ చేయడానికి డూప్స్‌ను వాడుతుంటారు. కానీ త్రిష మాత్రం అందుకు భిన్నం. అజిత్ కుమార్ సరసన ఆమె నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'విడాముయర్చి'. ఈ సినిమా షూటింగ్ అజర్‌బైజాన్ దేశంలోని మంచు కొండల్లో జరుగుతున్నప్పుడు ఒక భయంకరమైన కారు ప్రమాదం జరిగింది. ఆ సమయంలో కారును అజిత్ డ్రైవ్ చేస్తున్నాడు. పక్కనే త్రిష ఉంది. కారు అదుపుతప్పి బోల్తా పడింది. "నిజం చెప్పాలంటే ఆ క్షణం నా కళ్ల ముందు నా జీవితం అంతా మెదిలింది. కానీ, అజిత్ సార్ మీద నమ్మకం ఉంది. ఆయన చాలా ప్రొఫెషనల్ డ్రైవర్. ఆ సీన్ ఒరిజినల్‌గా రావాలని డూప్ లేకుండా చేశాం. చిన్నపాటి గాయాలతో బయటపడటం మా అదృష్టం. సినిమా కోసం ప్రాణాలకు తెగించి పని చేయడంలో ఉండే కిక్కే వేరు" అని నాటి ఘటనను గుర్తు చేసుకుంది.

కెరీర్ సెకండ్ ఇన్నింగ్స్

ఒకానొక దశలో త్రిష కెరీర్ ముగిసిపోయిందని అనుకున్న తరుణంలో ఆమెకు 'పొన్నియన్ సెల్వన్' రూపంలో ఒక గొప్ప అవకాశం ఇచ్చారు లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం. అందులో 'కుందవై' పాత్రలో త్రిష చూపిన రాజసం, ఆ కళ్లలోని గాంభీర్యం చూసి యావత్ భారత్ ఫిదా అయింది. "మణిసార్ స్కూల్ నుంచి వస్తే మనలో తెలియని పరిణితి వస్తుంది. కుందవై పాత్ర నా జీవితాన్ని మార్చేసింది. ఆ సినిమా వల్లే కమల్‌హాసన్‌తో మళ్లీ 'థగ్‌లైఫ్' చేసే అవకాశం వచ్చింది" అని కృతజ్ఞతా భావాన్ని చాటుకుంది త్రిష.

లోకనాయకుడి పాఠాలు

"కమల్ సర్ నాకు ఒక ఎన్‌సైక్లోపీడియా. ఆయన సెట్స్‌లో ఉంటే చాలు మనం వెయ్యి విషయాలు నేర్చుకోవచ్చు. ప్రతిషాట్‌ను ఆయన విశ్లేషించే విధానం అద్భుతం. మణిరత్నం మేకింగ్, కమల్ నటన.. ఈ రెండింటి మధ్య పనిచేయడం నా పూర్వజన్మ సుకృతం" అని త్రిష చెప్పుకొచ్చింది.

మారుతున్న కాలం.. మారని పోటీ

ప్రస్తుతం ఇండస్ట్రీలోకి ఏటా వందలమంది కొత్త హీరోయిన్లు వస్తున్నారు. అయినా త్రిషకు ఉన్న క్రేజ్ తగ్గకపోవడానికి కారణం ఆమె ఎంచుకునే వైవిధ్యమైన పాత్రలే. మలయాళంలో మోహన్‌లాల్‌తో 'రామ్', తమిళంలో సూర్యతో 'కరుప్పు'... ఇలా ఆమె డైరీ అంతా బిజీ ప్రాజెక్టులతో నిండిపోయింది. "పోటీ అనేది ఎప్పుడూ ఉంటుంది. కానీ నేను నాతోనే పోటీ పడతాను. నిన్నటి కంటే ఈ రోజు మెరుగ్గా నటించాలనేది నా తపన. ఇప్పుడు నేను గ్లామర్ పాత్రల కోసం చూడటం లేదు. కథకు వెన్నెముకలా నిలిచే పాత్రలకే నా ప్రాధాన్యం" అని స్పష్టం చేసింది.

వ్యక్తిగత జీవితం... రూమర్స్

త్రిష పేరు వినగానే ఆమె పెళ్లి ఎప్పుడు? అనే ప్రశ్న సోషల్ మీడియాలో తరచూ వినిపిస్తుంది. దీనిపై ఆమె చాలా క్లారిటీగా ఉన్నారు. "నా జీవితంలో ఏది జరిగినా దానిని దాచాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం నేను నా పనిని ప్రేమిస్తున్నాను. కెరీర్‌లో అత్యంత బిజీగా ఉన్న సమయం ఇది. పెళ్లి అనేది సరైన సమయంలో, సరైన వ్యక్తితో జరుగుతుంది. అంతవరకు నా దృష్టి అంతా సినిమాలపైనే" అంటూ రూమర్లకు చెక్ పెట్టింది.

మెగాస్టార్‌తో మళ్లీ...

తెలుగులో దాదాపు 18 ఏళ్ల తర్వాత మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర'లో నటిస్తుండటం త్రిష కెరీర్‌లో ఒక హైలైట్. 'స్టాలిన్' తర్వాత మళ్లీ చిరు సరసన నటిస్తుండటంపై త్రిష ఆనందం వ్యక్తం చేసింది. "చిరు ఇప్పటికీ అదే ఎనర్జీతో ఉండటం చూస్తుంటే ముచ్చటేస్తుంది. సెట్‌లో ఆయన ఇచ్చే వైబ్స్, మర్యాద అద్భుతం. 'విశ్వంభర' ఒక విజువల్ వండర్. ఇందులో నా పాత్ర చాలా హుందాగా ఉంటుంది" అని సంతోషం వ్యక్తం చేసింది.

ఆకాశమే హద్దుగా...

వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని నిరూపిస్తూ 40వ పడిలో కూడా 20 ఏళ్ల అమ్మాయిలా మెరిసిపోతున్న త్రిష నిజంగా నేటి తరం నటీమణులకు ఒక రోల్ మోడల్. ఆమె కేవలం ఒక నటి మాత్రమే కాదు, పట్టుదల ఉంటే ఎంతకాలమైనా రాణించవచ్చని నిరూపించిన ఒక పవర్ హౌస్.

మల్లెలు గుత్తులుగా పూయాలంటే...



ఎండలు పెరుగుతున్న కొద్దీ మల్లె మొగ్గలు విరగబూస్తుంటాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పూల ఉత్పత్తి తగ్గుతుంటుంది. కాబట్టి వేసవికాలమంతా మల్లె చెట్టుకు మొగ్గలు గుత్తులుగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...

- వేసవి ప్రారంభానికి ముందు అంటే శీతాకాలం చివర్లోనే చెట్టుకు ఉన్న పెద్ద పెద్ద ఆకులను తుంచివేయాలి. ఎండిపోయిన కొమ్మలను తొలగించాలి. దీని వల్ల కొత్త చిగుర్లతోపాటు మొగ్గలు కూడా రావడం ప్రారంభమవుతుంది.
- మల్లె చెట్టుకు రోజంతా ఎండ తగులుతూ ఉండాలి. రోజుకు రెండుసార్లు నీళ్ల పోయాలి. మట్టి ఎప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి. అంతే తప్ప మట్టిలో నీరు నిలిచి ఉండకూడదు.
- మట్టిలో ఆవుపేడను కలిపి ఎరువులా ఉపయోగించాలి. ఎముకల పొడి, వర్మీ కంపోస్టును అందిస్తే చెట్టుకు బలం చేకూరుతుంది. నిమ్మకాయ రసం కలిపిన నీటిని కొమ్మలపై పిచికారీ చేయాలి. అప్పుడే అవి బలంగా పెరిగి చివరల్లో గుత్తులుగా మొగ్గలు తొడుగుతాయి. మల్లె చెట్టుకు నెలకోసారి పాస్ఫరస్, పొటాషియం అధికంగా ఉండే ఎరువులను అందించాలి.
- అరటిపండు తొక్కలను ముక్కలుగా కత్తిరించి ఒక



డబ్బాలో వేయాలి. అవి మునిగేవరకూ నీళ్ల పోసి వారం రోజులపాటు నాననివ్వాలి. తరువాత ఆ నీటిని చెట్టుకు పోస్తే మల్లెలు ఎక్కువగా పూస్తాయి.

- పూలు కోసిన తరువాత కొమ్మలను ఒక అంగుళం మేర కత్తిరిస్తూ ఉంటే కొత్త మొగ్గలు వస్తుంటాయి.
- మల్లె చెట్టుకు అఫిడ్స్, మైట్స్ లాంటి కీటకాలు హాని కలిగిస్తుంటాయి. అలాంటప్పుడు నీళ్లలో వేపనూనె కలిపి పిచికారీ చేస్తే కొమ్మలు గుబురుగా పెరగడమే కాకుండా చెట్టంతా పూలు నిండుతాయి.

చిత్రజ్యోతి

SINCE 1965

పవర్‌ఫుల్ పాత్రలో



అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ ఘట్టమనేని, రాషా తడాని జంటగా నటిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. తాజాగా ఈ చిత్రం నుంచి విలక్షణ నటుడు మోహన్ బాబు ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో క్రమశిక్షణ, గంభీరత కలగలిసిన కీలకపాత్రలో మోహన్‌బాబు నటిస్తున్నారు. వెంకటప్పయ్య నాయుడుగా ఆయన శక్తిమంతమైన పాత్రను పరిచయం చేశారు. అచ్చమైన పల్లెటూరి పెద్దమనిషిగా ఆయన గెటప్ ఆకట్టుకుంటోంది. నిర్మాత అశ్వనీదత్ సమర్పణలో పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జి. వి. ప్రకాశ్ కుమార్. సినిమాటోగ్రఫీ: జయకృష్ణ

కొత్త జంటకు కానుక



వైవాహిక బంధంతో ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ 'రణబాలి' చిత్రబృందం ఓ అందమైన పెళ్లిపాటను విడుదల చేసింది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విజయ్ 'రణబాలి'గా రష్మిక 'జయమ్మ'గా కనిపించనున్నారు. ఈ సినిమాలో వీరిద్దరిపై చిత్రీకరించిన పెళ్లి పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఏందయ్యా సామీ... ఇంత కాస్తాందీ వెన్నెల, ఉపేస్తావుంది సిత్తరాల ఉయ్యాల' అంటూ సాగే ఈ గీతానికి అజయ్-అతుల్ ద్వయం స్వరాలు సమకూర్చారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

లీక్ చేసి బెదిరించారు



శ్రీ విష్ణు

"'విష్ణు విన్యాసం' సినిమాను కొందరు లీక్ చేసి నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. లీక్‌ని అరికట్టి థియేటర్లలో విడుదల చేశాం. సినిమాకు ప్రేక్షకుల నుంచి బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. నేను ఎప్పుడూ కుటుంబ ప్రేక్షకులు, యువతను దృష్టిలో ఉంచుకునే సినిమాలు చేస్తాను' అని అన్నారు శ్రీ విష్ణు. ఆయన కథానాయకుడిగా యధునాథ్ మారుతీరావు తెరకెక్కించిన చిత్రమిది. సుమంత్‌నాయుడు నిర్మించారు. ఇటీవలె విడుదలైన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. నయన్ సారిక మాట్లాడుతూ 'సినిమా ప్రథమార్థం యువతకు, ద్వితీయార్థం అన్ని వర్గాల ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతోంది' అని చెప్పారు. నిర్మాత సుమంత్ నాయుడు మాట్లాడుతూ 'కుటుంబ సభ్యులంతా కలసి చూడాల్సిన చిత్రమిది. నిన్నటితో పోల్చితే ఈ రోజు కలెక్షన్లు పెరిగాయి' అని చెప్పారు. మరో నిర్మాత సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ "మృత్యుంజయ్' చిత్రానికి పోటీగా తీసుకురావాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత మా పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

పాత సినిమా కబుర్లు

ఎన్టీఆర్ అంటే ఎంత గౌరవమో!



ఎన్టీఆర్, జయంతి కాంతారావు

మహానటుడు ఎన్టీఆర్ అంటే కాంతారావుకు ఎంతో గౌరవం. ఆయన్ని తన సొంత సోదరుడిలానే ఆదరించి అభిమానించేవారు ఎన్టీఆర్. నేషనల్ ఆర్ట్స్ బేనరుపై తను నిర్మించిన తొలి జానపద చిత్రం 'జయసింహ'లో తన తమ్ముడి వేషం కాంతారావుకు ఇవ్వడమే కాకుండా 'లవకుశ'లో లక్ష్మణుడు సహా ఎన్నో మంచి పాత్రలు ఆయనకు దక్కేలా చేశారు ఎన్టీఆర్. ఆ కృతజ్ఞతాభావం కాంతారావులో ఉంది. అందుకే తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఎన్టీఆర్‌తో పంచుకుని ఆయన సలహా తీసుకొనేవారు. తనకు ఎలాంటి కష్టం వచ్చినా ఎన్టీఆర్‌కు చెప్పుకొని సహాయం పొందేవారు. అంతేకాదు తను నిర్మాతగా మారి సొంత చిత్రనిర్మాణం చేపట్టినప్పుడు ఎన్టీఆర్‌ను, ఆయన సోదరుడు త్రివిక్రమరావును తప్పకుండా పిలిచి వారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించేవారు.

చిరు.. అమల.. ఒకే ఒక్క సినిమా!



మెగాస్టార్ చిరంజీవి సరసన అమల నటించిన ఏకైక చిత్రం 'రాజా విక్రమార్క'. అక్కినేని నాగార్జునతో వివాహానికి ముందు అమల నటించిన అతి కొద్ది సినిమాల్లో ఇదొకటి. ఈ చిత్రంలో రాధిక కూడా మరో హీరోయిన్‌గా నటించారు. ఆ రోజుల్లో ఫిల్మ్ ఫైనాన్షియర్‌గా ఉన్న అమరనాథరెడ్డి నిర్మాతగా మారి రవిరాజా పినిశెట్టి దర్శకత్వంలో 'రాజా విక్రమార్క' చిత్రాన్ని నిర్మించారు. 1989 ఆగస్టు నెలలో బెంగళూరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ చెన్నై నుంచి ప్రత్యేకంగా వచ్చి ఈ చిత్ర ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మరో విశేషం ఏమిటంటే చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేకవీరుడు- అతిలోకసుందరి' చిత్రం కూడా బెంగళూరులోనే మొదలైంది. ఆ చిత్రం ప్రారంభమైన మర్నాడే 'రాజా విక్రమార్క' షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు.



యువతను మెప్పించే కథ

హన్సీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శ్రీ హన్సిక పెద్దిరెడ్డి నిర్మాతగా, రఘువర్ధన్ కోట దర్శకత్వంలో నూతన చిత్రం శనివారం లాంఛనంగా ప్రారంభమైంది. జగన్ యోగిరాజ్, నవ్య చిట్యాల జంటగా నటిస్తున్నారు. దేవీ ప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి శ్రీధర్ పెద్దిరెడ్డి క్లాప్ ఇచ్చారు. స్రవంతి పెద్దిరెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా హన్సిక పెద్దిరెడ్డి మాట్లాడుతూ 'చక్కని ప్రేమకథ, వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అన్నారు. 'ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్లు యువతను మెప్పించే కథతో తెరకెక్కిస్తున్నాం, త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని దర్శకుడు చెప్పారు.



కొత్తగా..

ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



సాయి సింహాద్రి హీరోగా నటించి, బత్తుల సతీష్ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. సినిమా ఇటీవలె విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సాయి సింహాద్రి మాట్లాడుతూ 'యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్‌గా ఉన్న నేను సినిమా రంగంపై ఆసక్తితో ఇక్కడకు వచ్చాను. ఏడాదిన్నర పాటు ఒడిదొడుకులు ఎదుర్కొంటూ సినిమాను విజయవంతంగా పూర్తి చేశాను. సినిమా చూసిన ప్రేక్షకులు ప్రశంసిస్తుంటే చాలా ఆనందంగా ఉంది. అన్ని చోట్లా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు' అని అన్నారు.

క్రీడాకారులు నటించే 'మహిళా కబడ్డీ'

పూజ నర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, అక్సాఖాన్, సుమన్, ఆమని, ఇంద్రజ ప్రధాన పాత్రధారులుగా ఆర్కే ఫిల్మ్స్ బ్యానర్‌పై ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'మహిళా కబడ్డీ'. ఇందులో ఇండియన్ కబడ్డీ టీమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, భారత మహిళా కబడ్డీ టీమ్ ప్లేయర్ పూజ



నర్వాల్‌తో పాటు ఏడుగురు కబడ్డీ క్రీడాకారులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'పల్లెటూరి నుంచి వచ్చిన ఒక పేద అమ్మాయి కబడ్డీ ఆటలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలా పేరు తెచ్చుకుంది? ఆ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంది అనే కథాంశంతో 'మహిళా కబడ్డీ' చిత్రాన్ని రూపొందిస్తున్నాను. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యింది. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు.

స్పోర్ట్స్

జయహో జమ్మూ

తొలిసారి రంజీ టైటిల్‌తో చరిత్ర

కర్ణాటకతో ఫైనల్ డ్రా

తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కశ్మీర్ విజయం



రూ. 2 కోట్ల నజరానా

రంజీ విజేతగా నిలిచిన జమ్మూ కశ్మీర్ జట్టుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా రూ. 2 కోట్ల నజరానా ప్రకటించారు. తమ జట్టు చివరి రోజును ఆటను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు.

హుబ్బళ్లి: ప్రతిష్ఠాత్మక దేశవాళీ క్రికెట్ చాంపియన్‌షిప్ రంజీట్రోఫీ ప్రారంభమై ఈ సీజన్‌కు 92 ఏళ్లు. జమ్మూ కశ్మీర్ జట్టు ఈ టోర్నీ ఆడడం ప్రారంభించి 67 సంవత్సరాలు. ఆరున్నర దశాబ్దాలకుపైగా ఈ చాంపియన్‌షిప్ తమ ప్రస్థానంలో కశ్మీర్ జట్టు అత్యుత్తమ ప్రదర్శన మూడుసార్లు (2013-14, 2019-20, 2024-25) క్వార్టర్స్ చేరడమే. కానీ ఈ సీజన్‌లో ఆ జట్టు చరిత్ర తిరగ రాసింది. ఎనిమిదిసార్లు విజేత అయిన కర్ణాటకను డ్రాతో నిలువరించి రంజీ ట్రోఫీని ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసినా..తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జమ్మూ కశ్మీర్ విజేతగా నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 186/4తో శనివారం, చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కశ్మీర్ 342/4తో డిక్లేర్ చేసింది. కమ్రన్ ఇక్బాల్ (160 నాటౌట్), సాహిల్ లోత్రా (101 నాటౌట్) శతకాలతో కదం తొక్కారు. ఐదో వికెట్‌కు అభేద్యంగా 197 పరుగులు జోడించారు. ఇన్నింగ్స్ ముగిసినట్టు కశ్మీర్ ప్రకటించిన అనంతరం రెండు జట్ల కెప్టెన్లు ఆటను నిలిపివేసేందుకు నిర్ణయించారు. దాంతో చాంపియన్‌గా నిలిచిన జమ్మూ కశ్మీర్ జట్టు సభ్యులు మైదానంలోకి దూసుకొచ్చి సంబరాలు చేసుకున్నారు. తమ విజయంలో కీలక భూమిక పోషించిన 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్', పేసర్ అకీబ్ నబీని భుజాలకెత్తుకొని మైదానంలో తిప్పారు. శుభమ్ పందిర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు
జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్: 584; **కర్ణాటక తొలి ఇన్నింగ్స్:** 293 ఆలౌట్; **జమ్మూ రెండో ఇన్నింగ్స్:** 342/4 డిక్లేర్డ్ (కమ్రన్ ఇక్బాల్ 160 నాటౌట్, సాహిల్ 101 నాటౌట్, అబ్దుల్ సమద్ 32, ప్రసిద్ధ్ 2/42).

10 మ్యాచ్‌లు.. 60 వికెట్లు



ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాకు చెందిన 29 ఏళ్ల కుడిచేతి వాటం పేసర్ అకీబ్ నబీ.. ఈ రంజీ సీజన్ 10 మ్యాచ్‌లలో 60 వికెట్లు పడగొట్టి జమ్మూ విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ రంజీట్రోఫీలో టాప్ బౌలర్ అతడే. కర్ణాటకతో ఫైనల్లో 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. ఈ సీజన్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన ఆకిబ్‌కు ఇది ఏడోసారంటే అతడు ఎంత అద్భుత బౌలింగ్ చేశాడో అర్థమవుతుంది. అకీబ్ సత్తాకు అచ్చెరువొందిన ఢిల్లీ క్యాపిటల్స్ గత ఐపీఎల్ వేలంలో అతడిని రూ. 8.6 కోట్లకు కొనుగోలు చేసింది.

నాయకుడై నడిపించాడు



ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 10 వేలకు పైగా పరుగులు..34 శతకాలతో జమ్మూ కశ్మీర్ క్రికెట్ చరిత్రలో 41 ఏళ్ల పరాస్ డోగ్రా చిరస్థాయిగా నిలుస్తాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని పాలంపూర్‌లో జన్మించిన డోగ్రా తొలుత ఆ రాష్ట్ర జట్టుకు ఆడాడు. తర్వాత జమ్మూ కశ్మీర్‌కు తరలిరాగా..అతడి సామర్థ్యంపై నమ్మకంతో కెప్టెన్సీ అప్పగించారు. విశ్వాసాన్ని వమ్ము చేయని డోగ్రా తనదైన నాయకత్వ శైలితో జట్టును విజేతగా నిలిపాడు.

మహిళల చివరి వన్డే నేడు
భారత్ X ఆస్ట్రేలియా (ఉ. 9.20 నుంచి)

గెలిచినా.. పాక్ ఇంటికే

- పోరాడి ఓడిన శ్రీలంక
- భయపెట్టిన షనక

సెమీస్‌కు న్యూజిలాండ్



షనక (76 నాటౌట్)



ఒక ప్రపంచకప్‌లో రెండు సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా సాహిబ్జాదా ఫర్హాన్

ఫర్హాన్ (100)

పల్లెకెలె: టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ కథ ముగిసింది.. న్యూజిలాండ్ సెమీస్ చేరుకొంది. సూపర్-8లో భాగంగా గ్రూప్-2లో శనివారం జరిగిన కీలక మ్యాచ్‌లో పాక్ 5 పరుగులతో శ్రీలంకపై గెలిచింది. పాక్ నాకౌట్ చేరాలంటే ఈ మ్యాచ్‌లో గెలుపుతోపాటు కివీస్ కంటే మెరుగైన రన్‌రేట్ సాధించాలి. ఈ క్రమంలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 212/8 స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాహిబ్జాదా ఫర్హాన్ (60 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులతో 100) సెంచరీ చేయగా.. ఫఖర్ జమాన్ (84) రాణించాడు. మదుశంక 3, షనక 2 వికెట్లు పడగొట్టారు. అయితే, సెమీస్ బెర్త్‌ను సొంతం చేసుకోవాలంటే లంకను 147, అంతకంటే తక్కువ పరుగులకే కట్టడి చేయాల్సిన పరిస్థితి. కానీ, కెప్టెన్ షనక (31 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సలతో 76 నాటౌట్), పవన్ రత్నాయకె (58) అర్ధ శతకాలతో పోరాడడంతో.. ఛేదనలో లంక ఓవర్లన్నీ ఆడి 207/6 స్కోరు మాత్రమే చేయగలిగింది. మిషార (26), అసలంక (25) రాణించారు. విజయానికి చివరి ఓవర్‌లో 28 రన్స్ కావాల్సి ఉండగా.. షనక అద్భుత బ్యాటింగ్‌తో పాక్‌కు ముచ్చెమటలు పట్టించాడు. అఫ్రీది వేసిన ఆఖరి ఓవర్‌లో తొలి నాలుగు బంతుల్లో ఫోర్, మూడు సిక్స్‌లతో 22 పరుగులు రాబట్టాడు. గెలుపునకు 6 రన్స్ అవసరమవగా.. తెలివిగా బంతులేసిన అఫ్రీది.. షనక షాట్లు ఆడకుండా కట్టడి చేశాడు.

ఆఖర్లో ఢమాల్..: అంతకుముందు ఓపెనర్లు ఫర్హాన్, ఫఖర్ తొలి వికెట్‌కు 176 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, డెత్ ఓవర్లలో క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టిన లంక.. కొంతమేర ప్రత్యర్థి జోరుకు బ్రేకులేసింది. 15.4 ఓవర్లలో పాక్ 176/0తో భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, ఫఖర్‌ను చమీర ఎప్పుడైతే అవుట్ చేశాడో.. అప్పటి నుంచి పాక్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. 26 బంతుల్లో.. 36 రన్స్ తేడాతో 8 వికెట్లు కోల్పోయింది. సెంచరీ పూర్తి చేసుకొన్న ఫర్హాన్‌ను ఆఖరి ఓవర్‌లో మదుశంక అవుట్ చేశాడు.

సంక్షిప్త స్కోర్లు: పాకిస్థాన్: 20 ఓవర్లలో 212/8 (ఫర్హాన్ 100, ఫఖర్ 84; మదుశంక 3/33, షనక 2/42). **శ్రీలంక:** 20 ఓవర్లలో 207/6 (షనక 76 నాటౌట్, పవన్ రత్నాయకె 58; ఎబ్రార్ 3/23).

నేటి మ్యాచ్‌లు
జింబాబ్వే X దక్షిణాఫ్రికా (మ. 3 గం. నుంచి)
భారత్ X వెస్టిండీస్ (రాత్రి 7 గం. నుంచి)

భారత్‌లోనే సెమీఫైనల్స్

టీ20 ప్రపంచ కప్ నుంచి పాకిస్థాన్ జట్టు నిష్క్రమించడంతో సెమీఫైనల్ మ్యాచ్‌లు భారత్‌లోనే జరగనున్నాయి. ముందస్తు షెడ్యూల్ ప్రకారం.. పాకిస్థాన్ లేదా శ్రీలంక జట్లు సెమీస్‌కు చేరితే, తొలి సెమీస్ వేదికగా కొలంబోను నిర్ణయించారు. కానీ, ఇప్పుడు ఆ రెండు జట్లు సూపర్-8లోనే నిష్క్రమించడంతో.. ఇక రెండు సెమీఫైనల్స్ భారత్‌లోనే జరగనున్నాయి. తొలి సెమీస్ బుధవారం కోల్‌కతాలో, రెండోది గురువారం ముంబైలో నిర్వహిస్తారు.

1

టీ20 వరల్డ్‌కప్‌లో ఓ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించిన విరాట్ కోహ్లీ (319) రికార్డును బద్దలుకొట్టిన ఫర్హాన్ (383).

ఫర్హాన్, ఫకర్ తొలి వికెట్‌కు జోడించిన 176 పరుగులు.. టీ20 ప్రపంచకప్‌లో ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం.

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	3	3	0	0	6	1.096
న్యూజిలాండ్	3	1	1	1	3	1.390
పాకిస్థాన్	3	1	1	1	3	-0.123
శ్రీలంక	3	0	3	0	0	-1.950

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్



విండీస్ కెప్టెన్ హోప్

మరో చాన్స్ లేదు.. టీమిండియా ముందు ఇప్పుడు ఒక్కటే లక్ష్యం. సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే కచ్చితంగా వెస్టిండీస్‌ను చిత్తు చేయాల్సిందే. లేదంటే డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు ఇంటిబాట తప్పదు. అటు కరీబియన్లదీ అదే పరిస్థితి. గెలిస్తేనే ముందుకెళ్లేది. దీంతో నువ్వా.. నేనా? అనే రీతిలో ఇరుజట్లు ఈడెన్‌లో అమీతుమీకి సిద్ధమయ్యాయి. బ్యాటర్ల ఫామ్ ఎలా ఉన్నా.. ప్రత్యర్థి జట్టులోని భీకర హిట్టర్లను అడ్డుకోవాలంటే మనోళ్ల బౌలింగ్ గణనీయంగా మెరుగవ్వాలి. మరి.. ముందుకెళ్లేదెవరు? నిష్క్రమించేదెవరు తేలేది నేడే.

చావోరేవో!

విండీస్‌తో భారత్ ఢీ నేడు

- గెలిచిన జట్టు సెమీస్‌కు
- మనోళ్ల బౌలింగ్‌పై ఆందోళన
- టీ20 వరల్డ్‌కప్ సూపర్-8



కోల్‌కతా: టీ20 వరల్డ్‌కప్‌లో అత్యంత ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. సూపర్-8లో ఇప్పటికే దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన భారత్, వెస్టిండీస్ జట్లు అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. ఆదివారం జరిగే ఈ గ్రూప్ 1 ఆఖరి పోరులో గెలిచిన జట్టు సెమీస్‌కు వెళుతుంది. మార్చి 5న ముంబైలో జరిగే రెండో సెమీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడుతుంది. ఇక ఓడిన జట్టుకు టోర్నీ నుంచి నిష్క్రమణ తప్పదు. టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో భారత్, విండీస్ నాలుగుసార్లు తలపడగా.. 3 విజయాలతో కరీబియన్ జట్టుదే పైచేయి కావడం గమనార్హం. అంతేకాదు.. 2016 టోర్నీ సెమీస్‌లో భారత్‌ను ఓడించిన విండీస్.. ఇదే ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌పై నెగ్గి కప్ అందుకుంది.

బ్యాటింగ్ సరే.. బౌలింగ్?: జింబాబ్వేతో మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ విభాగం ఒక్కసారిగా జూలు విదిల్చింది. ప్రతీ బ్యాటర్ చెలరేగడంతో ఏకంగా 250+ స్కోరు నమోదైంది. ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న ఓపెనర్ అభిషేక్ హాఫ్ సెంచరీతో ట్రాక్‌లోకి రావడంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఫుల్ ఖుషీలో ఉంది. ఇక సంజూ శాంసన్ చేసింది 24 పరుగులే అయినా ఆరంభంలో మెరుపు ఇన్నింగ్స్‌తో అభిషేక్‌పై ఒత్తిడి లేకుండా చేశాడు. ఆరో నెంబర్‌లో తిలక్ సైతం తన మునుపటి ఆటను వెలికితీశాడు. కెప్టెన్ సూర్య, హార్దిక్, దూబేల బ్యాటింగ్ సరేసరి. ఇలా ఈ విభాగంలో అంతా బాగానే కనిపిస్తున్నా.. మన బౌలింగ్ మాత్రం అంచనాలను అందుకోవడం లేదు. ముఖ్యంగా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌ను ప్రత్యర్థి జట్ల బ్యాటర్లు అలవోకగా ఆడేస్తున్నారు. వరుణ్ దక్షిణాఫ్రికాపై 4 ఓవర్లలో 47 రన్స్ ఇచ్చుకున్నాడు. జింబాబ్వే బ్యాటర్లు కూడా అతడిని దీటుగా ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. విండీస్‌తో మ్యాచ్‌లో వరుణ్‌ను తప్పించి కుల్దీప్‌నకు చాన్సిస్తారా? చూడాలి. మరోవైపు సీమ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తన బౌలింగ్‌తో సొంతజట్టునే భయపెడుతున్నాడు. వైడ్లు, నోబ్స్‌తో అతను ధారాళంగా పరుగులివ్వడం ఆందోళనపరుస్తోంది. అయితే ఈడెన్ పిచ్‌పై కాస్త పచ్చిక కనిపిస్తుండడంతో పేస్ త్రయం బుమ్రా, అర్షదీప్, పాండ్యాలకు కలిసిరానుంది.

హిట్టర్లే బలంగా..: టోర్నీలో భారత్‌లాగే విండీస్ కూడా ఒక్క మ్యాచ్‌లోనే ఓడింది. రెండు జట్లు కూడా జింబాబ్వేపై 250+ స్కోర్లు చేశాయి. అయితే తొమ్మిదో నెంబర్ వరకు హిట్టర్లు ఉండడం విండీస్‌కు బలం. మధ్య ఓవర్ల వరకు నిలకడగా ఆడి ఆ తర్వాత ఎదురుదాడికి దిగుతూ బ్యాట్లు ఝుళిపించే వ్యూహాన్ని ఈ టోర్నీలో విండీస్ అమలు చేసింది. అందుకే ఐదు వరుస విజయాలతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. సఫారీలతో మ్యాచ్‌లోనూ 83/7 నుంచి 176/8 వరకు వెళ్లిందంటే తొమ్మిదో నెంబర్ బ్యాటర్ షెఫర్డ్ బాదుడే కారణం. షెఫర్డ్‌తో పాటు హెట్‌మయెర్, హోప్, పావెల్, రూథర్‌ఫోర్డ్, హోల్డర్‌లను భారత బౌలర్లు అడ్డుకోకుంటే నష్టం తప్పదు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శాంసన్, ఇషాన్, తిలక్, సూర్య (కెప్టెన్), హార్దిక్, దూబే, అక్షర్, అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్/కుల్దీప్.
వెస్టిండీస్: కింగ్, హోప్ (కెప్టెన్), హెట్‌మయెర్, పోవెల్, చేజ్, రూథర్‌ఫోర్డ్, హోల్డర్, మాథ్యూఫోర్డ్, జోసెఫ్, షెఫర్డ్, మోటీ.

పిచ్, వాతావరణం

మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుండడంతో భారీస్కోరు ఖాయమనిపిస్తోంది. మంచు ప్రభావం కారణంగా టాస్ నెగ్గిన జట్టు ఛేదనకు మొగ్గు చూపొచ్చు. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయితే నెట్ రన్‌రేట్ పరంగా విండీస్ సెమీస్ చేరుతుంది.

ఆరోగ్య బీమాలో ఏ పాలసీ బెటర్?

ఫ్లోటర్ లేదా వ్యక్తిగత పాలసీనా..



వైద్య ఖర్చులు ఏటికేటికి పెరిగి పోతున్నాయి. ఈ ఖర్చులు తట్టుకోవడం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. దీంతో ఆరోగ్య బీమా పాలసీలకు గిరాకీ పెరుగుతోంది. అయితే చాలా మందికి ఆరోగ్య బీమా పాలసీని ఎలా ఎంచుకోవాలనే దానిపై స్పష్టత లేదు. బీమా కంపెనీ ఏజెంట్లు చెప్పే మాటలు గుడ్డిగా నమ్మి పాలసీలు తీసుకుంటారు. తీరా అవసరం వచ్చే సరికి ఆరోగ్య బీమా పాలసీ ఉన్నా సరైన కవరేజీ లభించలేదని నెత్తీ నోరు బాదుకుంటారు. ఈ పరిస్థితి రాకూడదనుకుంటే పాలసీ తీసుకునే ముందే ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీ తీసుకోవాలా? లేక వ్యక్తిగత ఆరోగ్య పాలసీ తీసుకోవాలా? అని ఆలోచించుకోవాలి.

వ్యక్తిగత పాలసీలు

వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ కింద.. ఆ పాలసీ తీసుకున్న వ్యక్తి ఆరోగ్య సమస్యలకు మాత్రమే బీమా కవరేజీ లభిస్తుంది. ఉదాహరణకు ముగ్గురు కుటుంబ సభ్యులు ఎవరికి వారు రూ.10 లక్షలకు వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలు తీసుకున్నారు అనుకుందాం. ఆ ముగ్గురిలో ఎవరికి అనారోగ్య సమస్య వచ్చినా, పాలసీ షరతులకు లోబడి ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు బీమా రక్షణ లభిస్తుంది.

ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీలు

ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీల ద్వారా కుటుంబ సభ్యులు అందరికీ ఒకే పాలసీ ద్వారా ఆరోగ్య బీమా రక్షణ కవరేజీ లభిస్తుంది. కుటుంబ సభ్యుల వయసు, ఆరోగ్య సమస్యలను బట్టి ప్రీమియం మారుతుంది. ఉదాహరణకు నలుగురు సభ్యుల కుటుంబం ఒక సంవత్సరానికి వర్తించేలా రూ.10 లక్షల కవరేజీ కోసం ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీ తీసుకున్నారని అనుకుందాం. వీరిలో ఎవరైనా ఒకరు రోగాల బారిన పడి రూ.6 లక్షలు ఖర్చయ్యాయి. ఆ మొత్తాన్ని బీమా కంపెనీ చెల్లించింది. ఇక మిగిలేది రూ.4 లక్షలు మాత్రమే. అప్పుడు మిగతా ముగ్గురు కుటుంబ సభ్యుల కవరేజీ రూ.4 లక్షలకు పడిపోతుంది. ఇక్కడ కుటుంబమంటే భార్య, భర్త, వారి పిల్లలు, తల్లిదండ్రులు అని అర్థం చేసుకోవాలి. ఫ్లోటింగ్ పాలసీల ద్వారా కుటుంబ సభ్యులు అందరికీ, వ్యక్తిగత పాలసీల ద్వారా ఆయా వ్యక్తుల ఆరోగ్య సమస్యలకు మాత్రమే బీమా కవరేజీ లభిస్తుంది.

చూడాల్సిన అంశాలు

ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు ప్రతి వ్యక్తి ఈ అంశాలను గుర్తుంచుకోవాలి.

- కుటుంబ సభ్యుల సంఖ్య, వారి వయసు
- సభ్యుల ఆరోగ్య సమస్యలు
- వ్యక్తిగత, ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీల మధ్య ప్రీమియం వ్యత్యాసం

ప్రీమియం

ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం 35 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు పెద్దలు, మూడు నుంచి ఐదేళ్ల వయసు ఉన్న ఇద్దరు పిల్లలు ఉండే కుటుంబానికి ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీ తీసుకోవాలి అనుకుందాం. బీమా కంపెనీల నిబంధనల ప్రకారం 18 ఏళ్ల లోపు పిల్లలకు వ్యక్తిగత ఆరోగ్య పాలసీలు ఇవ్వరు. కాబట్టి ఈ కుటుంబం తప్పనిసరిగా ఫ్యామిలీ ఫ్లోటింగ్ ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాల్సిందే. అందుకోసం ఏటా రూ.10 లక్షల కవరేజీ కోసం రూ.20,000, రూ.15 లక్షల కవరేజీ కావాలంటే రూ.23,000, రూ.20 లక్షల కవరేజి కోసం రూ.25,000 ప్రీమియంగా చెల్లించాలి.

ఏ పాలసీ ఎవరికి అనుకూలం?

కుటుంబ సభ్యులు, వారి వయసు, ఆరోగ్య సమస్యల ఆధారంగా వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలా? లేక ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీ తీసుకోవాలా? అనే విషయం నిర్ణయించుకోవాలి. కుటుంబ సభ్యులు అందరూ తక్కువ వయసులో ఉండి, ఆరోగ్య సమస్యలు లేకపోతే ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీ తీసుకోవటం మంచిది. అయితే కుటుంబంలో బీపీ, షుగర్ లాంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆరు పదుల వయసు నిండిన తల్లిదండ్రులు ఉంటే, వారి కోసం ప్రత్యేకంగా వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోవడమే మంచిది. మూడు పదుల వయసులో ఉన్న దంపతులు, 18 ఏళ్ల వయసు లోపు పిల్లలు ఉన్న కుటుంబాలు మాత్రం ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీనే ఎంచుకోవాలి.

ఎవరికి మేలు

సీనియర్ సిటిజన్లు లేకుండా 18 ఏళ్ల లోపు వయసు ఉన్న పిల్లలు, 30 ఏళ్ల లోపు దంపతులు ఫ్లోటింగ్ పాలసీ తీసుకుంటే ప్రీమియం కూడా తక్కువగానే ఉంటుంది. కాకపోతే ఇక్కడ వీరంతా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేనివారై ఉండాలి. దీనివల్ల వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలతో పోలిస్తే.. ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీల ప్రీమియం చెల్లింపులు 35 నుంచి 60 శాతం తక్కువగా ఉంటాయి.

ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీతో చిక్కులు

ఉదాహరణకు ఒక కుటుంబం రూ.10 లక్షల కవరేజీకి ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీ తీసుకుంది. ఆ కుటుంబంలో ఎవరికైనా ఏదైనా అనారోగ్య సమస్య వచ్చి కవరేజీ పరిమితి మొత్తం ఖర్చయి పోయింది. అదే సమయంలో కుటుంబంలోని ఇంకొకరికి అనారోగ్య సమస్య వస్తే, ఆ పాలసీ కింద ఎలాంటి కవరేజీ లభించదు. మిగతా కుటుంబ సభ్యులకు అయ్యే వైద్య ఖర్చులు మొత్తాన్ని జేబులోంచే ఖర్చు పెట్టుకోవాలి. దీనికి తోడు ఫ్యామిలీ ఫ్లోటింగ్ పాలసీల ప్రీమియం కుటుంబ సభ్యుల వయసుతో పాటు ఏటా పెరుగుతుంది.

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య బీమా పాలసీలను ఎంచుకోవాలి. దీనిపై అవగాహన లేకపోతే మంచి ట్రాక్ రికార్డు ఉన్న బీమా సలహాదారులను సంప్రదించడం మంచిది.

బిజినెస్ ప్లస్

జీఎస్‌టీ ఎగవేత కేసులో ఫినో పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ అరెస్ట్

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) ఎగవేత కేసులో ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ రిషి గుప్తా అరెస్ట్ అయ్యారు. సెంట్రల్ జీఎస్‌టీ చట్టంలోని సెక్షన్ 132 (1) (ఏ), స్టేట్ జీఎస్‌టీ యాక్ట్‌లోని సెక్షన్ 132(1) (ఐ) కింద గుప్తాను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అదుపులోకి తీసుకున్నట్లు బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. కాగా, బ్యాంక్ జీఎస్‌టీ నిబంధనలను ఉల్లంఘించలేదని, బ్యాంక్ వ్యాపార భాగస్వామి లావాదేవీలపై దర్యాప్తునకు సంబంధించిన వ్యవహారమని ఫినో పేమెంట్స్ బ్యాంక్ తన ప్రకటనలో పేర్కొంది. అయితే, రిషి గుప్తా అరెస్ట్‌ను కార్పొరేట్ రంగానికి చెందిన పలువురు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నించారు. దాంతో ఈ విషయంపై వాకబు చేస్తానని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా ప్రకటించారు.

షెల్ కంపెనీలు, పేమెంట్ అగ్రిగేటర్ల ద్వారా అక్రమంగా నిధుల మళ్లింపు

గత ఏడాది భారత్‌లో నిషేధించిన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ద్వారా ఆర్జించిన సొమ్ము, దానిపై జీఎస్‌టీ ఎగవేతకు సంబంధించిన వ్యవహారంలో దర్యాప్తు చేస్తున్న డీజీజీఐ.. షెల్ కంపెనీలు, పేమెంట్ అగ్రిగేటర్ల ద్వారా అక్రమంగా ఆ నిధులను దారి మళ్లించినట్లు అనుమానిస్తోందని విశ్వసనీయ వర్గాలు శనివారం తెలిపాయి. అందులో ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఉన్నతాధికారి పాత్ర ఉన్నట్లు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో తేలిందని, దాంతో ఆయన్ని అధికారులు అరెస్ట్ చేశారని వారన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	500
వరంగల్	452	గోదావరి	458
చిత్తూరు	513	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	150
వరంగల్	150	గుంటూరు	150
కరీంనగర్	150	ఒంగోలు	150
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	134
కర్నూలు	150	నెల్లూరు	139
విశాఖపట్నం	150	అనంతపురం	139
గోదావరి	150		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,64,730 ▲	1,51,000 ▲	3,00,000 ▲
విజయవాడ	1,70,000 ▲	1,58,000 ▲	2,78,500 ▲
విశాఖపట్నం	1,68,710 ▲	1,54,650 ▲	3,20,000 ▲
రాజమండ్రి	1,64,730 ▲	1,51,100 ▲	2,75,000 ▲
ప్రొద్దుటూరు	1,70,000 ▲	1,48,120 ▲	2,77,000 ▲
ముంబై	1,59,097 ▲	1,45,733 ▲	2,66,700 ▲

టాటా ఏఐఏ లైఫ్ గ్లోబల్ ఈక్విటీ ఫండ్

టాటా ఏఐఏ లైఫ్ గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించింది. దీర్ఘకాలంలో సంపదను సృష్టించేలా గ్లోబల్ మార్కెట్ల ద్వారా అంతర్జాతీయ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. అంతర్జాతీయ మార్కెట్లలోని మ్యూచువల్ ఫండ్స్, ఈటీఎఫ్‌లు సహా ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. అలాగే టాటా ఏఐఏ యూనిట్ లింక్డ్ ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్ ద్వారా సమగ్ర జీవిత బీమా కవరేజీని అందించనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ మార్చి 5. పాలసీ నిబంధనల ప్రకారం ఒక్కో యూనిట్‌కు 10 డాలర్లు పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. టాటా ఏఐఏ యూనిట్ లింక్డ్ సొల్యూషన్స్ అయిన టాటా ఏఐఏ శుభ్ గ్లోబల్ ఇన్వెస్ట్ ద్వారా మదుపరులు గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు.

ట్రస్ట్ ఎంఎఫ్ మిడ్‌క్యాప్ ఫండ్

ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్.. మిడ్ క్యాప్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ ఫండ్ పథకం. మార్కెట్ క్యాప్ ఆధారంగా మంచి పనితీరు కనబరుస్తున్న కంపెనీలను ఎంచుకుని ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ మార్చి 13.

మార్కెట్ కుప్పకూలుతుందా?

అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో స్టాక్ సూచీలకు భారీ పతనం తప్పదా..?

యుద్ధమంటే మార్కెట్లకు మహా భయం. ప్రపంచంలో ఏ మూలన ఉద్రిక్తతలు నెలకొన్నా స్టాక్ మార్కెట్ సూచీలు కుప్పకూలడం గతంలో చాలా సార్లు చూశాం. తాజాగా అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై శనివారం యుద్ధం ప్రారంభించాయి. ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు పాల్పడుతుండటంతో ప్రస్తుతం పశ్చిమాసియా రగులుతోంది. ముమ్మందు ఇది మరింత తీవ్రతరం కావచ్చన్న భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలను చవిచూడవచ్చని ఈక్విటీ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఈ యుద్ధం కారణంగా ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకే ప్రమాదం ఉంది. ప్రస్తుతం 72 డాలర్ల స్థాయిలో ఉన్న బ్రెంట్ ముడిచమురు పీపా ధర.. త్వరలోనే 80 డాలర్లు దాటవచ్చన్న అంచనాలున్నాయి. ఇందుకుతోడు హోర్ముజ్ జలసంధి మార్గంలో ఎగుమతి, దిగుమతి వాణిజ్యం నిలిచిపోయే ప్రమాదమూ నెలకొంది. ఈ పరిణామాలు భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని, వచ్చే వారమంతా సూచీలపై ఒత్తిడి కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు.

నిఫ్టీకి 25,000 కీలక మద్దతు స్థాయి

శుక్రవారం నాడు మన మార్కెట్లు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 961 పాయింట్లు క్షీణించి 81,287 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 317 పాయింట్లు పతనమై 25,178 వద్ద ముగిసింది. సోమవారం (మార్చి 2) ట్రేడింగ్‌లో నిఫ్టీ 25,000 వద్ద కన్పిస్తున్న కీలక మద్దతు స్థాయిని కూడా కోల్పోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అదే గనుక జరిగితే, సూచీ మరింత కిందికి జారుకోవచ్చని.. యుద్ధం తీవ్రతరమైతే వచ్చే వారంలో నిఫ్టీ 24,500 స్థాయికి పడిపోయే అవకాశాలు ఉన్నాయని వారు అభిప్రాయపడ్డారు.

పాఠశాలపై క్షిపణి దాడితో 85 మంది మృతి

ఇరాన్‌లోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో చిన్నారులు సహా 85 మంది మరణించినట్టుగా ఇరాన్‌కు చెందిన టాస్నిమ్ వార్తా సంస్థ ప్రకటించింది. మినాబ్‌లో ఇరాన్ కీలక మిలటరీ స్థావరం ఉంది. శనివారం ఉదయం దానిపై దాడి చేసిన ఇజ్రాయెల్.. క్షిపణి రక్షణ వ్యవస్థలు, రాడార్లను ధ్వంసం చేసింది. అయితే పాఠశాలపై దాడి అంశాన్ని పరిశీలిస్తున్నామని, సాధారణ పౌరులకు నష్టం జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని బలగాలకు సూచించామని యూఎస్ సెంట్రల్ కమాండ్ శనివారం రాత్రి వెల్లడించింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ వ్యాప్తంగా 201 మంది చనిపోయారని, 747 మంది గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రిసెంట్ సొసైటీ ప్రకటించింది.

గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు

అమెరికా, ఇజ్రాయెల్‌ల ఉమ్మడి దాడితో ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. తొలుత ఇజ్రాయెల్‌పైకి క్షిపణులను ప్రయోగించింది. చాలా వరకు క్షిపణులను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు అడ్డుకోగలిగినా.. రాజధాని టెల్ అవీవ్‌తోపాటు దేశ ఉత్తర ప్రాంతాల్లో పలుచోట్ల ఇరాన్ క్షిపణి దాడులతో పేలుళ్లు జరిగాయి. ఇజ్రాయెల్ తమ దేశ పౌరులందరినీ అప్రమత్తం చేసింది. కొన్ని ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించింది. బాంబు షెల్టర్లకు సమీపంలో ఉండాలని సూచనలు చేసింది. మరోవైపు గల్ఫ్ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలపైనా ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. ఖతార్‌లోని అల్ ఉదీద్ ఎయిర్‌బేస్, కువైట్‌లోని అల్ సలేమ్ ఎయిర్‌బేస్, యూఏఈలోని అల్ ధాఫ్రా ఎయిర్‌బేస్, బహ్రెయిన్‌లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం, సౌదీలోని రియాద్, జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపైకి కూడా క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించింది. ఖతార్‌లోని దోహాలో, దుబాయ్‌లో వరుసగా పేలుళ్లు జరిగాయి. అంతేకాదు.. ఇప్పుడు తాము ప్రయోగించినవి కేవలం ఉత్త తుప్పుపట్టిన క్షిపణులేనని, ఇరాన్ వద్ద ఉన్నవాటిలో అవి కొన్ని మాత్రమేనని ఐఆర్‌జీసీ మేజర్ జనరల్ ఇబ్రహీం జబారి ప్రకటించారు. అవసరమైతే ఇంతకుముందెన్నడూ చూడని ఆయుధాలను బయటికి తీస్తామని అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. ఇరాన్ క్షిపణి దాడి, వాటిని మధ్యలోనే అడ్డుకోవడంతో క్షిపణి శకలాలు పడి అబుధాబిలో ఒకరు, దుబాయ్‌లో మరొకరు చనిపోయారు. దుబాయ్‌లోని ప్రపంచంలోనే అతి ఎత్తయిన భవనం బుర్జ్ ఖలీఫాకు సమీపంలోని ఓ భవనంపై ఇరాన్ డ్రోన్ దాడి జరిగింది. పదుల సంఖ్యలో గాయపడ్డారు.


ఖతార్‌లో ఆకాశంలో క్షిపణి


భయంతో ప్రజల పరుగులు



పొంచి ఉన్న ముప్పును తొలగించేందుకే దాడి

» నెతన్యాహూ ప్రకటన

టెల్ అవీవ్, ఫిబ్రవరి 28: ఇరాన్‌పై అమెరికాతో కలిసి దాడి చేయడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహ్యూ వీడియో సందేశం విడుదల చేశారు. ఇరాన్‌లో ఉగ్రవాద పాలకుల రూపంలో పొంచి ఉన్న ప్రమాదాన్ని రూపుమాపడానికే దాడి చేయాల్సి వచ్చిందని ప్రకటించారు. తొలుత 'గ్రేట్ ఫ్రెండ్', 'చరిత్రాత్మక నాయకుడు' ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. గత 47 ఏళ్లుగా అయోతొల్లా ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయెల్‌ల చావును కోరుతోందని, పలువుర్ని చంపి రక్తాన్ని కళ్ల చూసిందని ఆరోపించారు. "ఈ హంతక, ఉగ్రవాద పాలకుల చేతిలో అణ్వాయుధాలు ఉండకూడదు. ఉంటే అది మానవాళికే ముప్పుగా పరిణమిస్తుంది" అన పేర్కొన్నారు. అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించేందుకు అమెరికా రెండు విడతలుగా చర్చలు జరిపినా ఫలించలేదని తెలిపారు. అందువల్ల ధైర్యవంతులైన ఇరాన్ ప్రజలు తమ భవిష్యత్తును చేతుల్లోకి తీసుకునేలా ఉమ్మడిగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ యుద్ధం పాలకులపైనే తప్ప, ఇరాన్ ప్రజలపై కాదని స్పష్టం చేశారు. నియంతృత్వ కాడిని వదిలించుకొని శాంతి, స్వేచ్ఛాయుత ఇరాన్‌ను నిర్మించుకోవాలని దేశంలోని అన్ని వర్గాల వారికి పిలుపునిచ్చారు. 'ఆపరేషన్ రోరింగ్ లయన్' (ఘర్జించే సింహం) పేరుతో చేపట్టిన ఈ దాడి సందర్భంగా సహనంతో మెలగాలని, హోం ఫ్రంట్ కమాండ్ ఇచ్చే మార్గదర్శకాలను అమలు చేయాలని ఇజ్రాయెల్ వాసులను కోరారు.

మోదీ ఇజ్రాయెల్ పర్యటన సిగ్గుచేటు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై కాంగ్రెస్ పార్టీ నిశిత విమర్శలు చేసింది. ఈ పర్యటనను సిగ్గుచేటుగా పేర్కొంది. ఇజ్రాయెల్‌లో పర్యటించిన సమయం కూడా సరికాదని వ్యాఖ్యానించింది. ఇది సైనికచర్యకు రాజకీయ ఆమోదం ఉందన్న భావనను కల్పించేలా ఉందని దుయ్యబట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల విభాగం చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల వేళ మోదీ చేసిన పర్యటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన చెందుతోందని తెలిపారు. కాగా, మోదీ ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించారు.


ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ దాడి విధ్వంసం

దుబాయ్‌లోని పామ్ జుమేరా హోటల్ వద్ద క్షిపణి శకలాలు పడి చెలరేగిన మంటలు



ఇరాన్‌పై భీకర దాడి


పాక్‌పోర్

200 ఫైటర్ జెట్లతో క్షిపణుల దాడి.. 201 మంది మృతి

దుబాయ్/వాషింగ్టన్/టెల్ అవీవ్, ఫిబ్రవరి 28: పశ్చిమాసియాలో యుద్ధ భేరి మోగింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. పెద్ద సంఖ్యలో క్షిపణులతో విరుచుకుపడ్డాయి. యుద్ధ విమానాలతోనూ కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీనితో ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగింది. అటు ఇజ్రాయెల్‌పై, ఇటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై పెద్ద సంఖ్యలో క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించింది. తమ దేశాల్లోని ప్రాంతాలపై ఇరాన్ దాడులను ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ, యూఈఏ తీవ్రంగా ఖండించాయి. ఇరాన్ దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాయి. దీనితో పశ్చిమాసియా ప్రాంతమంతా అట్టుడుకుతోంది. శనివారం రాత్రి కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులు కొనసాగించడం.. అటు ఇరాన్ కూడా ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతుంటంతో.. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. మరింత ఉధృతంగా దాడులు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు అమెరికా రక్షణ వర్గాలు శనివారం రాత్రి వెల్లడించాయి.

అటు చర్చలు అంటూనే ఇటు దాడులు..

ఇరాన్ అణుశుద్ధిని పూర్తిగా నిలిపివేయాలని, క్షిపణుల సామర్థ్యాన్ని తగ్గించుకోవాలని అమెరికా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇరాన్ ఒప్పందానికి రావాలని, లేకుంటే దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు హెచ్చరించారు కూడా. ఈ క్రమంలో ఒమన్ మధ్యవర్తిత్వంతో స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఇరాన్-అమెరికా మధ్య మూడు దఫాలుగా చర్చలు కూడా జరిగాయి. గురువారం జరిగిన చర్చల అనంతరం అణుశుద్ధి విషయంలో ఇరాన్ దిగివస్తోందని, పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడతాయని కూడా వార్తలు వెలువడ్డాయి. కానీ దీనిపై తాను అంత సంతృప్తిగా లేనని ట్రంప్ శుక్రవారం పేర్కొన్నారు. అన్నట్టుగానే శనివారం ఉదయమే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా శనివారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు 30 కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించాయి. ఇరాన్ క్షిపణి ప్రయోగ వ్యవస్థలు, మిలటరీ స్థావరాలతోపాటు ప్రభుత్వాధినేతలు, మిలటరీ ఉన్నతాధికారులు లక్ష్యంగా యుద్ధ విమానాలతోనూ ఏకకాలంలో దాడులు చేశాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అమెరికా, 'ఆపరేషన్ లయన్ రోర్ (సింహ గర్జన)' పేరుతో ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్ చేపట్టాయి. దీనితో ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలోని అన్ని అమెరికా స్థావరాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేపట్టింది.

సంయమనం పాటించండి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో భారత్ స్పందించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ, ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్‌తో జై శంకర్ ఫోన్లో మాట్లాడారు. సంయమనం పాటించాలని, చర్చలు, దౌత్యం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకుని, సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఖమేనీ సురక్షితమే!

అమెరికా దాడికి దిగవచ్చనే అంచనాల మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీని ముందుగానే భద్రమైన రహస్య ప్రదేశానికి తరలించినట్టు ఆ దేశ అధికార వర్గాలు వెల్లడించాయి. అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కూడా సురక్షితంగానే ఉన్నట్టు తెలిపాయి. అయితే ఖమేనీ అల్లుడు, కోడలు మృతి చెందినట్టు పేర్కొన్నాయి. కాగా, తమ దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్, ఐఆర్‌జీసీ మిలటరీ కమాండర్ మహమ్మద్ పాక్‌పోర్ మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. దీనిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఖండించారు. తమ రక్షణ మంత్రి, ఉన్నతాధికారులు క్షేమంగా ఉన్నట్టు తెలిపారు.

ఇరాన్ దాడులు ఆపకుంటే తీవ్ర పరిణామాలు: గల్ఫ్ దేశాల హెచ్చరిక

తమ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తమ సార్వభౌమత్వాన్ని సవాలు చేయడమేనని ఖతార్, యూఏఈ, సౌదీ, బహ్రెయిన్ తదితర దేశాలు హెచ్చరించాయి. దాడులు ఆపకుంటే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించాయి. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పేర్కొన్నాయి. ఈ దేశాలన్నీ తమ గగనతలాన్ని మూసేశాయి. పరిస్థితి చక్కబడే వరకు పౌరులెవరూ ఇళ్లలోంచి బయటికి రావొద్దని హెచ్చరించాయి.

వేదన కలిగించాయి: ఒమన్ మంత్రి

అమెరికా-ఇరాన్ మధ్య చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్‌బుసైదీ తాజా పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో మూడు దశలుగా ఈ చర్చలు జరిగాయి. అవి పురోగతిలో ఉన్నట్టు అల్ బుసైదీ గురువారం ప్రకటించారు కూడా. ఇలాంటి సమయంలో అమెరికా దాడులు చేపట్టడం ఆవేదన కలిగించాయని ఆయన శనివారం పేర్కొన్నారు. చర్చలు కీలక దశకు చేరుకుంటున్న సమయంలో అమెరికా దాడితో అంతా నిష్ఫలమైపోయిందని పేర్కొన్నారు. పరిస్థితి మరింత దిగజారకుండా అమెరికా వెంటనే దాడులు ఆపేయాలని అల్ బుసైదీ విజ్ఞప్తి చేశారు.

ఒమన్‌పై దాడి చేయని ఇరాన్!

గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్‌లోని అన్ని అరబ్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై క్షిపణులు ప్రయోగించిన ఇరాన్.. ఒక్క ఒమన్‌పై మాత్రం ఎలాంటి దాడి చేయలేదు. చాలా కాలం నుంచి ఇరాన్‌కు, ఇతర దేశాలకు మధ్యవర్తిగా ఒమన్ కొనసాగుతోంది. ప్రస్తుతం జెనీవాలో జరుగుతున్న అమెరికా-ఇరాన్ చర్చల్లోనూ ఒమన్ మధ్యవర్తిగా ఉంది.

హార్ముజ్‌లో నిలిచిన రాకపోకలు

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితి నేపథ్యంలో హార్ముజ్ జలసంధిలో రాకపోకలపై ప్రభావం పడింది. జల సంధిలో ప్రయాణాలను నిలిపివేయాలని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించినట్టు వాణిజ్య నౌకలను నిర్వహించే సంస్థలు తెలిపాయి. దీనితో చమురు సహా ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడనుంది. అయితే జల సంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు హార్ముజ్ జలసంధి, అరేబియా సముద్ర ఉత్తర ప్రాంతానికి దూరంగా ఉండాలని అమెరికా రవాణా శాఖ వాణిజ్య నౌకలకు సూచనలు జారీ చేసింది. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లోని అమెరికా నౌకలకు కనీసం 30 నాటికల్ మైళ్లకుపైగా దూరంలో ఉండాలని, లేకుంటే శత్రునౌకలుగా భావించి, చర్యలు చేపట్టే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఆయుధాలను వీడండి.. లేదంటే మృత్యువును చూడండి

ఇరానీ దళాలకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ఇరాన్‌పై భారీ యుద్ధాన్ని ప్రారంభించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ పాలకుల నుంచి వచ్చిన హెచ్చరికల నుంచి అమెరికా ప్రజలను కాపాడడమే తమ లక్ష్యమని చెప్పారు. దశాబ్దాల తరబడి అమెరికా ప్రయోజనాలు, ప్రజలకు వ్యతిరేకంగా ఇరాన్ వ్యవహరిస్తోందని, దానిని ఇంకెంతమాత్రం కొనసాగించబోమని తెలిపారు. ఈ సందర్భంగా ఇరాన్ భద్రతా బలగాలకు ట్రంప్ గట్టి హెచ్చరిక చేశారు. "రివల్యూషనరీ గార్డులు, భద్రతా బలగాలకు ఒకటే చెబుతున్నా. ఆయుధాలను విడిచిపెట్టండి. లేకుంటే మృత్యువును చూస్తారు. ఆయుధాలను విడిచిపెడితే పూర్తి రక్షణ ఇచ్చి గౌరవంగా చూస్తాం. లేకుంటే చావును చూడండి" అని స్పష్టం చేశారు. ఇరాన్ క్షిపణులను ధ్వంసం చేస్తామని, క్షిపణుల పరిశ్రమను నేలమట్టం చేస్తామని.. నేవీని నామరూపాలు లేకుండా చేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో అమెరికన్లను నష్టం జరిగే ప్రమాదం ఉందని అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారు. "వీరులైన అమెరికన్ హీరోలు ప్రాణాలు కోల్పోవచ్చు. గాయపడవచ్చు. యుద్ధంలో ఇలాంటివి తప్పవు. తక్షణ అవసరాల కోసం యుద్ధం చేయడం లేదు. భవిష్యత్తు కోసం, ఉదాత్త ఆశయం కోసం చేస్తున్నాం" అని తెలిపారు. ఇరాన్ చేతిలో అణ్వాయుధాలు ఉండకూడదన్నదే అమెరికా దీర్ఘకాలిక విధానమని తెలిపారు. ఇరానియన్లను ఉద్దేశించి మాట్లాడుతూ స్వేచ్ఛ మీ చేతుల్లోనే ఉందని అన్నారు. "ఇళ్లను వీడొద్దు. ప్రతి చోటా బాంబులు పడతాయి. మేం పని ముగించిన తరువాత ప్రభుత్వాన్ని చేతుల్లోకి తీసుకోండి" అని చెప్పారు.


ఖమేనీ ఆఫీసు ప్రాంతంలో పొగ

ఖమేనీ నివాసానికి సమీపంలో పేలుడు

టెహ్రాన్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ నివాసం, ప్రధాన కార్యాలయం సమీపంలోనే తొలి క్షిపణి దాడి జరిగింది. తర్వాత ఆ దేశ సైన్యం ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయానికి సమీపంలో భారీ పేలుళ్లు జరిగాయి. అనంతరం ఏకకాలంలో టెహ్రాన్‌లోని మరికొన్ని ప్రాంతాలతోపాటు కీలకమైన తబ్రిజ్, ఇస్ఫహాన్ పట్టణాలు, బుషెహర్, మినాబ్‌లలోని ఇరాన్ నౌకాదళ స్థావరాలు, మరి కొన్ని చోట్ల కూడా భారీగా క్షిపణి దాడులు జరిగాయి. కీలకమైన చబహార్ పోర్టు వద్ద కూడా భారీగా పేలుళ్లు జరిగాయి. శనివారం ఉదయం కాసేపు దాడులు చేసి ఆపేసిన అమెరికా, ఇజ్రాయెల్ రాత్రికి మళ్లీ దాడులు ప్రారంభించాయి. ఇరాన్ మిలటరీ బలానికి కీలకమైన క్షిపణి ప్రయోగ వ్యవస్థలను ధ్వంసం చేయడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాయి. కాగా, చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 200 యుద్ధ విమానాలతో దాడులు చేశామని, 500కుపైగా లక్ష్యాలను ఛేదించామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, లాంఛర్లను ధ్వంసం చేసి.. తర్వాతి దాడులకు మార్గం సుగమం చేశామని తెలిపింది.

బద్ధ శత్రువులుగా ఒకనాటి మిత్రులు

1979కి ముందు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య స్నేహం.. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవంతో మారిన పరిస్థితి

» ఇజ్రాయెల్‌ను శత్రువుగా ప్రకటించిన ఇరాన్

» ఇరాన్‌తో తన మనుగడకే ముప్పు ఉందని ఇజ్రాయెల్ భావన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న శత్రుత్వం పశ్చిమాసియాను మరోసారి తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ఇరాన్‌ను అణచివేసేందుకు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో అమెరికా, ఆపరేషన్ రోరింగ్ లయన్ పేరుతో ఇజ్రాయెల్ శనివారం నుంచి దాడులు మొదలుపెట్టాయి. ఇరాన్ కూడా ప్రతి దాడులు చేస్తోంది. అయితే, ఈ దేశాల మధ్య మొదటి నుంచి శత్రుత్వం లేదు. కొన్ని దశాబ్దాల క్రితం ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాలు మామూలుగానే ఉండేవి. ఒకరకంగా చెప్పాలంటే ఈ దేశాలు నాడు మంచి మిత్రులు. 1979కి ముందు ఇరాన్‌ను పాలించిన రాజు మొహమ్మద్ రెజా షా పహ్లవీ.. ఇజ్రాయెల్, అమెరికాతో మంచి సంబంధాలు నెలకొల్పారు. నాడు ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ క్షిపణులను అభివృద్ధి చేసే కార్యక్రమం కూడా చేపట్టింది. ఈ రెండు దేశాల మధ్య మంచి వాణిజ్య సంబంధాలుండేవి. ఇరాన్ రాజుకు అమెరికా నుంచి అన్ని విషయాల్లో మద్దతు లభించేంది.

ఇస్లామిక్ విప్లవంతో పరిస్థితి తలక్రిందులు

ఇరాన్‌లో చమురు నిల్వలపై 1950-60ల్లో అమెరికా సహా పశ్చిమ దేశాల గుత్తాధిపత్యం పెరగటం, 1979లో సంభవించిన ఇస్లామిక్ విప్లవంతో ఈ దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా మారిపోయాయి. అయతొల్లా రొహొల్లా ఖమేనీ నాయకత్వంలో ఇరాన్‌లో 1979లో ఇస్లామిక్ తిరుగుబాటు సంభవించింది. దీంతో రాజు రెజా పహ్లవీ దేశం విడిచి పారిపోయాడు. దేశానికి సర్వాధికారిగా మారిన ఖమేనీ.. ఇజ్రాయెల్‌ను శత్రుదేశంగా ప్రకటించారు. ఇరాన్‌లో అమెరికా సహా పశ్చిమదేశాల ప్రభావాన్ని పూర్తిగా తుడిచిపెట్టేశారు. 1979 నవంబరులో టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఆందోళనకారులు దాడి చేసి 52 మంది అమెరికా దౌత్యవేత్తలను బందీలుగా పట్టుకున్నారు. దీంతో అమెరికా కూడా ఇరాన్‌కు శత్రువుగా మారిపోయింది.



అణు భయాలతో మరింత శత్రుత్వం

1980ల తర్వాత ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరిస్థితి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి దిగజారింది. ఇరాన్ అణుబాంబును తయారు చేస్తోందని ఇజ్రాయెల్ ఆరోపించటం, అరబ్ దేశాల్లో ఇరాన్ తన ప్రాభవాన్ని పెంచుకొనేందుకు హెజ్బొల్లా, హమాస్, ఇతర మిలీషియా గ్రూపులను పెంచి పోషించటంతో రెండు దేశాల మధ్య పరోక్ష యుద్ధం మొదలైంది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బ తీసేందుకు ఆ దేశ శాస్త్రవేత్తలను ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ చంపివేసిందనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు లెబనాన్‌లో హెజ్బొల్లాను, గాజాలో హమాస్‌ను, ఇరాక్-సిరియాల్లో స్థానిక మిలీషియా గ్రూపులను ఇరాన్ రెచ్చగొట్టి తమపైకి దాడులకు ఉసిగొల్పుతోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. పరిస్థితి విషమించి గత ఏడాది జూన్ 13 నుంచి 24 వరకు 11 రోజులపాటు ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పరం భీకర దాడులు చేసుకున్నాయి. పశ్చిమాసియాలో తన మిత్రదేశాలైన ఇజ్రాయెల్, సౌదీ, ఖతార్ వంటి వాటికి ఇరాన్ నుంచి ముప్పు ఉందని ఆరోపిస్తూ అమెరికా కూడా ఆ దేశాన్ని నియంత్రించేందుకు బలప్రయోగానికి దిగుతోంది. హార్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకోకుండా కాపాడటం కూడా ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం చేసుకోవటానికి ఒక కారణం.


బాంబు దాడుల భయంతో జెరూసలేంలో దాక్కున్న చిన్నారి

లోకం తీరు



ఆంథ్రోపిక్ ఔట్.. ఓపెన్‌ఏఐ ఇన్!

అమెరికా యుద్ధ విభాగంతో ఓపెన్ ఏఐ ఒప్పందం

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ప్రముఖ ఏఐ స్టార్టప్ సంస్థ 'ఆంథ్రోపిక్, అమెరికా ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా యుద్ధ విభాగం (డీవోడబ్ల్యూ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మరో కృత్రిమ మేధ కంపెనీ 'ఓపెన్‌ఏఐ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ శామ్ ఆల్ట్‌మన్ ప్రకటించారు. వారి క్లాసిఫైడ్ మిలటరీ నెట్‌వర్క్‌లకు తమ ఏఐ మోడళ్లను సరఫరా చేస్తామని వెల్లడించారు. ఏఐ భద్రత, దాని ప్రయోజనాల విస్తృత పంపిణీ తమ మిషన్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. దేశీయ సామూహిక నిఘాపై నిషేధం, స్వయం ప్రతిపత్తి ఆయుధ వ్యవస్థలతో సహా బలప్రయోగానికి మానవ బాధ్యత అనేది తమ రెండు ముఖ్యమైన భద్రతా సూత్రాలు అని 'ఎక్స్' పోస్టులో తెలిపారు. ఈ సూత్రాలను డీవోడబ్ల్యూ అంగీకరించిందని, వాటిని తమ ఒప్పందంలో చేర్చినట్లు వెల్లడించారు. ఆంథ్రోపిక్ ఏఐ టెక్నాలజీని వినియోగించడాన్ని అన్ని ప్రభుత్వ సంస్థలు ఆపేయాలని ట్రంప్ శుక్రవారం ఆదేశించిన నేపథ్యంలో ఈ ప్రకటన రావడం గమనార్హం. ఈ విషయంలో ట్రంప్ రక్షణ శాఖకు ఆరు నెలల సమయం ఇచ్చారు. వామపక్ష భావజాలమున్న ఒక కంపెనీ తమ సైన్యం యుద్ధాల్లో ఎలా పోరాడాలని, ఎలా గెలవాలనే దాన్ని నిర్దేశించేందుకు అనుమతించబోమన్నారు. ఆంథ్రోపిక్ ఏఐ క్లాడ్ మోడల్స్‌ను అమెరికా మిలటరీ అపరిమితంగా, ఎలాంటి నియంత్రణలు లేకుండా వినియోగించుకొనేందుకు యాక్సెస్ ఇవ్వాలన్న ట్రంప్ డిమాండ్‌కు ఆ కంపెనీ తిరస్కరించడంతో వివాదం రాజుకుంది. శుక్రవారం వరకు విధించిన డెడ్‌లైన్ ముగియడంతో.. ట్రంప్ తాజా ఆదేశాలు జారీచేశారు. తమ కంపెనీ ప్రోడక్టులను దాని భద్రతా చర్యలను ఉల్లంఘించే విధంగా ఉపయోగించవచ్చనే ఆందోళనపై ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ వెనక్కి తగ్గలేదు. దీంతో తమకు ఆంథ్రోపిక్ టెక్నాలజీ అవసరం లేదని, ఆ కంపెనీతో మరోసారి వ్యాపారం చేయబోమని ట్రంప్ సోషల్ మీడియాతో ప్రకటించారు.

టొమాహాక్‌లు, బంకర్ బస్టర్లు, బాలిస్టిక్ క్షిపణులు

ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాన్ని నడిపిస్తున్న ఆయుధాలు ఇవే!





టెహ్రాన్, ఫిబ్రవరి 26: ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన టొమాహాక్ క్రూయిజ్ క్షిపణులు అత్యంత తక్కువ ఎత్తులో ప్రయాణించి ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను చేధించాయి. రాడార్లకు చిక్కని ఎఫ్-35ఐ అదిర్ స్టెల్త్ యుద్ధ విమానాలు, భూగర్భంలోని బంకర్లను చీల్చుకుపోయే జీబీయూ-28 బంకర్ బస్టర్ బాంబులు ఇరాన్‌లోని టెహ్రాన్, ఇస్ఫహాన్ వంటి ప్రధాన నగరాల్లోని వ్యూహాత్మక స్థావరాలను ధ్వంసం చేశాయి. వీటితో పాటు ఇజ్రాయెల్ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన రాంపేజ్, డెలిలా క్షిపణులు, జీపీఎస్ సిగ్నల్స్ లేకున్నా లక్ష్యాన్ని చేధించే స్పైస్ స్మార్ట్ బాంబులు ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించాయి. ఈ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా తన బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. షహాబ్-3, ఎమాద్ వంటి శక్తిమంతమైన బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్ సరిహద్దులపై దాడి చేసింది. అంతేకాకుండా బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఇలా ఇరుపక్షాలు అత్యాధునిక సాంకేతికత కలిగిన క్షిపణులు, బాంబులను వాడడంతో పశ్చిమాసియా భగ్గుమంది.

యుద్ధం కొనసాగితే.. సంక్షోభమే!



ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోయే అవకాశం

హోర్ముజ్ జలసంధిని అడ్డుకుంటే చమురు ధరలు పైపైకి

మన చమురు దిగుమతుల్లో సగం హోర్ముజ్ మీదుగానే

(సెంట్రల్‌డెస్క్)

ఇరాన్ మీద అమెరికా-ఇజ్రాయెల్ చేపట్టిన సంయుక్త దాడి ప్రభావం యావత్ ప్రపంచం మీద పడే సూచనలు కనిపిస్తున్నాయి. చమురు ధరలు పెరిగిపోయి, ఫలితంగా నిత్యావసరాల ధరలూ ఆకాశన్నంటే ప్రమాదం ఉంది. స్టాక్‌మార్కెట్ల మీద, బంగారం, వెండి ధరలపైనా తీవ్రమైన ప్రభావం ఉండే అవకాశం ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఇరాన్ తన చమురు నిల్వలను స్వేచ్ఛగా విక్రయించకుండా అమెరికా ఆంక్షలు విధిస్తోంది. అయినప్పటికీ, నేటికీ టాప్ 10 చమురు ఉత్పత్తి దేశాల్లో ఇరాన్ ఉంది. 1974లో ఇరాన్ చమురు ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 60 లక్షల బ్యారెళ్లు కాగా, ప్రస్తుతం ఆంక్షల కారణంగా అది 31 లక్షల బ్యారెళ్లకు తగ్గింది. వీటిలో 13 నుంచి 15లక్షల బ్యారెళ్లను ఎగుమతి చేస్తోంది. ఇరాన్ మీద దాడుల కారణంగా.. ఆ దేశం నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోయే పరిస్థితి తలెత్తుతోంది. అంతేకాదు, ప్రపంచంలోని చమురు నిల్వల్లో మూడోవంతు ఇరాన్‌లోనే ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోగించే క్షిపణులు, బాంబుల దాడుల్లో అవి ధ్వంసమైతే.. నష్టం ఒక్క ఇరాన్‌కే కాదు.. యావత్ ప్రపంచానికి ఉంటుంది.

హోర్ముజ్ జలసంధి అడ్డగింత!

ఇరాన్ దగ్గరున్న బ్రహ్మాస్త్రం హోర్ముజ్ జలసంధి. ఇరాన్‌కు ఒమన్‌కు మధ్య ఉండే ఈ జలసంధి ప్రపంచంలోనే అత్యంత రద్దీ జలమార్గం. 2024లో హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రతి రోజూ 2కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. ఇది ప్రపంచ చమురు వినియోగంలో దాదాపు 20%. హోర్ముజ్ జలసంధి చాలా ఇరుగ్గా ఉంటుంది. వెడల్పు కేవలం 50 కి.మీ.లు. భౌగోళికంగా ఉన్న ఈ పరిమితుల దృష్ట్యా ఆ జలసంధిని నియంత్రించటం చాలా సులువు. అమెరికా గతంలో ఆంక్షలు విధించినప్పుడు, దాడులు జరిపినప్పుడు ఇరాన్ ఈ జలసంధిని పలుమార్లు అడ్డుకుంది. ఫలితంగా, చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడు కూడా ఆ పరిస్థితి తలెత్తవచ్చు. ఈ విధంగా.. చమురు రవాణా తగ్గిపోయి, నిల్వలకు కొరత ఏర్పడి.. బ్యారెల్ ధర ఏకంగా 100 డాలర్లకు కూడా చేరుకునే అవకాశం ఉందని వాణిజ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు (ప్రస్తుతం ఇది 73 డాలర్లుగా ఉంది). చమురు ధర పెరిగితే ఆహారం, నిర్మాణ రంగం తదితర అన్ని రంగాల్లోనూ ధరలు పెరుగుతాయి.

భారత్‌పై ప్రత్యక్ష ప్రభావం

భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురు నిల్వల్లో దాదాపు సగం(రోజుకు 26 లక్షల బ్యారెళ్లు) హోర్ముజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతున్నాయి. కాబట్టి, ఈ జలసంధిలో ఎటువంటి అంతరాయం తలెత్తినా మన చమురు వినియోగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. యూఏఈ, సౌదీఅరేబియా, ఇరాక్, కువైట్, ఖతార్, ఇరాన్ దేశాలకు భారత్ నుంచి వెళ్లే చమురుయేతర ఎగుమతుల్లో దాదాపు 13.2% హోర్ముజ్ జలసంధి మీదుగానే వెళ్తుంటాయి. వీటి విలువ 36,000 కోట్ల డాలర్లు. ఇంత భారీ ఎగుమతులూ దెబ్బతినే ప్రమాదం ఉంది. స్టాక్‌మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం పడే సూచనలు కనిపిస్తున్నాయి.

అబుదాబిలో చిక్కుకున్న తెలుగువాళ్లు

100 మందికిపైగా విమానాశ్రయంలోనే!

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి ఇండియాకు బయలుదేరిన సుమారు 100 మందికి పైగా తెలుగువాళ్లు అబుదాబి విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. అమెరికా నుంచి బయలుదేరిన ఇతిహాద్ విమానం మార్గమధ్యలో అబుదాబి విమానాశ్రయంలో ఆగింది. అక్కడి నుంచి శనివారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయానికి చేరాల్సిన ఈ విమానం ఇరాన్ వైమానిక దాడుల కారణంగా అబుదాబిలోనే ఆగిపోయింది. అబుదాబి విమానాశ్రయం సమీపంలోనే శనివారం మధ్యాహ్నం వైమానిక దాడులు జరిగాయి. దీంతో అబుదాబి గగనతలాన్ని మూసివేశారు.



ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న నటుడు మంచు విష్ణు ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియోలో క్షిపణి దూసుకువస్తున్న చిత్రం

ఇరాన్‌పై దాడితో గగనతలాల మూసివేత

ఎయిర్‌స్పేస్‌ను మూసివేసిన 8దేశాలు

న్యూఢిల్లీ, దుబాయి, టెహ్రాన్, ఫిబ్రవరి 28: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడులు.. ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో పశ్చిమాసియా దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. ఇరాన్, ఇజ్రాయెల్, ఇరాక్, జోర్డాన్, ఖతార్, బహ్రెయిన్, కువైట్, యూఏఈ, సిరియాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్టు ప్రకటించాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాకు అన్ని విమానాల రాకపోకలను మార్చి 1 వరకు నిలిపివేస్తున్నట్టు శనివారం ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా ప్రకటించాయి. ఇజ్రాయెల్ గగనతలం మూసివేసినందున ఢిల్లీ-టెల్‌అవీవ్ విమానం ముంబైకి తిరిగి వచ్చినట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. మార్చి1న యూరప్, యూఎస్, కెనడాలోని వివిధ నగరాలను కలిపే 28 విమానాలను రద్దు చేసినట్టు పేర్కొంది. అబుదాబి, దోహా, జెద్దా, కువైత్, రియాద్‌లకు తమ విమానాల రాకపోకలను మార్చి 2 వరకు నిలిపివేస్తున్నట్టు ఆకాశ ఎయిర్ వెల్లడించింది. కాగా, గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయ పౌరులు జాగ్రత్తగా ఉండాలని ఆయా దేశాల్లోని భారత ఎంబసీలు సూచించాయి. ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్, జోర్డాన్, కువైత్, ఖతార్ దేశాల గగనతలాలకు మార్చి 2వరకు దూరంగా ఉండాలని డీజీసీఏ భారత ఎయిర్ లైన్స్ సంస్థలకు సూచించింది

వేలాది మంది విమానాశ్రయాల్లోనే

గల్ఫ్ దేశాలు తమ గగనతలాలను మూసివేయడంతో ఆ దేశాల్లోని ప్రధాన విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. దుబాయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వంటి ప్రధాన హబ్‌లకు రాకపోకలు సాగించే విమానాలు రద్దవడంతో వేలాదిగా ప్రయాణికులు టెర్మినళ్ల వద్ద చిక్కుకుపోయే పరిస్థితి నెలకొంది. దుబాయి విమానాశ్రయంలో ఎయిర్‌లైన్ సంస్థల డెస్కుల వద్ద ప్రయాణికులు టికెట్ల రిఫండ్స్, తిరిగి బుకింగ్, ప్రాథమిక సమాచారం కోసం బారులుతీరారు. తాజా పరిణామాల నేపథ్యంలో విమానాశ్రయాలు, విమానయాన సంస్థలు సహా ఏవియేషన్ భాగస్వాముల సంసిద్ధతపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు శనివారం సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

దుబాయ్ ఎయిర్‌పోర్టులోనే సింధు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: ఇరాన్‌లో యుద్ధం నేపథ్యంలో ప్రపంచ దేశాలన్నీ గల్ఫ్‌కు విమాన రాకపోకలపై ఆంక్షలను ప్రకటించడంతో విమాయాన వ్యవస్థ స్తంభించిపోయింది. ఒక్క రోజులో 834 విమానాలను రద్దు చేయగా అందులో 615 విమానాలు యూఏఈకి చెందినవే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి న్యూయార్క్, సింగపూర్, ఫ్రాంక్‌ఫర్ట్, నైరోబి నుంచి లండన్‌కు వెళ్లాల్సిన ప్రతి విమానంపై ప్రభావం పడింది. గల్ఫ్ దేశాలకు మాత్రమే కాక అమెరికా, ఐరోపా దేశాలకు భారతీయుల రాకపోకలు తాత్కాలికంగా స్తంభించిపోయాయి. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ కోసం బర్మింగ్‌హామ్ బయలుదేరిన భారత స్టార్ షట్లర్ విమాన సర్వీసు రద్దుతో దుబాయ్ విమానాశ్రయంలో ఇరుక్కుపోయారు. ఇక, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగించే 44 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. అలాగే అదే ప్రాంతాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 21 విమాన సర్వీసులు కూడా రద్దయ్యాయి.

ట్రయల్ కోర్టు తీర్పు చట్టవిరుద్ధం, రద్దు చేయండి

ఢిల్లీ హైకోర్టులో సీబీఐ అప్పీలు

మార్చి 9న విచారణ !

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు తీర్పు పూర్తిగా చట్టవిరుద్ధమని, వితండవాదంతో కూడుకున్నదని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. నిందితులకు వ్యతిరేకంగా తాము సమర్పించిన ఆధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించింది. అసలు విచారణ ప్రారంభం కాకముందే న్యాయాధికారి ఒక మినీ ట్రయల్ నిర్వహించి నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చారని అభ్యంతరం వ్యక్తం చేసింది. నిందితులు చేసిన నేరాన్ని స్పష్టంగా చూపే సాక్ష్యాధారాలను కోర్టు పక్కనపెట్టిందని, న్యాయస్థానం ఉత్తర్వుల్లో ప్రాథమికంగానే అనేక లోపాలు కనిపిస్తున్నాయని, ముఖం చూస్తేనే తెలిసే తప్పుల వలే తీర్పు ఉందని సీబీఐ విమర్శించింది. ఎక్సైజ్ కుంభకోణంలో నిందితుల పాత్రపై తమ వద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని, వాటిని విస్మరించడం న్యాయ విరుద్ధమని పేర్కొంటూ దిగువ కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరింది. సీబీఐ పిటిషన్‌పై మార్చి9న విచారణ జరిగే అవకాశముంది.

నేల సరిగ్గా కనిపించకే బారామతిలో విమాన ప్రమాదం

ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: విమానం నుంచి రన్ వే సరిగ్గా కనిపించకపోవడమే మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలింది. జనవరి 28న జరిగిన ఈ విమాన ప్రమాదంలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా నలుగురు మరణించిన విషయం విదితమే. ఇందుకు సంబంధించిన ప్రాథమిక దర్యాప్తు నివేదికను విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) శనివారం విడుదల చేసింది. విజిబిలిటీ సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉండడమే ప్రమాదానికి కారణమని తెలిపింది. రన్‌వేపై రంగుతో రాసిన గీతలు చెరిగిపోవడం, కంకర రాళ్లు తేలడం వల్ల కూడా పైలట్‌కు ఇబ్బందులు తెచ్చి పెట్టి ఉంటాయని అభిప్రాయపడింది. విజిబిలిటీ మార్కర్లు కనీసం 5,000 మీటర్లు (5 కి.మీ.) మేర కనిపించాల్సి ఉండాల్సి ఉండగా, ఆ రోజున 3,000 మీటర్ల వరకే ఉన్నట్టు బారామతిలోని టవర్ నుంచి పైలట్‌కు సమాచారం అందింది. రన్‌వేపై 2016లో తారు పూయడం వంటి రీ-కార్పెటింగ్ పనులు చేయగా, ఆ తరువాత మళ్లీ చేయలేదని దాంతో రంగులతో రాసిన గుర్తులు చెరిగిపోయి కంకరరాళ్లు తేలినట్టు నిర్ధారించింది. ఆ విమానం ఒక ప్రయాణాన్ని ముగించుకొని తిరిగి ముంబయి చేరుకున్న అనంతరం తనిఖీలు జరగగా, టెక్నీషియన్‌కు ఎలాంటి అసాధారణ లోపాలు కనిపించలేదని తెలిపింది.

63.66 లక్షల ఓట్లు తొలగింపు

మరో 60 లక్షల ఓట్లపై న్యాయ పరిశీలన

బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రకటించిన ఈసీ



కోల్‌కతా, ఫిబ్రవరి 28: ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) తర్వాత పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ జాబితా నుంచి 63.66 లక్షల ఓట్లను తొలగించినట్లు ఆ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) మనోజ్‌కుమార్ అగర్వాల్ శనివారం ప్రకటించారు. మరో 60.06 లక్షల ఓట్లకు సంబంధించి త్వరలో న్యాయపరమైన పరిశీలన చేపడుతామని వెల్లడించారు. గత ఏడాది నవంబరులో ప్రారంభమైన ఎస్ఐఆర్ ముగియటంతో శనివారం ఆయన మీడియా సమావేశంలో ఓటర్ జాబితా వివరాలు వెల్లడించారు. ఎస్ఐఆర్ చేపట్టడానికి ముందు రాష్ట్రంలో 7.66 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 7.04 కోట్లకు తగ్గినట్లు వివరించారు.

మమత నియోజకవర్గంలోనూ కోత

రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 47 వేల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. మరో 14వేల మంది పేర్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దక్షిణ కోల్‌కతాలోని భవానీపూర్ మమత కంచుకోట. ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలయ్యే సమయానికి ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 2.06 లక్షల మంది. వీరిలో 44,786 మంది పేర్లు డిసెంబరు 16న ప్రచురించిన ముసాయిదా జాబితాలో లేవు. మరో 2,324 మంది పేర్లు తొలగిస్తూ, శనివారం తుది జాబితాను ఈసీ విడుదల చేసింది. అంటే.. మొత్తం 47 వేలమందిని తొలగించారన్న మాట. భవానీపూర్‌లో మమతకు గత ఎన్నికల్లో 58 వేల ఓట్ల ఆధిక్యత లభించడం గమనార్హం.

మోగనున్న భేరి

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి మార్చి రెండో వారంలో ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మూడు విడతలుగా పోలింగ్ జరగొచ్చునని ఆ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎన్నికల సంఘం పూర్తి బృందం ఆదివారం కోల్‌కతాలో పర్యటించనున్నదన్న వార్తలను ఈ వర్గాలు ఖండించాయి. హోలీ తర్వాతే ఈ టీమ్ రాష్ట్రానికి రానున్నదని తెలిపాయి.

సిమ్ ఉన్న ఫోన్లోనే వాట్సాప్

ఇతర మెసేజింగ్ యాప్‌లకు కూడా సిమ్ బైండింగ్

ఫోన్ నుంచి సిమ్ తీస్తే ఆ యాప్‌లు బంద్

నేటి నుంచి కొత్త నిబంధన అమలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఒక ఫోన్‌లో సిమ్ వేసి వాట్సాప్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వాడుకుంటూ, మళ్లీ అదే సిమ్ నంబర్‌తో మరో ఫోన్‌లో మళ్లీ వాట్సాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రెండు ఫోన్లలో కూడా వాట్సాప్‌ను వాడుకుందామంటే ఇకపై కుదరదు. ఏ ఫోన్‌లో రిజిస్టర్డ్ సిమ్ ఉంటుందో ఆ ఫోన్‌లో మాత్రమే వాట్సాప్ పనిచేస్తుంది. ఒక్క వాట్సాప్‌కే కాదు.. టెలిగ్రాం, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియో చాట్, అరట్టై, జోష్ వంటి కమ్యూనికేషన్ యాప్‌లు అన్నింటికి కూడా ఈ సిమ్ బైండింగ్ నిబంధన మార్చి 1 నుంచి అమలవుతుంది. ఇప్పటికే ఈ విషయంలో గత నవంబరు 28న డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను అమలు చేయడానికి మెసేజింగ్ ప్లాట్‌ఫాంలకు 90 రోజులు గడువు ఇచ్చింది. ఆ గడువు ఫిబ్రవరి 28తో పూర్తయింది. దీంతో కొత్త నిబంధనలను ఆదివారం నుంచి మెసేజింగ్ యాప్స్ కచ్చితంగా పాటించాలి. ఆ నిబంధనల ప్రకారం, సిమ్ లేకుండా మొబైల్‌లో వాట్సాప్ వంటి మెసేజింగ్ యాప్స్ వాడుతున్న వారికి వాటి సేవలు నిలిచిపోతాయి. ఫోన్ నుంచి సిమ్ తీసినా, స్వాపింగ్ చేసినా, డీయాక్టివేట్ చేసినా ఆ యాప్‌లు ఆగిపోతాయి. మళ్లీ ఒరిజినల్ సిమ్ వేసి ఆథంటికేషన్ చేసినప్పుడే అవి తిరిగి పనిచేస్తాయి. అలాగే డెస్క్ టాప్ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల్లో వాట్సాప్ వెబ్, టెలిగ్రామ్ వెబ్ వంటివి కూడా ప్రతి 6 గంటలకు ఓసారి ఆటోమేటిక్‌గా లాగ్ అవుట్ అయిపోతాయి. మళ్లీ యాక్టివ్ అవ్వాలంటే సిమ్ ఉన్న ఫోన్‌తో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆథంటికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సైబర్ నేరాలను, సిమ్ స్వాపింగ్ స్కామ్‌లను, వ్యక్తుల గుర్తింపు తెలియకుండా చేసే సైబర్ దాడులను నియంత్రించడానికి ఈ కొత్త నిబంధన తీసుకొచ్చినట్లు కేంద్రం చెప్పింది. సిమ్ బైండింగ్ ద్వారా నేరగాళ్లను గుర్తించే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతకు ఉపయోగపడే ఈ నిబంధన గడువును పొడిగించే అవకాశం ఎంతమాత్రం లేదని సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఇప్పటికే స్పష్టంగా చెప్పారు. బహుళ పరికరాలను వినియోగించే వారికి, తరచుగా ప్రయాణాలు చేసే వారికి ఈ నిబంధన ఇబ్బందికరంగా ఉంటుందని మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఆందోళన వ్యక్తం చేసినా వినియోగదారుల భద్రత ముఖ్యమని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది.

331 మంది తాలిబాన్లను చంపేశాం

పాకిస్థాన్ ప్రకటన.. చర్చలకు సిద్ధమన్న తాలిబాన్లు

పాక్ మంచిపని చేస్తోంది: అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 28: భూతల, వైమానిక దాడుల ద్వారా 331 మంది అఫ్గానిస్థాన్ తాలిబాన్ ఫైటర్లను చంపేశామని పాకిస్థాన్ శనివారం ప్రకటించింది. వీరిలో తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ), అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ తదితర సంస్థల ఉగ్రవాదులు కూడా ఉన్నట్లు పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతొల్లా తరార్ వెల్లడించారు. అఫ్గానిస్థాన్‌పై ఘజబ్ లిల్ హక్ పేరుతో పాకిస్థాన్ సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సరిహద్దుల్లోని 104 అఫ్గాన్ మిలిటరీ పోస్టులను పూర్తిగా ధ్వంసం చేసి, 22 పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు తరార్ చెప్పారు. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం స్పందించారు. ఆయన పాకిస్థాన్ చర్యకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాకిస్థాన్ మంచిపనే చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌తో విబేధాలను శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ శనివారం తెలిపారు.

ఈ ఎండాకాలం ఎండలు ఎక్కువే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని పలు ప్రాంతాలకు ఎండలు మండే కాలం ఎదురుకానుంది. మార్చి-మే నెలల మధ్య ఈ ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం ప్రకటించింది. నెలవారీ వాతావరణ వివరాలను విడుదల చేసిన ఆ శాఖ రానున్నది కష్టకాలమేనని తెలిపింది. "మార్చి-ఏప్రిల్- మే (ఎంఏఎం) సీజన్‌లో వేడి గాలులు అధికంగా ఉంటాయి. ప్రజారోగ్యం, విద్యుత్తు, నీటి వనరులపై దీని ప్రభావం ఉంటంది. ఎండల్లో పని చేసేవారు, పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్థులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది" అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర చెప్పారు. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగానే ఉంటాయని అన్నారు. మార్చిలో కొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షాలు కురవనుండడంతో వాతావరణం చల్లబడుతుందని తెలిపారు.

స్వలింగ సంపర్కురాలికి టీఎంసీ రాజ్యసభ టికెట్

మేనక గురుస్వామి పేరు ప్రకటన



కోల్‌కతా, ఫిబ్రవరి 28: స్వలింగ సంపర్కురాలిగా తనను తాను ప్రకటించుకున్న సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామికి పశ్చిమబెంగాల్ నుంచి అధికార టీఎంసీ రాజ్యసభ టికెట్ కేటాయించింది. ఆమెతోపాటు ఆ రాష్ట్ర మంత్రి బాబుల్ సుప్రియో, బెంగాల్ మాజీ డీజీపీ రాజీవ్‌కుమార్, నటుడు కోయల్ మల్లిక్‌లను ఎంపిక చేసింది. ఈ నెల 16న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిస్తే పార్లమెంటులో అడుగుపెట్టే తొలి స్వలింగ సంపర్కురాలి (ఎల్జీబీటీక్యూ)గా మేనక గోస్వామి రికార్డు నెలకొల్పుతారు. స్వలింగ సంపర్కం నేరం కాదని 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ కేసును వాదించిన న్యాయవాదుల్లో మేనక కూడా ఉన్నారు. న్యాయవాదిగా 1997లో కెరీర్ ప్రారంభించిన మేనక.. మొదట మాజీ అటార్నీ జనరల్ అశోక్ దేశాయ్ వద్ద జూనియర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో బీసీఎల్, హార్వర్డ్ వర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. 2019లో ఫారిన్ పాలసీ మేగజైన్ ప్రకటించిన ప్రపంచంలోని 100 మంది గొప్ప మేధావుల జాబితాలో మేనక చోటు సంపాదించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ రోడ్స్ హౌస్‌లోని మిల్నర్ హాల్‌లో ఆమె చిత్రపటాన్ని అలంకరించారు. ఈ గౌరవం పొందిన మొదటి భారతీయురాలు, రెండో మహిళ మేనకనే కావటం విశేషం.

యూత్ కాంగ్రెస్ చీఫ్‌కు ఇలా బెయిల్.. అలా స్టే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద ఆందోళన చేశారన్న కారణంతో అరెస్టయిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్‌కు శనివారం ఒక కోర్టు బెయిల్ ఇవ్వగా, వెంటనే మరో కోర్టు స్టే విధించింది. తొలుత మేజిస్ట్రేటు కోర్టు పలు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. అన్ని పత్రాలు, బాండ్లు పరిశీలించిన అనంతరం ఆదివారం ఉదయం జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. దీనిపై వెంటనే పోలీసులు అదనపు సెషన్స్ కోర్టులో అప్పీలు చేయగా అక్కడ స్టే లభించింది. తదుపరి విచారణ మార్చి ఆరో తేదీకి వాయిదా పడింది. జీవించే హక్కు, స్వేచ్ఛ.. రాజ్యాంగం ఆత్మ అని పేర్కొన్న మేజిస్ట్రేటు కోర్టు... కేవలం ఊహల ఆధారంగా ఎవరి స్వేచ్ఛనూ హరించలేరని వ్యాఖ్యానిస్తూ బెయిల్ మంజూరు చేసింది. దీనిపై ఢిల్లీ పోలీసులు వెంటనే అదనపు సెషన్స్ జడ్జి అమిత్ బన్సల్ వద్ద అప్పీలు చేయగా, చిబ్ బెయిల్ ఉత్తర్వులు అమలు కాకుండా స్టే ఇచ్చారు.

దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: మహిళల్లో గర్భాశాయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్) నివారణ చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రధాని మోదీ శనివారం ఈ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశ సమగ్రాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం దీనికి నిదర్శనమని తెలిపారు. దేశాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్‌లాగా దేశాన్ని వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్‌లో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 14 సంవత్సరాల వయసున్న బాలికలకు ప్రతిఏటా 1.15 కోట్ల టీకాలను పంపిణీ చేయాలన్నది లక్ష్యం. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో ఈ టీకాను ఉచితంగా అందిస్తారు.




మృతదేహాలను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానిక యువకులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

పేలిన ప్రాణాలు!

21 మంది దుర్మరణం

'గోదావరి జిల్లా'లో మరో బాణసంచా విషాదం

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో భారీ విస్ఫోటం



- శివారు పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్
- సింగారమ్మ జాతరకోసం భారీగా బాణసంచా ఆర్డర్
- తయారీ పనిలో నిమగ్నమైన కార్మికులు
- కలర్ చిచ్చుబుడ్లలో మందు కూరుతుండగా నిప్పు
- నారబాంబులకు అంటుకోవడంతో వరుస పేలుళ్లు
- ఎనిమిది కిలోమీటర్ల వరకూ వినిపించిన శబ్దం
- అరకిలోమీటరుదాకా ఎగిరి పడిన మృతదేహాలు
- గుర్తుపట్టలేనంతగా కాలి, ముక్కలైన శరీరాలు

(కాకినాడ/సామర్లకోట - ఆంధ్రజ్యోతి)

అది... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు! గోదావరి కాలువ అవతల పచ్చని పొలాల మధ్య... సూర్యశ్రీ ఫైర్ వర్క్! శనివారం మధ్యాహ్నం 2.10 గంటలు! శుభకార్యాలు, జాతర్ల కోసం భారీగా బాణసంచా తయారు చేయడంలో కార్మికులు నిమగ్నమయ్యారు. అంతలోనే... ఒక్కసారిగా పెను విస్ఫోటం! ఎనిమిది కిలోమీటర్ల దూరానికీ వినిపించిన శబ్దాలు! భూకంపం వచ్చిందా అన్నంతగా కంపించిన పరిసరాలు! వరుసగా పేలుళ్ల మీద పేలుళ్లు జరుగుతూనే ఉన్నాయి. 20 మీటర్ల ఎత్తుదాకా మంటలు ఎగిసి పడ్డాయి. పేలుళ్ల ధాటికి అక్కడికక్కడే 21 మంది చనిపోయారు. బాణసంచా తయారీ కేంద్రానికి సంబంధించిన రెండు షెడ్లు కుప్ప కూలిపోయాయి. కార్మికులకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు ముక్కలు ముక్కలుగా విడిపోయాయి. సినిమాల్లో చూపినట్లుగా సైకిళ్లు గాలిలోకి ఎగిరి కిందపడ్డాయి. ఇనుప డ్రమ్ములు, స్తంభాలు తుత్తునియలయ్యాయి. పేలుడు తీవ్రత తెలుపుతూ... ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది.



అసలేం జరిగింది...

వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్ బాణసంచా తయారీ కేంద్రం బాణాసంచా తయారీకి ప్రసిద్ధి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శుభకార్యాలు, జాతరలు, పండగలకు ఇక్కడి నుంచే బాణసంచా వెళ్తుంది. అడబాల శ్రీను అనే వ్యక్తి తన ఇద్దరు కుమారులు అడబాల వీరబాబు, అర్జున్ పేర్లతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తాజాగా... జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం సింగారమ్మ చింత అమ్మవారి ఉత్సవాలకోసం భారీ ఆర్డరు వచ్చింది. దీంతో తాత్కాలికంగా మరికొందరు కార్మికులను నియమించుకున్నారు. సామర్లకోట, వేట్లపాలెం, మేడపాడు తదితర ప్రాంతానికి చెందిన సుమారు 70 మంది శనివారం బాణసంచా తయారీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి వారిలో దాదాపు సగంమంది భోజనానికి వెళ్లారు. మిగిలిన వారంతా పనిలో నిమగ్నమయ్యారు. వివిధ వర్గాల కథనం ప్రకారం... కలర్ చిచ్చుబుడ్ల తయారీ దగ్గరే తొలి చిచ్చు పుట్టింది. ఈ చిచ్చుబుడ్లలో మందు కూరేందుకు మెల్లగా సుత్తితో కొడతారు. ఆ సమయంలోనే నిప్పు రవ్వ రాజుకుంది. అది పక్కనే ఉన్న 'సెర్ఫ్ లైట్' అనే మరోరకం బాణసంచాపై పడింది. మెల్లగా పేలుడు మొదలైంది. అక్కడికి దగ్గరే వందల సంఖ్యలో 'నార బాంబులు' (బ్యాటరీ బాంబులు) ఉన్నాయి. వాటికీ మంట అంటుకుంది. దీనికి తోడు... తమిళనాడు నుంచి తెప్పించిన పేలుడు రసాయనం రెండు డ్రమ్ముల్లో నిండుగా ఉంది. ఇంకేముందీ... యుద్ధంలో బాంబులు కురిపిస్తున్నట్లుగా పేలుళ్లు మొదలయ్యాయి. ఆగకుండా... పేలుతూనే ఉన్నాయి. వందల సంఖ్యలో ఉన్న నారబాంబుల వల్లే పేలుళ్ల తీవ్రత ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఆ ప్రాంతం గోదావరి కాలువకు ఆవల, పొలాల మధ్య ఉండటంతో... తక్షణ సహాయం అందే దిక్కూ లేకుండా పోయింది. పెద్ద ఎత్తున ఎగసి పడుతున్న మంటలు, బాణసంచా పేలుడు, దట్టమైన పొగ కారణంగా... లోపలికి వెళ్లలేకపోయామని, అప్పటికే అక్కడున్న చాలా మంది ప్రాణాలు కోల్పోయారని స్థానికులు తెలిపారు.

హుటాహుటిన..

భారీ విస్ఫోటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు, డీఎస్పీలు, సీఐలు.... ఇలా అందరూ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం నుంచి పెద్ద ఎత్తున ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేశాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాల గుర్తింపు, ఆసుపత్రులకు తరలింపు వంటి వ్యవహారాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మళ్లీ... మళ్లీ... పేలుడు

మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల దాకా ఫైరింజన్లతో మంటలు ఆర్పుతూనే ఉన్నారు. ఈ క్రమంలో బాణసంచా తయారీ కేంద్రంలో ధ్వంసమైన ఒక రేకులషెడ్డు, కాంక్రీట్ భవనం అడుగున సగం కాలకుండా ఉన్న మందుగుండు మళ్లీ పేలింది. ఆ సమయంలో... కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉన్నారు. పేలుడు ధాటికి పరుగులు తీశారు.

మాంసపు ముద్దలుగా...

పేలుళ్ల తీవ్రతకు మృతదేహాలు బొగ్గులుగా మారిపోయాయి. చిందరవందరగా పడిపోయాయి. ఏ మృతదేహం ఎవరిదోకూడా గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. తల, కాళ్లు చేతులు తెగిపడి ఎగిరి... పక్కనే ఉన్న పొలాల్లో మాంసపు ముద్దలు పడ్డాయి. మరికొందరైతే... ఉన్నచోట ఉన్నట్లుగానే బుగ్గి అయ్యారు. మృతుల్లో కొంతమందిని అతి కష్టంపై వెతికి పోలీసులు, స్థానికులు గుర్తించారు. ఘటనా స్థలానికి ఐదారువందల మీటర్ల దూరంలోనూ గోదావరి కాలువ గట్టుపై తలలేని మొండెం కనిపించింది. ముద్దలు ముద్దలుగా, తునాతునకలైన మృతదేహాలను ఒకచోట చేర్చి స్ట్రెచర్ మీద ఎక్కించేందుకు ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం వణికిపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని మృతదేహాలను అతికష్టం మీద గుర్తించగా... గుర్తుపట్టలేని మృతదేహాలకు నంబర్లు వేసి సామర్లకోట మార్చురీకి తరలించారు.

మృతుల వివరాలు

పేరు (వయసు)	గ్రామం
గండి మంగ(43)	వేట్లపాలెం
వల్లూరి రవి(35)	వేట్లపాలెం
కడింపల్లి కృపమ్మ	-
గంపల మంగ	-
గంపల నాగరాజు	-
బిక్కిన కరుణ సుబ్బారావు(45)	వేట్లపాలెం
సాధనాల సత్యవేణి(44)	వేట్లపాలెం
గొడతా నాని (26)	వేట్లపాలెం
తుంపాల లోవ(38)	వేట్లపాలెం
చింతల రమణ(60)	వేట్లపాలెం
మందపల్లి చిన్ని(44)	వేట్లపాలెం
గొడతా మహేష్(41)	వేట్లపాలెం
దర్భిపాటి నాని(38)	వేట్లపాలెం
ఏడిద సంపత్‌కుమార్(25)	వేట్లపాలెం
నూకెళ్ల దేవి(45)	వేట్లపాలెం
గొడతా వీర వెంకటరమణ(48)	వేట్లపాలెం
కడింపల్లి ధనరాజుజు(55)	వేట్లపాలెం
సకుమల్ల రాఘవ(50)	వేట్లపాలెం
అడబాల శ్రీనివాసరావు(55)	వేట్లపాలెం
మాకర రాఘవమ్మ(55)	పెదబ్రహ్మదేవం

మరొకరిని గుర్తించాల్సి ఉంది

క్షతగాత్రులు వీరే..

పేరు (వయసు)	గ్రామం
మోర్త శ్రీను (30)	పెద్దాపురం (జీజీహెచ్, కాకినాడ)
సప్పా సత్యవేణి(34)	వేట్లపాలెం (జీజీహెచ్, కాకినాడ)
కాతేటి శ్రీను(33)	వేట్లపాలెం (జీజీహెచ్, కాకినాడ)
చిటికెల లక్ష్మి(45)	వేట్లపాలెం (జీజీహెచ్, కాకినాడ)
దర్భిపాటి రాజు(30)	సామర్లకోట (జీజీహెచ్, కాకినాడ)
వేమగిరి లోవరాజు(40)	సామర్లకోట (జీజీహెచ్, కాకినాడ)
వేమగిరి దావీదు(38)	సామర్లకోట (జీజీహెచ్, కాకినాడ)
దర్భిపాటి లోవరాజు(40)	సామర్లకోట (జీజీహెచ్, కాకినాడ)
పోలపాటి శ్రీను(45)	సామర్లకోట (జీజీహెచ్, కాకినాడ)
చప్పల శామ్యూల్(30)	కొండయ్యపేట (పెద్దాపురం సీహెచ్‌సీ)

వేట్లపాలెం దుర్ఘటన మృతులకు పోస్టుమార్టం పూర్తి

కాకినాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రం సూర్య శ్రీ ఫైర్ వర్క్స్‌లో జరిగిన ఘోర ప్రమాద దుర్ఘటనలో మరణించిన కూలీల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. శనివారం రాత్రి మృతుల కుటుంబీకులు, బంధువులకు అధికారులు మృతదేహాలను అప్పగించారు. అంత్యక్రియల ఖర్చు కింద 25 వేల రూపాయల చొప్పున అందజేశారు.

'గన్‌పౌడర్' పేల్చేసింది

- శబ్ద తీవ్రత కోసం అధిక మోతాదులో వినియోగం
- యజమాని అడబాల అర్జున్ లొంగుబాటు
- ఆయన తండ్రి శ్రీను పేలుడు స్థలిలోనే మృతి


అడబాల శ్రీనివాస్


అడబాల అర్జున్, వీరబాబు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వేట్లపాలెం ఘటనలో గన్‌పౌడర్ పేలడం వల్లే భారీ విషాదం చోటుచేసుకుందని పోలీసులు భావిస్తున్నారు. గన్‌పౌడర్‌ను ఎంత వాడితే అంతగా బాణసంచా పేలుతుందంటూ భద్రతను గాలికి వదిలేశారు. కాగా, బాణసంచా కేంద్రం అడబాల అర్జున్ పేరిట రిజిస్టర్ అయి ఉంది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఆయన పోలీసుల ముందు లొంగిపోయారు. ఆయన సోదరుడు వీరబాబు పరారీలో ఉన్నారు. కాగా... తయారీ కేంద్రం ప్రధాన నిర్వాహకుడైన వీరి తండ్రి అడబాల శ్రీను సంఘటన స్థలంలోనే చనిపోయారు.

దంపతుల మృత్యువాత..

వేట్లపాలెం పేలుళ్ల మృతుల్లో భార్యభర్తలు ఉన్నారు. గంపల మంగ, గంపల నాగరాజు దంపతులు రోజూ బాణసంచా తయారీ కేంద్రానికి వచ్చి, పని ముగించుకుని కలిసి ఇంటికి వెళ్లేవారు. వారిద్దరిని మరణం కూడా ఒకేసారి కబళించేసింది.

మాటలకందని విషాదం: లోకేశ్

మంత్రి లోకేశ్ స్పందిస్తూ... 'బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా. ఇది మాటలకందని విషాదం. మృతులకు నివాళులర్పిస్తున్నా. వారి కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం' అని హామీ ఇచ్చారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: జగన్

వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తూ... 'ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన పరిహారం ప్రకటించి అండగా నిలవాలి. గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని పేర్కొన్నారు.





మా తల్లి ఎక్కడో..?.. కుమార్తెల రోదన

బాణసంచా తయారీ కేంద్రంలో పనికి వెళ్లిన తమ తల్లి నూకళ్ల దేవి ఆచూకీ తెలియడం లేదంటూ సంఘటనా స్థలం వద్ద ఆమె ఇద్దరు కూతుళ్ల రోదన అందరినీ కలచివేసింది. భోజనం పూర్తయిందని, ఇప్పుడు మళ్లీ లోపలకు వెళ్తున్నట్లు తమ తల్లి ఫోన్ చేసిందని, కొంత సమయానికే పేలుళ్లు జరిగినట్లు ఫోన్ వచ్చిందని కూతుళ్లు తెలిపారు. కాగా ప్రమాద సమయంలో కొందరు భోజనానికి వెళ్లడంతో ప్రమాదం నుంచి బయటపడినట్లు చెబుతున్నారు.



చేరుకునే దారి లేక.. చేజారిన ప్రాణాలు

ఎటుచూసినా పొలాలు, బురద

- సకాలంలోనే చేరిన ఫైర్ వాహనాలు, అంబులెన్స్‌లు
- కానీ, ముందుకెళ్లే దారి లేక నిస్సహాయంగా..
- అతికష్టం మీద పేలుడు స్థలికి..
- అప్పటికే చాలామంది సజీవ దహనం

సామర్లకోట/పిఠాపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పెనుప్రమాదం జరిగిన బాణసంచా తయారీ కేంద్రం వద్దకు చేరుకునే దారిలేదు. కనుచూపు మేర పొలాలు, ఎటుచూసినా మోకాలు లోతు బురద. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు సకాలంలోనే ఘటనాస్థలికి చేరుకున్నా ముందుకెళ్లే దారి కనిపించలేదు. దీంతో నిస్సహాయంగా చాలాసేపు నిలిచిపోయాయి. ఎట్టకేలకు అవరోధాలు దాటుకుని అక్కడకు వెళ్లేసరికే ఘోరం జరిగిపోయింది. ప్రమాదంలో చిక్కుకున్నవారిలో సగానికి పైగా సజీవ దహనమయ్యారు. ఒకవేళ అక్కడికి నేరుగా చేరుకునే దారి ఉంటే భారీ ప్రాణనష్టం ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించి కాపాడుకునే అవకాశం ఉండేది. పొలాల మధ్యలో బాణసంచా తయారీ కేంద్రం ఉండడం, చుట్టుపక్కల బురదమయంగా ఉండడంతో సహాయక చర్యలను వెంటనే చేపట్టడం కష్టంగా మారింది. బాణాసంచా తయారీ కేంద్రంలో రెండు గంటలకు పైగా పేలుళ్లు కొనసాగాయి. దీంతో ఎవరూ సంఘటనా స్థలానికి చేరుకోలేకపోయారు. స్థానికులు పేలుడు ధ్వనులు విని అక్కడకు చేరుకున్నారు. వీరు ఎవరూ అడుగు ముందుకు వేయలేకపోయారు. అగ్నిమాపక యంత్రాలు అక్కడకొచ్చినా ప్రమాద స్థలానికి చేరుకోలేకపోయాయి. స్థానికులు, ఫైర్ సిబ్బంది చొరవ తీసుకుని అక్కడకు వెళ్లేసరికి మంటల్లో పలువురు సజీవ దహనమయ్యారు. ప్రమాదంలో కాలిపోయి తీవ్రంగా గాయపడ్డవారిని పంట పొలాల మీదుగా అతి కష్టం మీదుగా ఆస్పత్రులకు తరలించారు. ఈ తరలింపు ప్రక్రియ సాగుతుండగా మృతదేహాలు ఎగిరిపడడంతో వాటిని వెతకడం కోసం ఫైర్, పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. సమీపంలోని కాలువల్లో మృతదేహాల బాగాలు పడ్డాయి.


పంట పొలాల్లో మృతదేహాల కోసం వెతుకులాట

ఎలా అనుమతించారు?

బాణసంచా తయారీ కేంద్రం నిర్వాహకుడిపై గతంలోనే విమర్శలు వచ్చాయి. ఆయన నడుపుతున్న మరో కేంద్రంలో కొంతకాలం క్రితం ప్రమాదం జరిగింది. అటువంటప్పుడు ఆయనను తిరిగి బాణసంచా తయారీకి ఎలా అనుమతించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా దీపావళి సమయంలో భారీగా బాణసంచా తయారీ చేస్తూ ఉంటారు. ఇప్పుడు ఇంత భారీగా బాణసంచా ఎందుకు తయారు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ కేంద్రం నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు కూడా సరుకు పంపుతారని చెబుతున్నారు. 2గంటలకు పైగా పేలుళ్లు జరిగాయంటే ఎంత భారీస్థాయిలో నిల్వ ఉంచారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, మార్చి 31వరకూ ఈ తయారీ కేంద్రానికి అనుమతులు ఉన్నాయని చెప్తున్న అధికారులు అక్కడ అన్ని నిబంధనలు పాటించారా అనే విషయాన్ని చెప్పలేకపోతున్నారు. గతంలో ఇదే వేట్లపాలెంలో ప్రమాదం జరిగి పదిమంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది రాయవరం వద్ద జరిగిన ప్రమాదంలో పలువురు మరణించారు. అయినా సరైన తనిఖీలు చేయకపోవడం, ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి చేయడం మినహా మిగిలిన సమయాల్లో పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


ప్రమాదంలో ధ్వంసమైన షెడ్డు

అనుమతి కిలోల్లో తయారీ క్వింటాళ్లలో

అడుగడుగునా ఉల్లంఘనలే

- నైపుణ్యం లేని కూలీలతో పనులు
- పరిమితికి మించి వినియోగం
- రోజుకు 15 కిలోల లోపు బాణసంచా తయారీకి మాత్రమే అనుమతి
- ప్రమాద సమయంలో 800 కిలోల నిల్వ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రం సూర్య శ్రీ ఫైర్ వర్క్స్ నిర్వాహకులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారు. ఈ బాణసంచా కేంద్రానికి అనుమతులు ఎలా ఇచ్చారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగితే క్షతగాత్రులను కాపాడేందుకు వాహనాలు వెళ్లడానికి వీలుగా రహదారి మార్గం ఉండాలి. కానీ ఇరుకైన రోడ్డు ఉంది. ఇరవై అడుగుల ఎత్తులో ఉన్న మట్టిరోడ్డులో ప్రయాణించి కిందకు దిగాలి. నాలుగేళ్ల కిందట ఈ కంపెనీ బాణసంచా కేంద్రంలో ప్రమాదం జరిగినా గుట్టుగా ఉంచారు. ఆ తర్వాత తయారీ కేంద్రం మార్చి ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఏర్పాటు చేశారు. దీనికి రోజుకు పది నుంచి పదిహేను కేజీలలోపు మాత్రమే బాణసంచా తయారీకి అనుమతి ఉంది. కానీ ఈ కేంద్రంలో శనివారం 800 కేజీల బాణసంచా ఉంది. గోకవరం మండలంలో అమ్మవారి జాతర ఉత్సవాలకు బాణసంచా ఆర్డర్ భారీగా రావడంతో యజమాని అడ్డగోలు వ్యవహారానికి తెరలేపారు. లక్షలకు లక్షలు సంపాదించాలని, ఆర్డర్లు పూర్తి చేయడానికి ఏకంగా 70 మంది కూలీలను పనికి దించారు. వాస్తవానికి బాణసంచా తయారీలో నిపుణులైన కార్మికులను వినియోగించాలి. ప్రమాదం జరిగితే కుటుంబానికి అండగా ఉండేలా బీమా చేయించాలి. కానీ ఇవేవీ చేయలేదు. అతి తక్కువ కూలి డబ్బులు ఇచ్చి పనికి పురమాయించారు. నైపుణ్యం లేని కార్మికులు కావడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో 800 కేజీల బాణసంచా నిల్వ ఉండగా, అందులోను భారీ విస్ఫోటానికి దారితీసే నారబాంబులు ఉన్నాయి. దీంతో భారీ ప్రమాదం సంభవించింది. మృతుల సంఖ్య పెరగడానికి ఇది కూడా ఓ కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన తర్వాత ఫైర్‌ఇంజన్లు వచ్చినా 20 అడుగులకు మించి ఎత్తు ఉన్న గోదావరి కాలువ వెంబడి రోడ్డు నుంచి ప్రమాద స్థలానికి దిగడానికి రోడ్డు లేదు. దీంతో వాహనాలను అక్కడే ఉంచి పైపుల ద్వారా మంటలను అదుపు చేశారు. ఫైరింజన్లు ఆపడంతో ఇరుకైన రోడ్డులో అంబులెన్స్‌ల రాకపోకలకు వీల్లేకుండా పోయింది. బాణసంచా కేంద్రానికి లైసెన్స్ ఉందని అధికారులు గుర్తించారు. కానీ ఈ కేంద్రంలో పనిచేస్తున్న కూలీలు పరిమితికి మించి ఉన్నట్లు తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. మృతుల సంఖ్య పెరగడానికి ఇది కూడా ఓ కారణం.



సమీపంలోని వరిచేలో పడివున్న మృతదేహం

నిర్లక్ష్యపు నిప్పు

మళ్లీ మళ్లీ మండుతోంది

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో నిత్య ప్రమాదాలు
- తక్కువ కూలికి మహిళలు, పిల్లలతో తయారీ
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, పోలీసు, ఫైర్

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

సరిగ్గా అయిదునెలల కిందట కోనసీమ జిల్లా రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుతో పదిమంది వరకు సజీవ దహనమయ్యారు. 2014 అక్టోబరులో పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఏకంగా 18మంది మృతిచెందారు. ప్రమాదం జరిగాక రాష్ట్ర ప్రభుత్వ ఆగ్రహం... అధికారుల హడావుడి! అంతా రెండురోజులే! ఆ తర్వాత అంతా మామూలే! ఇప్పుడు వేట్లపాలెంలో మరో పెను విషాదం! రాష్ట్రం మొత్తంలో ఎనభై శాతం మందుగుండు తయారీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే జరుగుతుంది. కొమరిపాలెం, వేట్లపాలెం, ద్రాక్షారామం, గొల్లప్రోలు, పెదపూడి మందుగుండు తయారీ కేంద్రాలకు బాగా పేరు. దాదాపు ఎనభై ఏళ్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బాణసంచా తయారీ జరుగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివాహాలు, రాజకీయ సభలు, జాతర్లు, తీర్థాలు, పండగలు ఏవైనా భారీస్థాయిలో బాణసంచా మోత మోగాలంటే ఇక్కడి నుంచి సరుకు వెళ్లాల్సిందే. ఎనభైశాతం లాభాలు ఇచ్చే పరిశ్రమ ఇదే! మరీ ముఖ్యంగా వేట్లపాలెంలో ఏడాదికి రూ.60 కోట్లకుపైగా విలువైన మందుగుండు తయారు చేస్తారు. జిల్లా మొత్తం మీద రూ.280 కోట్ల టర్నోవర్ ఉంటుందని అంచనా. దీపావళికి కోట్లలో వచ్చే ఆర్డర్ల కోసం తయారీదారులు తక్కువ కూలి ఇచ్చి మహిళలు, పిల్లలను సైతం ఇందులోకి దించుతున్నారు. ఏమాత్రం నైపుణ్యం లేక చేసే తప్పిదాలతో అనేకమంది దుర్మరణం పాలవుతున్నారు. నిపుణులకు ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో నిర్వాహకులు సాధారణ కూలీలతో తయారు చేయించేస్తున్నారు. తయారీ సమయంలో నిర్దిష్ట దూరం పాటించాలి. చేతికి గ్లౌజులుండాలి. ఇలాంటి జాగ్రత్తలను పట్టించుకునే వారు లేరు. ఈ జిల్లాలోనే ఏటా కనీసం 40 మంది బాణసంచా ప్రమాదాల్లో చనిపోతున్నారు. కార్మికులకు బీమా కూడా ఉండటం లేదు.

తక్కువకు కొని.. కోట్లు తిని..

బాణసంచా తయారీ కేంద్రాల్లో అనుమతులు ఉన్నవాటి కంటే అనుమతులు లేనివే అధికం. వీటి ని ఎప్పటికప్పుడు పోలీసు, రెవె న్యూ, ఫైర్ అధికారులు పర్యవేక్షిస్తుండాలి. అనుమతులు లేని వాటి ని నిలిపివేయాలి. అనుమతులు ఉన్నవాటిలో ఫైర్‌ఫైటింగ్ సిస్టం అమలు పక్కాగా ఉందో లేదో తనిఖీ చేయాలి. పిల్లలు, మహిళలు పనిచేస్తున్నారో లేదో తరచూ కార్మికశాఖ పర్యవేక్షించాలి. ఇవేవీ పక్కాగా అమలు జరగడం లేదు. ఏదైనా ఘటన జరిగిన తర్వాత రెండు రోజులు హడావుడి చేయడం... ఆ తర్వాత మళ్లీ 'మామూలు'గా మారిపోవడం!



సామర్లకోట మండలం వేట్లపాలెంలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

20 లక్షల పరిహారం

- ఆర్డీవో,డీఎస్పీ,ఫైర్, లేబర్ ఆఫీసర్ల సస్పెన్షన్
- ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశం
- హుటాహుటిన వేట్లపాలేనికి చంద్రబాబు

కాకినాడ, అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం పేలుళ్ల ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, క్షతగాత్రులకు ప్రభుత్వమే ఉచితంగా, మెరుగైన వైద్యం అందిస్తుందని తెలిపారు. ఈ ఘటనలో పర్యవేక్షణా లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని, దీనికిగాను ఆర్డీవో శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజుతో పాటు జిల్లా కార్మిక శాఖ అధికారి, ఫైర్ ఆఫీసర్లను తక్షణం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పేలుడు ఘటనను సీరియస్‌గా తీసుకున్నానని, సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నానన్నారు. నివేదిక అందిన అనంతరం మిగిలిన బాధ్యులపై కూడా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అంతకు ముందు...దీనిపై ఆయన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో చర్చించారు. ఈ ఘటనలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతోనే నిబంధనల ఉల్లంఘన జరిగిందని, దాని వల్లే ఈ స్థాయి ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. వెనువెంటనే అధికారులపై చర్యలకు ఉపక్రమించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి శనివారం రాత్రి ఘటనా స్థలిని సీఎం పరిశీలించారు. అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అన్నిరకాల మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి వద్ద చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "ఇటీవల కోనసీమ జిల్లాలోని కొమరిపాలెంలో బాణసంచా కేంద్రంలో పేలుడు జరిగింది. దానిపై విచారణ జరిపించి, బాణసంచా కేంద్రాల విషయంలో ఏం చర్యలు తీసుకోవాలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశాం. కానీ, అవి అమలు కాలేదు. కొంతమంది విచ్చలవిడి తనానికి అలవాటుపడ్డారు. ఇటువంటి వారందరిపైనా క్రిమినల్ చర్యలతోపాటు ప్రాసిక్యూట్ చేసి జీవితాంతం జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం. వారి ఆస్తులు జప్తు చేసి బాధితుల కుటుంబాలకు అందజేస్తాం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. మృతులు, క్షతగాత్రుల కుటుంబాల్లో చిన్నారులను చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. ఇళ్లు కట్టించి ఇస్తాం. అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు.



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న చంద్రబాబు

ప్రొటోకాల్ పక్కన పెట్టి..

విజయనగరం జిల్లా పర్యటనలో ఉండగా చంద్రబాబుకు సంఘటన గురించి తెలిసింది. మరుక్షణమే ఆయన నేరుగా సామర్లకోట చేరుకున్నారు. బులెట్ ప్రూఫ్ కార్లతో ఉన్న ప్రత్యేక కాన్వాయ్‌లో సీఎం స్థాయి నాయకులు పర్యటిస్తారు. అయితే, ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు సాధ్యమైనంత త్వరగా పరామర్శించాలనే ఉద్దేశంతో కాకినాడ జిల్లా కలెక్టర్ కారులోనే తన పర్యటన కొనసాగించారు. సీఎం వెంట మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేశ్, ఎంపీలు సానా సతీశ్ బాబు, తంగెళ్ల ఉదయశ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు ఉన్నారు.

అన్నీ విచారణలో తేలతాయి

బాణసంచా కేంద్రం నిర్వాహకులు ఎక్కడ ఉన్నా పట్టుకుని తీరతామని సీఎం స్పష్టం చేశారు. సంఘటనకు గల కారణాలన్ని విచారణలో తేలతాయని తెలిపారు. "వీరికి అనుమతులు ఎలా వచ్చాయన్న అంశాలు విచారణలో పరిశీలిస్తాం. ఇక బాణ సంచా తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు పెట్టి వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తాం. అనుమతులు లేకుండా ఎవరైనా బాణ సంచా తయారు చేస్తే ఆస్తుల జప్తుతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటాం" అని చంద్రబాబు చెప్పారు.

క్షతగాత్రులకు డిప్యూటీ సీఎం పవన్ పరామర్శ

కాకినాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో బాణసంచా ప్రమాదంలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. శనివారం రాత్రి 11.45 గంటల సమయంలో ఆసుపత్రికి చేరుకున్న డిప్యూటీ సీఎం క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హోం మంత్రి అనిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు ఉన్నారు. ప్రమాద సంఘటన వివరాలను పవన్‌కు కలెక్టర్, ఎస్పీ వివరించారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని పవన్ ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామన్నారు.

బాణసంచా పేలుడుపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ, అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బాణసంచా పేలుడు సంఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు రాష్ట్రపతి ఎక్స్‌లో స్పందించారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. 'గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. మరణించిన వారికి కుటుంబాలకు రూ.2 లక్షలు వంతున, గాయపడిన వారికి రూ.50 వేల వంతున పరిహారాన్ని పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి ఇస్తాం' అని ప్రకటించారు. ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, వేట్లపాలెం సంఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందిస్తూ... బాణసంచా తయారీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడినందునే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి అని అన్నారు.

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో

సీఎం, డిప్యూటీ సీఎం

పేలుడు ఘటనపై చర్చ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారి మధ్య బాణసంచా పేలుడు ఘటనపై చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలు, క్షతగాత్రులను పరామర్శించిన సీఎం అమరావతికి వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు విచ్చేశారు. అదే సమయంలో బాధితుల పరామర్శకు కాకినాడ బయలుదేరిన పవన్ కల్యాణ్ ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై నేతలిద్దరూ చర్చించుకున్నట్టు సమాచారం. ఆ సమయంలో వారి వెంట మంత్రి నారాయణ కూడా ఉన్నారు.



రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ మంత్రి నారాయణ

బహ్రెయిన్‌లో తెలుగు ప్రజల ఆందోళన

- యూఎస్ నేవీ బేస్‌పై ఇరాన్ దాడితో భయాందోళన

విజయవాడ/గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ బేస్‌పై ఇరాన్ క్షిపణి దాడులతో.. ఆ దేశంలో ఉంటున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 50 వేల మంది ప్రజలు బ్రహెయిన్‌లో నివసిస్తున్నారు. బహ్రెయిన్ రాజధాని మనామాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారు. బహ్రెయిన్‌లో యూఎస్ నేవీ బేస్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న జూఫర్ ప్రాంతంలో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన వల్లభనేని ప్రవీణ్ కుటుంబం నివసిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులుగా పనిచేసిన వల్లభనేని బాబూరావు సోదరుడైన వల్లభనేని సత్యనారాయణ కుమారుడే ప్రవీణ్. బహ్రెయిన్ దేశంలో ఎస్కలేటర్స్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత పది రోజులుగా ఆ దేశ అధికారులు దాడులు జరగవచ్చని స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్టు ప్రవీణ్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. యూఎస్ బేస్ క్యాంప్ మీద దాడులు జరగటంతో కొంత ఆందోళన కలిగిందని చెప్పారు. బహ్రెయిన్, భారత ఎంబసీలు తమతో నిత్యం టచ్‌లో ఉంటున్నాయని, ఇప్పటి వరకు సురక్షితంగానే ఉన్నామని చెప్పారు.

ఏఐపై అధ్యాపకులకు శిక్షణ

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల అధ్యాపకులకు 'కృత్రిమ మేధస్సు(ఏఐ) క్రమశిక్షణ-నిర్దిష్ట అనువర్తనాలు' అంశంపై 5 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి బి.తిరుపతిరావు తెలిపారు. మార్చి 2 నుంచి 6 వరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా కార్యక్రమం, వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా విభిన్న విద్యా విభాగాలలోని అధ్యాపకులకు ఏఐపై స్పష్టమైన, ఆచరణాత్మక అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒక ఏఐ చాంపియన్‌ని తయారు చేయడం కూడా ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన అధ్యాపకులు మాస్టర్ ట్రైనర్లుగా టీవోటీ మోడల్ కింద మిగిలిన అధ్యాపకులకు శిక్షణ ఇస్తారన్నారు.

నేడు అమరావతికి సీజేఐ

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు జస్టిస్ సూర్యకాంత్ హాజరు
- రాజధానిలో జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు అతిథి గృహానికి శంకుస్థాపన
- న్యాయమూర్తుల నివాస సముదాయం ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్)/తుళ్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆయన శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్నారు. రేణిగుంటలోని విమానాశ్రయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు సీజేఐకు స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని సీజేఐ దర్శించుకుంటారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్ సమీపంలోని దామినేడు వద్ద ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. ఈ ఏర్పాట్లను శనివారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పరిశీలించారు. తిరుపతిలో పర్యటన అనంతరం సీజేఐ రాజధాని అమరావతికి బయలుదేరుతారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.



అమరావతిలో ఆదివారం ప్రారంభించనున్న న్యాయమూర్తుల నివాస సముదాయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

అమరావతిలో సీజేఐ పర్యటన ఇలా..

జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం మధ్యాహ్నం 3.30 సమయంలో అమరావతి రాజధానికి చేరుకుంటారు. పిచ్చుకలపాలెంలో నిర్మించనున్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ప్రాంతం వద్ద సీఎం చంద్రబాబు ఆయనకు స్వాగతం పలుకుతారు. 3.35 నుంచి 3.55 గంటల వరకు భూమిపూజ, శిలాఫలకం ఆవిష్కరణ, సైట్‌ప్లాన్స్‌ని పరిశీలిస్తారు. సాయంత్రం 4.05 గంటల నుంచి 4.25 గంటల వరకు నేలపాడులో ఏపీ హైకోర్టు అతిథి గృహం నిర్మాణానికి భూమిపూజ, శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు నేలపాడులో నూతనంగా నిర్మించిన హైకోర్టు జడ్జీల నివాస సముదాయంని ప్రారంభిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు లోక్‌భవన్‌లో గవర్నర్ నివాసానికి వెళతారు. తర్వాత దక్షిణ భారత్‌లోనే తొలిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మీడియేషన్‌పై విజయవాడలో జరగనున్న సింపోజియంలో జస్టిస్ సూర్యకాంత్ పాల్గొంటారు.

జీప్లస్ 3గా అతిథి గృహం

రాజధాని అమరావతిలో న్యాయమూర్తుల గెస్ట్ హౌస్, క్లబ్ 6,300 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణం జరగనుండగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.69 కోట్లు మంజూరైంది. మొత్తం సైట్‌లోని భూమిలో 20 శాతం మాత్రమే భవన నిర్మాణానికి కేటాయించి, మిగతా 80 శాతం పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ ప్లాన్ రూపొందించారు. విశాలమైన రహదారితో హైకోర్టు భవనాన్ని ఈ అతిథి గృహానికి అనుసంధానించారు. జీ ప్లస్3తో నిర్మించే ఈ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో సూపర్ మార్కెట్, స్విమ్మింగ్ పూల్, పురుషులు, మహిళల కోసం ప్రత్యేక స్పా సదుపాయాలు, లాంజ్ ఏర్పాటు చేస్తారు. మొదటి అంతస్తులో జిమ్ యోగా, ఏరోబిక్స్ హాల్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, ఫంక్షన్ హాల్‌తో కూడిన మల్టీపర్పస్ మాల్ నిర్మించనున్నారు. రెండో అంతస్తులో 6 ప్రీమయం సూట్ గదులు, 2 డీలక్స్ గదులు ఉంటాయి. మూడో అంతస్తులో 4 ప్రీమియం సూట్ గదులు, 1 ప్రెసిడెన్షియల్ సూట్, 1 డీలక్స్ గదితోపాటు మొత్తంగా 15 గదులు న్యాయమూర్తుల అవసరాలకు కోసం నిర్మిస్తారు.



సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

వలస కూలీల వరుస

- వ్యవసాయ పనుల ప్రారంభంతో ఎన్టీఆర్ జిల్లాకు ఒడిశా కార్మికులు
- రాష్ట్రంలో రైతు కూలీలకు కొరత





విజయవాడ/ఉయ్యూరు, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో పొరుగు రాష్ట్రాల నుంచి వలస కూలీల రాక మొదలైంది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాలో స్థానికంగా కూలీల కొరత తీవ్రంగా ఉండటం, కూలి రేట్లు అమాంతం పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని జగదల్‌పూర్ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు తమ కుటుంబాలతో సహా విజయవాడకు చేరుకున్నారు. ఈ కూలీలను ఉయ్యూరు పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు రైతులు తమ గ్రామాలకు తీసుకెళ్లారు. ఉయ్యూరుకు చెందిన ఒక రైతు తన పొలంలో మినుము పంట కోత కోసం కొందరు కూలీలను తీసుకువెళ్లారు. స్థానికంగా రైతు కూలీలు దొరకడం గగనంగా మారిందని, ఉన్నవారు కూడా అధిక వేతనం డిమాండ్ చేస్తున్నారని రైతులు తెలిపారు. దీంతో ఒడిశా కూలీలపై ఆధారపడక తప్పడం లేదని చెబుతున్నారు. ఒడిశా నుంచి వచ్చిన కూలీలకు రైతులతో కుదిరిన ఒప్పందం ప్రకారం సొమ్ములు చెల్లిస్తున్నారు. దంపతులకు రోజుకు రూ.1300 చొప్పున చెల్లించనున్నట్టు రైతులు తెలిపారు. దీంతోపాటు వీరికి వసతి, సౌకర్యాలను రైతులే స్వయంగా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 20 రోజుల పాటు పొలాల్లో పని చేస్తారని, అనంతరం.. ఇతర ప్రాంతాల్లో పనులుంటే అక్కడికి వెళ్తారని ఓ రైతు తెలిపారు. ఇక, తమ సొంత రాష్ట్రంలో కంటే మెరుగైన ఉపాధి, వేతనం కూడా లభించడంతో ఇతర రాష్ట్రాలకు వస్తున్నట్టు ఒడిశా కూలీలు చెబుతున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.